
మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 32 • పేజీలు:12+16 • వెల: రూ.5 మంగళవారం • 2-1-2018 www.manamnews.com /manamnews



'నవనీత' హనుమ

హైదరాబాద్, జనవరి 1 :

కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా సనత్‌నగర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలోని హనుమంతునికి సోమవారం నవనీత(వెన్నపూస) అలంకరణ చేశారు. స్వామివారి అలంకరణకు ఎనిమిది కిలోల వెన్నతో పాటు ఎనిమిది కిలోల డ్రై ఫ్రూట్స్‌ను వినియోగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పుల్వామా దుండగుల్లో 16 ఏళ్ల బాలుడు!

పదో తరగతి చదువుతున్న ఖాండే..

3 నెలల క్రితం ఉగ్రవాద సంస్థలో చేరిక

7లో..



2,499 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

నగరంలో న్యూ ఇయర్ జోష్

పబ్బులు, క్లబ్బుల్లో పొంగిపొర్లిన మద్యం

మధ్యాహ్నం నుంచే షాపుల ముందు క్యూ

నగరంలోనే 500 కోట్ల వరకూ అమ్మకాలు

మందుబాబులకు పోలీసుల బ్రేకులు


తెల్లవారుజాముదాకా విస్తృత తనిఖీ

జూబ్లీహిల్స్‌లో పట్టుబడ్డ ప్రముఖులు

పట్టుబడిన టీవీ యాంకర్ ప్రదీప్

రీడింగ్‌లో ఏకంగా 170 పాయింట్లు

జైలు శిక్ష తప్పక పోవచ్చు.. పోలీసులు



6లో..

చరిత్రలో నిలుస్తాం

నిరంతర విద్యుత్ విప్లవాత్మకం.. ఈ ఘనత ఉద్యోగులదే

వారివల్లే రాష్ట్రానికి ఖ్యాతి

సిబ్బందికి ప్రత్యేక ఇంక్రిమెంట్

ఈ నెల నుంచే వర్తింపు

సీఎం కేసీఆర్ ప్రకటన

ఉద్యోగులకు అభినందనలు

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి):

రైతులకు 24 గంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందించడం మూడున్నరేళ్ల వయస్సున్న సరికొత్త రాష్ట్రమైన తెలంగాణ సాధించిన అద్భుత విజయమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభివర్ణించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని.. ప్రస్తుతం అన్ని రంగాలకు 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సంరఫరా చేసే విధంగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల ఉద్యోగులకే దక్కుతుందని సీఎం ప్రశంసించారు. దేశమంతా తెలంగాణవైపు చూసే విధంగా విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించారని అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంత గొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టిన విద్యుత్ ఉద్యోగులకు అభినందన పూర్వకంగా జనవరి నుంచీ వర్తించేలా ప్రత్యేక ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు సీఎం కేసీఆర్ **మిగతా 6లో..**



ప్రగతి భవన్‌లో సోమవారం సీఎం కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన అధ్యక్షుడు, సినీనటుడు పవన్ కల్యాణ్.

కేసీఆర్‌కే సాధ్యం

24 గంటల కరెంటును సుసాధ్యం చేశారు

ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలి: పవన్

2లో..

చన్నీటి స్నానంతో చస్తున్నం





అడవి బిడ్డల ఆవేదన

పొంచి ఉన్న శ్వాసకోశ వ్యాధులు

వసతి గృహాల్లో విద్యార్థుల ఇక్కట్లు

అనారోగ్యంతో అటకెక్కుతున్న చదువు

గాలిలో గిరిజన బాలల సంక్షేమం

వేడినీటి సౌకర్యం కల్పించండి..

సీఎం కేసీఆర్‌కు తల్లిదండ్రుల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):

అసలే చలితో ఇబ్బంది పడుతుంటే.. ఉదయాన్నే చన్నీటి స్నానం చేయాల్సిరావడంతో రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో చలి వణికిస్తోంది. పదిరోజులుగా రాష్ట్రంలో 3.5 డిగ్రీల నుంచి 10 డిగ్రీలలోపే నమోదవుతున్నాయి. శీతాకాలంలో **మిగతా 6లో..**

24 గంటల కరెంట్ మా కృషే



మా హయాంలోనే సబ్‌స్టేషన్ల నిర్మాణం

టీఆర్ఎస్ పాలనలో అదనపు విద్యుదుత్పాదన ప్రసక్తే లేదు

జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ ఉండాలి: ఉత్తమ్

హుజూర్‌నగర్, జనవరి 1(మనం న్యూస్):

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం వల్లే ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వగలుగుతోందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ హయాంలో ఒక్క **మిగతా 6లో..**

ఇదీలోకం!



తన సమస్యలన్నింటినీ ఒక పుస్తకంలో రాసుకొచ్చాడట సార్.. దాన్ని చదవమని అడుగుతున్నాడు.

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు.. రాత్రిపూట చలి తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 52 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పౌర్ణమి ఉ.7.54, పాడ్యమి తె.4.08; నక్షత్రం:ఆర్ద్ర ఉ.11.45 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.10.16–11.40; దుర్ముహూర్తం: ఉ.9.02–9.46, మ.2.10–2.54; రాహుకాలం: మ.3.05–4.27; అమృతఘడియలు: తె.3.05–4.29; శుభసమయం: ఉ.8.00–8.23;

సూర్యోదయం: 6.50

సూర్యాస్తమయం: 5.50

అణు బటన్ నా దగ్గరే!

బ్లాక్‌మెయిల్ కాదు.. వాస్తవం.. ఉత్తర కొరియా అణ్వస్త్ర దేశమే

భారీగా అణు వార్‌హెడ్ల తయారీ

అమెరికాది నిప్పుతో చెలగాటం

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటాం

ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్

కొత్త సంవత్సర సందేశంలో హెచ్చరికలు

ఆంక్షలను సైతం లెక్కచేయని అధినేత

ప్యాంగ్‌యాంగ్, జనవరి 1:



అణ్వాయుధ శక్తితో, క్షిపణి పరీక్షలతో ప్రపంచాన్ని గజగజ వణికిస్తున్న ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ మరో బాంబులాంటి వార్త పేల్చారు. తమ దేశంలో ఉన్న అణ్వస్త్రాలను పేల్చే బటన్ ఎప్పుడూ తన టేబుల్ మీదే ఉంటుందని కొత్త సంవత్సరం శుభాకాంక్షల సందేశంలో చెప్పారు. ఇది ఎవరినో బ్లాక్‌మెయిల్ చేయడం కాదని, పచ్చి వాస్తవమని స్పష్టం చేశారు. ఉత్తరకొరియా అనేది అణ్వస్త్ర దేశమేనని మరోసారి ఆయన తెలిపారు. దాంతోపాటు.. భారీ ఎత్తున అణు వార్‌హెడ్లు, క్షిపణులు తయారు చేస్తామని కిమ్ తెగేసి చెప్పారు. అమెరికా నుంచి ఎదురయ్యే ఎలాంటి అణు ముప్పునైనా ఉత్తరకొరియా సమర్థంగా ఎదుర్కోగలదని, నిప్పుతో చెలగాటమాడుతున్నామన్న **మిగతా 6లో..**






ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

- ప్రారంభించిన డిప్యూటీ సీఎంలు కడియం, మహమూద్ అలీ

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి): నాంపల్లిలోని నుమాయిష్ గ్రౌండ్‌లో ప్రతియేటా నిర్వహించే ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమయ్యింది. డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ ముఖ్యఅతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతి యేటా జనవరి 1వ తేదీన ప్రారంభించి 45 రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ ఎగ్జిబిషన్‌కు సంబంధించి ఫ్రీ పార్కింగ్, వైఫై సేవలను ఎగ్జిబిషన్ సొసైటీ అందిస్తోంది. 1937లో నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో కేవలం 100 స్టాల్స్ ఉండేవి. ఈ ఏడాది ఆ సంఖ్య 2500కు చేరింది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఈ ఎగ్జిబిషన్ అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుదని నిర్వాహకులు తెలిపారు. పారిశ్రామిక వస్తువుల ప్రదర్శనతో పాటు పలు రకాల ఆటలు, వినోద కార్యక్రమాలు ప్రాంగణంలో నిర్వహిస్తారు. పలు రకాల తినుబండారాలు, గృహోపకరణ వస్తువులు తక్కువ ధరల్లో అందుబాటులో ఉంచనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో వస్తువులను కొనుగోలు చేయడానికి పేద, మధ్య తరగతి ప్రజలు ఆసక్తి చూపుతారని తెలిపారు.

కేసీఆర్‌కే సాధ్యం

- 24 గంటల కరెంటును సుసాధ్యం చేశారు: పవన్



హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి): తెలంగాణలోని రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడంపై సీఎం కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. సోమవారం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను పవన్ కల్యాణ్ కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు పవన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో 24 గంటల కరెంటు ఇవ్వడం, పలు సంక్షేమ పథకాల గురించి సీఎం కేసీఆర్ ను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. 24 గంటల కరెంటు సాధ్యం కాదనుకున్నాం, కానీ ఇప్పుడు కేసీఆర్ ఇది చేసి చూపించారని అన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ సంకల్పించుకుని తెలంగాణ సాధించారని అన్నారు. ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను ఇలా ఒక్కొక్కటి నెరవేర్చడం అద్భుతమన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రశంసలు కురిపించారు. టీఆర్ఎస్ స్థాపించినప్పుడు ఎలాంటి వ్యూహాలు అనుసరించారో సీఎంను అడిగి తెలుసుకున్నాని అన్నారు. ఇక పొత్తులకు, మద్దతుకు సంబంధించిన ప్రశ్నలు అడుగగా అలాంటి ఆలోచనలేదని, మర్యాద పూర్వకంగా కలిశానన్నారు. తాను బిజీగా ఉండటం వల్లే తెలుగు మహాసభలకు హాజరుకాలేకపోయానని చెప్పారు.



సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించండి

- రహదారి భద్రతపై టీజీఎఫ్‌డబ్ల్యూడీఏ ప్రచారం

హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో డిసెంబరు 31 అర్ధరాత్రి ఉచిత క్యాబ్ సేవలందించిన తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్, నూతనేడాది తొలి రోజు మరో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఫ్రెండ్స్ ఆఫ్ నీడీ ఫౌండేషన్ సభ్యులతో కలిసి టీజీఎఫ్‌డబ్ల్యూడీఏ సభ్యులు రహదారి భద్రత అంశంపై ప్రచారం చేశారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించండి, మద్యం సేవించి వాహనం నడపరాదు అంటూ రాసి ఉన్న ప్లకార్డులతో లిబర్టీ సర్కిల్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు పడే బాధను వివరిస్తూ సుతిమెత్తగా హెచ్చరించారు. రాత్రి పూట హై ఫ్లిమ్ లైట్లు ఉపయోగించడం వల్ల జరిగే నష్టాన్ని పలువరు వాహనదారులకు వివరించామని టీజీఎఫ్‌డబ్ల్యూడీఏ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు ముప్పు

- ప్రైవేటు స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్లపై టీపీటీఎఫ్

హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్): ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నెలల ముందుగానే అడ్మిషన్లకు అవకాశమివ్వాలని తిరుపతిరావు కమిటీ ప్రభుత్వానికి సూచించడాన్ని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తప్పుబట్టింది. ఆరు నెలల ముందుగా అడ్మిషన్లకు అవకాశం ఇస్తే ప్రభుత్వ బడుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి అన్నారు. ఫీజుల నియంత్రణ కోసం కమిటీని నియమిస్తే.. ఏటా పది శాతం పెంచుకునేలా కమిటీ సిఫారుసు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు నష్టం కలిగించే ఈ సిఫారసులను అమలు చేయరాదని డిమాండ్ చేశారు.

సినిమా టిక్కెట్ ధరల కమిటీపై రిట్

హైదరాబాద్, జనవరి 1 (మనం లీగల్ ప్రతినిధి): సినిమా టిక్కెట్ ధరలను నిర్ణయించే కమిటీలో నిర్మాతలు దగ్గుబాటి సురేష్‌బాబు, సి.కల్యాణ్‌ను సభ్యులుగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలైంది. నిర్మాతలు లాభాలు ఆర్జించే కోణంలోనే ఆలోచిస్తారని, ప్రేక్షకుల కోణంలో వారు పరిశీలన చేయరంటూ సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎల్ నర్సింహారావు ఈ రిట్ వేశారు. కమిటీ సభ్యులుగా నిర్మాతలు ఉండడంపైనే అభ్యంతరం అని తెలిపారు. ఏపీ సీఎస్, న్యాయశాఖ కార్యదర్శితోపాటు ఇద్దరు సినీ నిర్మాతలను ఈ కేసులో ప్రతివాదులుగా చేశారు. మంగళవారం విచారణ జరిగే అవకాశముంది.

భూసేకరణ ఉత్తర్వుల జాప్యంపై అసంతృప్తి

హైదరాబాద్, జనవరి 1(మనం లీగల్ ప్రతినిధి): భూసేకరణ ఉత్తర్వులు జారీ చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై హైకోర్టులోని ప్రజాప్రయోజనాల వ్యాజ్యాల కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టులు, ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ చేసిన వెంటనే ఉత్తర్వులు జారీ చేసే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఇతరుల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయని కమిటీ పేర్కొంది. భూయజమానులు కింది కోర్టుల్లో ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ) దాఖలు చేయడంతో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ విషయంపై మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య రాసిన లేఖను పిల్ కమిటీ పరిశీలించింది. ఏపీలో 1029 పెండింగ్ ఈపీలు ఉంటే, తెలంగాణలో అత్యధికంగా 2003 ఈపీలు పెండింగ్‌లో ఉన్నట్లు కమిటీ గుర్తించింది. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు పూర్తి వివరాల కోసం విచారణను నెల రోజులకు వాయిదా వేసింది.

హిందీ ప్రచార సభ రిజిస్ట్రార్‌కు జరిమానా

హైదరాబాద్, జనవరి 1(మనం లీగల్ ప్రతినిధి): కోర్టు ధిక్కారం కేసులో దక్షిణ భారత హిందీ ప్రచార సభ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ ప్రదీప్‌కు హైకోర్టు రూ.2 వేలు జరిమానా విధించింది. లేనిపక్షంలో మూడు రోజుల జైలు శిక్ష అనుభవించాలని హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు తీర్పు చెప్పారు. సంస్థ మాజీ ఉద్యోగి సీతానాయుడకు పదవీ విరమణ సమయంలో రావాల్సిన భత్యాలు, పెన్షన్ చెల్లించాలని హైకోర్టు గత ఏడాది తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలు అమలు చేయకపోవడంతో దాఖలైన కేసులో రిజిస్ట్రార్ ప్రదీప్‌కు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓయూలోనే సైన్స్ కాంగ్రెస్.. విద్యార్థుల వ్యాజ్యం

హైదరాబాద్, జనవరి 1 (మనం లీగల్ ప్రతినిధి): సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే నిర్వహించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ఇచ్చిన తప్పుడు నివేదిక వల్లే సైన్స్ కాంగ్రెస్‌ను తరలించారని, ఇది ఓయూను అప్రతిష్ఠ పాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సైన్స్ కాంగ్రెస్ కోసం ఓయూలో ఇప్పటికే రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ఆ డబ్బు వృథా కాకుండా ఉండాలంటే సమావేశాలు ఇక్కడే నిర్వహించాలని రిట్‌లో వారు కోరారు.

ఎస్వీబీసీ సీఈవోపై చర్యలు కోరుతూ వ్యాజ్యం

హైదరాబాద్, జనవరి 1(మనం లీగల్ ప్రతినిధి): తిరుమల శ్రీవెంకటేశ్వర భక్తి చానల్ సీఈవో ఏవీ నర్సింహారావు అక్రమాలు పాల్పడుతున్నా చర్యలు తీసుకోవడం లేదంటూ తిరుపతికి చెందిన నవీన్‌కుమార్ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు.ఏడాదిపాటు సీఈవోగా ఉండాల్సిన నర్సింహారావు పదవీ కాలం 2016లోనే ముగిసినా నేటికీ ఆయన పదవిలో ఉంటున్నారని, అన్నమయ్య పాటకు పట్టాభిషేకం కార్యక్రమం పేరుతో నిధులు స్వాహా చేశారని, చాగంటి కోటేశ్వర ప్రవచనాల డీవీడీల అమ్మకాల్ని ఆపేసి టీటీడీకి నష్టం చేకూర్చారని, ఉద్యోగుల నియాకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని రిట్‌లో పేర్కొన్నారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టీటీడీ ఈవో, ఎస్వీబీసీ ఎండీ, నర్సింహారావును ప్రతివాదులు చేశారు.

బెడిసికొట్టిన ముందస్తు వ్యూహం

- అవగాహనలేమితో విఫలం
- పదోతరగతి పరీక్షలూ ఓ కారణమే
- స్వాగతించని ఉపాధ్యాయులు
- అటకెక్కిన బయోమెట్రిక్ విధానం
- ప్రాథమిక పాఠశాలల్లోకి అంగన్‌వాడీలు
- విద్యా సంస్కరణలు ఆచరణలో విఫలం



హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చే క్రమంలో విద్యాసంవత్సరాన్ని ముందుకు తీసుకొచ్చి ప్రభుత్వం భంగపడిన విషయం తెలిసిందే! ఏటా జూన్‌లో ప్రారంభించే మాదిరిగా కాకుండా మార్చి 21న విద్యాసంవత్సరాన్ని ప్రయోగాత్మాకంగా ప్రారంభించారు. పరీక్షలను ముందుకు జరిపి, సెలవులను పై నెలకు వాయిదా వేసారు. వార్షిక పరీక్షలు పూర్తయిన వెంటనే కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభించారు. అయితే, దీనిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా దీనిని వ్యతిరేకించారు. అలవాటు ప్రకారం పరీక్షలు పూర్తయ్యాక పిల్లలు తమకు తామే సెలవులు తీసుకున్నారు. దీనికితోడు పదోతరగతి పబ్లిక్ పరీక్షల ప్రభావంకూడా ఉంది. పరీక్ష కేంద్రాలలో చిన్న తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పొద్దున పరీక్షల నిర్వహణ నేపథ్యంలో మధ్యాహ్నం పూట క్లాసులు నిర్వహించారు. కానీ నిప్పులు చెరిగే ఎండకు భయపడి పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు విముఖత వ్యక్తం చేయడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. వచ్చే ఏడాది నుంచి జూన్‌లోనే విద్యాసంవత్సరం ప్రారంభిస్తామని ప్రకటించింది.

బయోమెట్రిక్ అమలులో జాప్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులో పారదర్శకతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బయోమెట్రిక్‌ను అమలు చేయాలని భావించింది. కానీ దాని అమలులో తీవ్ర జాప్యం నెలకొంది. నిజానికి హాజరు పర్యవేక్షణపై బయోమెట్రిక్ హాజరును అమలు చేయాలని 2016 జూన్‌లోనే విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. 2016-17 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఏడు వేల పాఠశాలల్లో అమలు చేసేందుకు విద్యాశాఖ కలెక్టర్లకు నిధులు సైతం విడుదల చేసింది. కానీ నేటికి వివిధ కారణాల వల్ల బయోమెట్రిక్ హాజరు అమలు కావడంలేదు. ఈ క్రమంలోనే కొత్త జిల్లాలు అమలులోకి రావడంతో బయోమెట్రిక్ అంశానికి అంతగా ప్రాధాన్యత లేకపోయింది. అనంతరం ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అమలు చేస్తామని అధికారులు చెప్పినా.. నేటికీ ఫలితం లేదు.

ప్రాథమిక పాఠశాలల్లోకి అంగన్‌వాడీలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లలోపు వయసున్న విద్యార్థులకు కేజీ తరగతులు లేవు. ఫలితంగా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలలకు తరలివెళుతున్నారు. దీన్ని నివారించేందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా తరగతులు ప్రారంభించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో సుమారు 1100 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల ప్రాంగణంలోకి మర్చారు. అయితే వీటిని పూర్తిస్థాయిలో ప్రిప్రైమరీగా మార్చలేకపోయారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే ప్రాంగణంలో ఉన్నా.. ఈ రెండింటి మధ్య సమన్వయం లేకుండా పోయింది.

ప్రణాళికలు రూపొందించడంలో విఫలం

విద్యా సంవత్సరం ప్రారంభం విషయంలో మార్పు తీసుకురావాలని విద్యాశాఖ నిర్ణయించింది. కానీ అందుకు తగిన ప్రణాళికలను రూపొందించడంలో పూర్తిగా విఫలమైంది. మార్చి 21 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు కూడా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకుండా ఆకస్మాత్తుగా నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఏళ్ల తరబడి పాత విధానానికి అలవాటు పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్పును స్వీకరించలేకపోయారు. సీబీఎస్ఈ తరహాలో ఒకటి నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత నెల రోజుల పాటు పైతరగతుల బోధన చేసి, ఆ తర్వాత సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం కొత్త విధానాన్ని అమలు చేసింది. అందులో భాగంగా మార్చి 21 నుంచి కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభించింది. విద్యార్థులకు కొత్త విధానం అలవాటుకాక వార్షిక పరీక్షలుముగియగానే పాఠశాలలకు వెళ్లడం మానేశారు.

పదో తరగతి పరీక్షల ఎఫెక్ట్

పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న చోట మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత అక్కడి తరగతులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత కారణంగా పిల్లలు పాఠశాలలకు వెళ్లలేదు. దీనికితోడు కొంతమంది ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల నిర్వహణ విధుల్లో ఉండడంతో తరగతులకు టీచర్లు తక్కువగా హాజరయ్యారు. దీనివల్ల పూర్తిస్థాయిలో పైతరగతుల పాఠ్యాంశాల బోధన జరగలేదు. క్షేత్రస్థాయి పరిస్థితులను పూర్తిగా అంచనా వేయకుండానే నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యా సంవత్సరం మార్పు విఫల ప్రయోగంగానే మిగిలిపోయింది.

వరంగల్ విలీనం తథ్యం!

- అర్బన్ కలెక్టర్‌కు రూరల్ జిల్లా బాధ్యతలు
- ఒక్కటే జిల్లా అంటూ విస్తృత చర్చ
- త్వరలోనే ప్రకటన అంటున్న స్థానిక నేతలు

వరంగల్, జనవరి 1 (మనం బ్యూరో): వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు విలీనం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌కు రూరల్ జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో విలీనం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాల సంఖ్యను పెంచిన ముఖ్యమంత్రి కేసీఆర్ అవసరం లేదనుకున్న జిల్లాలను కుదించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే వరంగల్‌లో విలీనం తప్పదని అంటున్నారు. వరంగల్ రూరల్ జిల్లా ఏర్పడినప్పటి నుంచి అనేక సమస్యలు ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటు విషయంలో అధికార పార్టీ నేతల మధ్య, ప్రజల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పరకాలను జిల్లా కేంద్రంగా చేయాలని ఆ ప్రాంత వాసులు ఓ ఉద్యమాన్నే నడిపారు. వర్ధనపేట నియోజకవర్గంలో ఇదే పరిస్థితి. నర్సంపేట వాసులు వారి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. వరంగల్ రూరల్ జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించి అనేక సమస్యలు ప్రభుత్వం ముందుకొచ్చాయి. అతి పెద్ద వ్యవసా య మార్కెట్ ఓరుగల్లులోనే ఉంది. వీటికి తోడు కాకాతీ య మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తే దాని అనుసంధానం గా రవాణా వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంటుంది. దీంతో వరంగల్ రూరల్ జిల్లాను ఎత్తివేసి వరంగల్‌లోనే విలీనం చేయడం ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. విలీనం ద్వారా ప్రభుత్వంపై వివిధ కోణాల్లో ప్రభుత్వంపై భారం తగ్గుతుండడంతో ప్రభుత్వం విలీనం వైపే మొగ్గు చూపుతోంది. త్వరలోనే విలీనంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తోందని, ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని పలువురు నేతలు అభిప్రాయ పడుతున్నారు. దీంతో పాటు మేడ్చల్, మల్కాజగిరి జిల్లాలను కూడా ఎత్తేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

7 నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్

- పాల్గొననున్న 350 మంది బాలశాస్త్రవేత్తలు

హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): మహానగరం సైన్స్ ప్రయోగాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఇటీవల నగరంలో జరుగుతున్న సదస్సుల నేపథ్యంలో నగరవాసుల్లో శాస్త్రీయ ఆలోచనలకు నిలయంగా మారుతోంది. ఈ నెల 7నుంచి 12వరకు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్-2018కు వేదికైంది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో రెండు సార్లు ఈ ఫెయిర్ జరిగింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత మాత్రం ఇదే తొలిసారి.

ఆరు రాష్ట్రాల బాల శాస్త్రవేత్తలు

సైన్స్ ఫెయిర్‌లో ఆరు రాష్ట్రాలకు చెందిన బాలశాస్త్రేత్తలు పాల్గొనున్నారు. సికింద్రాబాద్‌లో ఆరు రోజుల పాటు ఈ ఫెయిర్ జరగనుంది. సైన్స్ ఫెయిర్‌కు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. దీనిలో ప్రతి రాష్ట్రం నుంచి 20 గ్రూప్ ప్రదర్శనలు, 15 వ్యక్తిగత ప్రదర్శనలు, 15 ఉపాధ్యాయ ప్రదర్శనలు ఉంటాయి. ఈ లెక్కన ప్రతి రాష్ట్రం నుంచి 50 చొప్పున మొత్తం 300 ప్రదర్శనలు ఉంటాయి. ఈ సైన్స్ ఫెయిర్ 350 మంది విద్యార్థులు, 300 మంది ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. 150 మంది వాలంటీర్లు తమ సేవలు అందించనున్నారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాల విద్యాశాఖ, ఎన్‌సీఈఆర్టీ అన్ని ఏర్పాట్లుచేస్తుంది.

సైన్స్ ఫెయిర్ విజయవంతానికి 21 కమిటీలు

సైన్స్ ఫెయిర్ విజయవంతం కోసం 21 కమిటీలు వేశారు. ఈ కమిటీలన్నింటికీ హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణ చైర్‌పర్సన్‌గా, డీఈవో సత్యనారాయణరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. వీటి నిర్వహణ కోసం విద్యాశాఖ రూ.40 లక్షలు విడుదల చేసింది.

419 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ శ్రీధర్

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి): నిర్దేశిత ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుకు సాగుతున్నామని సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎండీ శ్రీధర్ ఆదివారం పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల కాలంలో 419 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు తెలిపారు. 2016లో డిసెంబర్ నాటికి 427 లక్షల టన్నులు రవాణా చేయగా 2017 డిసెంబర్ నాటికి 467లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు పేర్కొన్నారు. గత డిసెంబర్ నాటికన్నా ప్రస్తుతం 28 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల కాలంలో 461లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయాల్సి ఉండగా 467 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్టుగా చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరాలో భాగంగా థర్మల్ పవర్‌స్టేషన్లతో పాటు పరిశ్రమలకు అవసరమైన బొగ్గును అందించటమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కృషి చేస్తున్న అధికారులకు, కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూ ప్రక్షాళనలో తహసీల్దార్ల కృషి ప్రశంసనీయం

- ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి): భూ రికార్డుల ప్రక్షాళనలో తహసీల్దార్ల కృషి అభినందనీయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. మంత్రుల నివాస సముదాయంలో ఆదివారం తెలంగాణ తహసీల్దార్ల సంఘం 2018 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ...కొత్త ఏడాదిలో అధికారులు, సిబ్బంది కృషితో రెవెన్యూశాఖ దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి వెళుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రెవెన్యూ శాఖలో ఖాళీల ను భర్తీ చేస్తామని, తహసీల్దార్లకు పదోన్నతులు కల్పిస్తామని అన్నారు. అధికారులపై ఎఫ్ఐఆర్ నమో దైన ఘటనపై పోలీస్‌శాఖతో మాట్లాడతానని, ఇలాం టివి పునరావృతంకాకుండా చర్యలు తీసుకుంటానన్నారు.


12 మంది అధ్యక్షుల ఖరారు

- 31 జిల్లాలకు కమిటీల నియామకం పూర్తి
- 8న గాంధీభవన్‌లో పూర్తిస్థాయి కార్యవర్గ భేటీ

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి): రాష్ట్ర కాంగ్రెస్ మహిళా విభాగంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జిల్లా కమిటీ నియామకం పూర్తయింది. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పార్టీ పున ర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌సహా 12 జిల్లాలకు అధ్యక్షులను ఖరారు చేసినట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద ప్రకటించారు. కొత్తవారితోపాటు ఇంతకుముందున్న కొందరికి ఈ కమిటీలలో స్థానం కల్పించినట్లు ఆమె తెలిపారు. మొత్తంమీద 31 జిల్లాలకూ పూర్తిస్థాయిలో కమిటీల ప్రకటన ముగిసిందని పేర్కొన్నారు. అంతేకాకుండా మండలస్థాయి కమిటీల ఎంపిక కూడా పూర్తయిందని చెప్పారు. ఈ ప్రక్రియలో తమకు సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు డీసీసీలకు శారద కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఈ నెల 8న గాంధీభవన్‌లో పూర్తిస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఈ సందర్భంగా శారద ఆరోపించారు.

కిడ్నాప్ గ్యాంగ్ అరెస్టు

- తుపాకీ, బుల్లెట్లు, మూడు కార్లు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు



హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): 2016 డిసెంబర్‌లో జరిగిన పల్లవి మోడల్ స్కూల్ డైరెక్టర్ సుశీల్ కిడ్నాప్ కేసుకు సంబంధించిన ఆరుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఓ పిస్టల్‌తో పాటు ఆరు రౌండ్ల బుల్లెట్లు, మూడు కార్లు, ఆరు మొబైల్ ఫోన్లు, బాధితునికి చెందిన బంగారు ఆభరణాలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని డీసీపీ ఉమామహేశ్వర శర్మ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితుడు గడ్డి సదానంద్ అలియాస్ నందు పరారీలో ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కామాన్‌పూర్‌కు చెందిన గడ్డి సదానంద్ అలియాస్ నందు ఈ కిడ్నాప్ వ్యవహారానికి సూత్రధారి. పెద్దపల్లి జిల్లా రామగిరికి చెందిన సంతోష్‌తో పాటు రాజ్‌కుమార్ అలియాస్ సన్ని, బెల్లంపల్లికి చెందిన రాహుల్, యూనిస్‌ఖాన్, కిరణ్, నరేష్‌తో కలిసి డిసెంబరు 14, 2016న సుశీల్‌ను కిడ్నాప్ చేశారు. నోట్లు రద్దు నిర్ణయంతో ప్లాన్ మార్చుకున్న కిడ్నాపర్లు తాము కోరిన డబ్బు ఇవ్వడానికి గడువు విధించి సుశీల్‌ను విడిచిపెట్టారు. కిడ్నాపర్లు కోరిన డబ్బు ఇవ్వడానికి సుశీల్ గడువు పెంచుతూ పోవడంతో ఆగ్రహించిన కిడ్నాపర్లు సుశీల్ కారును దొంగలించారు. కారును బెంగళూరు తరలించే క్రమంలో ఘట్‌కేసర్ వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డారు. కాగా, ప్రధాన నిందితుడు నందు తప్పించుకున్నాడు. నందు, అతని ఇద్దరు భార్యలు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

ముఖ్యమంత్రికి పలువురి శుభాకాంక్షలు









హైదరాబాద్, జనవరి 1: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు పలువురు ప్రముఖులు సోమవారం ప్రగతి భవన్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్ ఎస్పీసింగ్, ఇతర ఐఏఎస్ అధికారులు, డీజీపీ మహేందర్ రెడ్డి, ఇతర ఐపీఎస్‌లు, విద్యుత్, సింగరేణి, ఆర్టీసీ అధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ రంగాల ప్రముఖులు ఉన్నారు. కాగా, అంతకుముందు సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మేడారానికి జాతీయహోదా దక్కేనా?

హోదాతో.. జాతర ఏర్పాట్లకు కేంద్ర నిధులు.. ఆసియాలోనే అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి

- దశాబ్దాల కిందటే రాష్ట్ర పండుగగా గుర్తింపు
- పాలకులు, ప్రజాప్రతినిధుల వైఫల్యమే
- సీఎం దృష్టి సారించాలి.. భక్తుల విజ్ఞప్తి



హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర.. రెండు దశాబ్దాల కిందటే రాష్ట్ర పండుగగా గుర్తింపు.. 1884లో నిజాం ప్రభుత్వమూ ఈ జాతరను గుర్తించింది, పోయిన జాతరకు దాదాపుగా కోటి మంది భక్తులు హాజరయ్యారు.. అయినా సమ్మక్క-సారాలమ్మ జాతరకు జాతీయ ఉత్సవ హోదా దక్కకపోవడం అక్షరాలా పాలకులు, ప్రజాప్రతినిధుల వైఫల్యమేనని భక్తులు విమర్శిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు నియోజకవర్గంలోని మేడారంలో రెండేండ్లకోసారి మన ప్రజాప్రతినిధులు సమ్మక్క-సారాలమ్మ పార్లమెంటులో దీనిపై చర్చించిన దాఖలాలు అంతంత మాత్రమే! మేడారం జాతర విషయంలో రాజకీయ పక్షాలతో అన్ని వర్గాల ప్రజలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్లమెంటులోని తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, మేడారానికి జాతీయ ఉత్సవ హోదా తీసుకురావాలని సీఎంకేసీఆర్‌ను భక్తులు కోరుతున్నారు. మంత్రి అజ్మీరా చందూలాల్ అధీనంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఈ విషయంలో పెద్దగా ప్రయత్నాలు చేసిందేలేదని సదరు శాఖాధికారులే వెల్లడించడం గమనార్హం! మరో 4 వారాల్లో మేడారం జాతర జరుగనున్న క్రమంలో ప్రజాప్రతినిధులంతా ఏకమై జాతీయ హోదా కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణాకే గర్వకారణమైన మేడారం జాతరకు జాతీయ హోదా విషయమై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం..

జాతర వైభోవోపేతంగా జరుగుతోంది. ఈ ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతరను నిర్వహించనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకుగానూ సుమారు 80 కోట్లు విడుదలచేసింది.

హోదాతో కేంద్రం నుంచి నిధులు..

మేడారం జాతరకు జాతీయ ఉత్సవ హోదా దక్కితే.. జాతర నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందుతాయి.. సుమారు 50 కోట్ల నుంచి 200 కోట్ల వరకు విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో జాతరను మరింత వైభవోపేతంగా నిర్వహించుకో వచ్చని సమాచారం. జాతరలో మెరుగైన వసతులు కల్పించే క్రమంలో రాష్ట్రానికి ఆర్థికంగా బరువు తగ్గుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంలో భక్తుల డిమాండ్‌ను పాలకులు, ప్రజాప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీలు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నా యి. 2017 సెప్టెంబరు 15న జరిగిన మేడారం జాతర సమీక్షాసమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి జాతీయ హోదా విషయంలో హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ద్వారా ప్రధానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున లేఖ రాయిస్తామని ప్రకటించి నెల గడుస్తున్నా అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. తమిళనాడులో జల్లికట్టు విషయంలో రాజకీయాల కతీతంగా ప్రజలంతా ఏకమయ్యారు. చిన్నా, పెద్ద, ధనిక, పేద అనే తేడాను పక్కన పెట్టారు. సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. హోదా సాధించుకున్నారు.

గణతంత్ర వేడుకల్లో..

ఈ ఏడాది జనవరి 26న రాజధాని ఢిల్లీలో జరిగే గణ తంత్ర వేడుకలలో రాష్ట్రం తరుపున మేడారం సమ్మక్క - సారాలమ్మ శకటాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. 1884లో అప్పటి ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ శాఖను ఏ ర్పాటుచేసింది. 1889 నుంచి ఈ శాఖ ఆధ్వర్యంలోనే హిం దూ దేవాలయాలను పర్యవేక్షించేవారు. మేడారం జాతర రె వెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరిగేది. 1940 నాటికే దా దాపుగా 15వేల మంది భక్తులు జాతరకు వచ్చేవారు. 19 44 నుంచి ప్రభుత్వం జాతరకోసం ఏర్పాట్లు చేస్తోంది. 19 58లో జాతర ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ పరిధిలోకి, ఆపై 1967లో దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. 1996 లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిం చింది. అప్పటినుంచే జాతరకు అరకోటికి పైగా భక్తులు హా జరవుతున్నారు. 2016లో జరిగిన జాతరకు దాదాపుగా కో టి మంది భక్తులు హాజరైనట్టు అధికారులు ప్రకటించారు.





కళా ప్రదర్శనలతో ప్రజల్లో మార్పు తేవాలి

అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి

భూపాలపల్లి, జనవరి 1 (మనం ప్రతినిధి): మరుగుదొడ్ల ఆవశ్యకతపై కళా కారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రజలను చైత న్యవంతం చేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సింగరేణి క్లబ్ హౌజ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాబృందాల ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల పదో తేదీ వరకు భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కళాకారుల బృందం పర్యటిస్తుందన్నా రు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ విష యంలో భూపాలపల్లి ఇతర జిల్లాల కంటే వెనుకబడి ఉందన్నారు. కళాకారులు తమ ప్రదర్శన ద్వారా ప్రజలు వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చేలా చేయా లని సూచించారు. జిల్లా కలెక్టర్ మురళి మాట్లాడుత వారం రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ పొందిన కళాబృందాలు మండలాలకు వెల్లి ఎంపీడీఓల ఆధ్వర్యంలో ప్రదర్శనలిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ చంద్రమౌళి, డీపీఆర్వో రవికుమార్, ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, ఓడీఎఫ్ అధికారులు, కళాకారులు ఉన్నారు.



‘టీఎస్ కాప్’ యాప్ ఆవిష్కరణ

- 54 రకాల అప్లికేషన్లు ఒకే యాప్‌లో
- నేరాల వివరాలు క్షణాల్లో అరచేతిలో: డీజీపీ

హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): తెలంగాణ పోలీసు శాఖ నానాటికీ ఆధునికతను సంతరించుకుంటోంది. ఫ్రెండ్లీ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా శాంతి భద్రతల విషయంలో అన్ని విభాగాలకూ ఉపయోగపడే ‘టీఎస్ కాప్’ అనే మరో మొబైల్ యాప్‌ను రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీసు శాఖ ఈ ఏడాది సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోనుందన్నారు. నేరపరిశోధన విభాగ పోలీసులకు అవసరమైన పూర్తి సమాచారంతో ఈ యాప్‌ను రూపొందించామని ఆయన తెలిపారు. ఇప్పటివరకూ పోలీసుశాఖలోని అన్ని యాప్స్‌లో ఉన్న సమాచారం తాజా యాప్‌లో పొందుపరిచామని, దాదాపు 54 రకాల అప్లికేషన్లు టీఎస్ కాప్ యాప్‌లో అందుబాటులో ఉంటాయని డీజీపీ తెలిపారు. నేరం జరిగిన ప్రాంతానికి వెళ్లేలోపు యాప్ ద్వారా సంబంధిత పోలీసు ఆఫీసర్ కేసు వివరాలు తెలుసుకోవచ్చని ఆయన చెప్పారు. ఇప్పటివరకూ హైదరాబాద్‌కే పరిమితమైన యాప్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నామన్నారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా మున్ముందు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని మహేందర్ రెడ్డి తెలిపారు.

మత ఘర్షణలు సృష్టించేది కాంగ్రెస్సే

- ఉత్తమ్‌వి తప్పడు ఆరోపణలు: ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): కొత్త ఏడాదిలోకి మారినా కాంగ్రెస్ పార్టీ కొత్త ఆలోచనలు మాత్రం చేయలేకపోతోందని బీజేపీ నేత ఇంద్రాసేనారెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ పాత ఆలోచనలతో ఉత్తమ్ రోత ఆరోపణలు చేస్తున్నారని ఇంద్రసేనా మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ మతకల్లోలాలు సృష్టించాలని చూస్తోందని ఉత్తమ్ వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. దేశంలో మత ఘర్షణలకు ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీనేనని, అధికారం కోసం మత ఘర్షణలు సృష్టించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీదేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఎవరి హయాంలో మత ఘర్షణలు జరిగాయో చర్చకు సిద్ధమా అంటూ ఇంద్రసేన ఉత్తమ్‌కు సవాల్ విసిరారు. దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ముస్లిం మహిళల కోసం ఆ పార్టీ చేసిందేమైనా ఉందా? వారి అభివృద్ధికి తోడ్పడే ఆలోచన కాంగ్రెస్ ఏనాడూ చేయలేదంటూ దుయ్యబట్టారు. ఉత్తమ్ తన వ్యాఖ్యలకు కట్టుబడి చర్చకు రాగలరా అని ఇంద్రాసేన సవాల్ చేశారు.

నిరంతర విద్యుత్ రికార్డు

- ఇది టీఆర్‌ఎస్ ఘనత: జగదీశ్‌రెడ్డి



నల్లగొండ, జనవరి 1 (మనం ప్రతినిధి): సంక్షేమ పథ కాల అమలులో దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ముందుం దని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన సంవత్సర వే డుకలను నల్లగొండ జిల్లా కేంద్రం లోని ఆయన క్యాంపు కార్యాల యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత టీఆర్‌ఎస్ ప్రభు త్వం మొదటి సారిగా రాష్ట్రంలో అధికారంలోకి రావడం శుభపరిణామమన్నారు. స్వా తంత్ర్యం వచ్చిన తర్వాత 60 సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి 3,4 సంవత్సరాల లో జరిగిందన్నారు. రైతులకు 24 గంటలు కరెంట్ ఇచ్చి కేసీఆర్ సర్కార్ దేశంలోనే రికార్డు సృష్టించిందన్నారు. ప్రజల మద్దతుతో రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామన్నారు. డబల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తిగా వచ్చాయని, త్వరలోనే ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. 2019 సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. మంత్రి జగదీష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, ఎస్పీ శ్రీనివాసరావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల విరేశం, గాదరి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూస్వాముల కోసమే నిరంతర కరెంట్

- రైతులు వద్దంటున్నా ఎందుకిస్తున్నారు?: కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 1(మనం న్యూస్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే కోమిటి రెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఆయన తన నివాసంలో మాడియాతో మాట్లాడారు. ఈ ఏడాది టీఆర్‌ఎస్ ప్రభుత్వం పడిపోవటం ఖాయమన్నారు. భూస్వాముల కోసమే ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను అందిస్తోందని ఆరోపించారు. రైతులు వద్దం టున్నా 24 గంటల విద్యుత్ ఇవ్వడం సరికాదని, తద్వారా నీరు వృథా అవుతుం దని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఇబ్రహిం ఆలీ, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, లతీఫ్, రవి, సుబాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




కార్యకర్తలకు శిక్షణ తరగతులు

ఈ నెల 4 నుంచి ప్రారంభం: ఎల్ రమణ


హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): ఈ నెల నాలుగో తేదీ నుంచి తెలుగుదేశం పార్టీ మండల స్థాయి కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ తెలిపారు. టీడీపీ రాజకీయ ప్రస్థానం, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీ ఆవశ్యకత, టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, రిజర్వేషన్లు, సామాజిక భద్రత, తదితర పది అంశాలపై ఈ తరగతుల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ మండల స్థాయి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర స్థాయి ముఖ్యనేతలు హాజరవనున్నట్లు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో టీడీపీ లేదని టీఆర్‌ఎస్ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని, ఈ తరగతులకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎంతో ఆసక్తిగా ముందుకొస్తున్నారని ఎల్ రమణ చెప్పారు.

చురుగ్గా ఉదయసముద్రం పనులు

- అప్రోచ్ కెనాల్ నిర్మాణం పూర్తి
- తుదిదశకు చేరిన టన్నెల్ నిర్మాణం
- సబ్ స్టేషన్, విద్యుత్ టవర్లు ఏర్పాటు
- వారంలో పంపులు, మోటార్ల బిగింపు



హైదరాబాద్, జనవరి 1(మనం న్యూస్): ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఫ్లోరైడ్ బాధిత, కరువు పీడిత ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి అవసరాలు తీర్చడం కోసం ఉదయసముద్రం ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. నల్గొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న లక్ష ఎకరాలకు ఈ ప్రాజెక్టు సాగు నీరందింస్తుంది. నల్లగొండ, నార్కెట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, నకిరేకల్ మండలాల్లోని 107 ఫ్లోరైడ్ బాధిత గ్రామ ప్రజ లకు ఈ ప్రాజెక్టు ద్వారా సురక్షిత మంచినీరు అందిస్తారు. ఉదయసముద్రం పూర్తయితే నల్లగొండ నియోజక వర్గంలో 24, 468 ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 62,476 ఎకరాలు, మునుగోడులో 10,270 ఎకరాలు, తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంటులో 2,784 ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇటీవల ఉదయ సముద్రం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర మంత్రి హరీష్‌రావు ప్రాజెక్టు ప్రాధాన్యతను అధికారు లకు వివరించి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరిలో బ్రాహ్మణ వెల్లం రిజర్వాయర్‌లోకి నీరు పడాలన్న హరీష్ రావు ఆదేశాల మేరకు ఈ రిజర్వాయర్ పనులు పూర్తి అవుతున్నాయి. 3.665 కిలోమీటర్ల పొడవునున్న కాలువకట్ట పనుల్లో 600 మీటర్ల రివిట్ మెంటు పనులు మినహా మిగతా పనులన్నీ పూర్తయ్యాయి. 6.9 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్ పూర్తయింది. టన్నెల్ పనులు తుది దశకు చేరాయి. 10.625 కిలోమీటర్ల టన్నెల్ పనుల్లో 500 మీటర్లు మినహా టన్నెల్ పనులు పూర్తయ్యాయి. టన్నెల్ లైనింగ్ పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. మోటార్లు, పంపుల బిగింపు పనులు ఈ వారంలో పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఉదయసముద్రం ప్రాజెక్టులో 92 మీటర్ల లోతున సర్జ్ పూల్ నిర్మాణం పూర్తవుతున్నది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు కావలసిన 220 కె.వి.సబ్ స్టేషన్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఉదయ సముద్రం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్ కెనాల్ కింద 43,000 ఎకరాలు, రైట్ మెయిన్ కెనాల్ కింద 57,000 ఎకరాలు సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. లెఫ్ట్ మెయిన్ కెనాల్ కింద మొదటి డిస్ట్రిబ్యూటరీ ద్వారా 40 చెరువులను నింపడానికి గాను ఫీడర్ చానళ్ళను తవ్వే పనులు ఊపందుకుంటున్నాయి. ముందుగా 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని, 60 చెరువులను నింపాలని మంత్రి ఆదేశించడంతో పాటు ఆయా పనులకు గడువు నిర్ణయించారు. టార్గెట్ ప్రకారం పనులు పూర్తవుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు చెప్పారు. 50 వేల ఎకరాలకు సాగు నీరందించడానికి మొత్తం 1500 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. ఇందులో 450 ఎకరాల భూసేకరణ పెండింగులో ఉంది. మంత్రి హరీష్ రావు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తు న్నారు. ఇక నల్లగొండ, కట్టంగూరు మధ్య అప్రోచ్ చానల్ పై 3.165 కిలోమీటర్ల మేర డబుల్ లైను రోడ్ బ్రిడ్జి పనులు వేగవంతం చేశారు. ఈ వంతెన నిర్మాణం నెల రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది.



మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

మంగళవారం, జనవరి 2


రజనీ రాణిస్తారా?

'నాయకత్వమనేది ఒక ఉన్నతస్థానమో, అధికారాన్ని కల్పించేదో కాదు. నాయకుడనేవాడు దారిచూపడు. అతను స్ఫూర్తినిస్తాడు, అనుచరులను కాపాడుకుంటాడు. అనుచరులే నాయకుణ్ణి తయారుచేస్తారు. అయితే నాయకుడనే వాడికి సాహసం ఉండాలి, ధైర్యం ఉండాలి. అనుచరుల విశ్వాసాన్ని కోల్పోకూడదు' ఆశావాది, రచయిత సైమన్ సినెక్ అన్నట్టు ప్రఖ్యాత తమిళ నటుడు రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశానికి ముందు మనం ఆలోచించవలసిన మాటలివి. సినిమా వేరు, రాజకీయ జీవితం వేరు. సినిమాలో పంచ్ డైలాగులన్నీ ఎవరో రాసిస్తే చెప్పేవి. సొంత మాటలుండవు. రాజకీయాల్లో అలాకాదు, ఇక్కడ రైటర్లు రాసే స్క్రిప్టులుండవు. చెన్నైలోని రాఘవేంద్ర కల్యాణమండపంలో ఆదివారం సూపర్‌స్టార్ రజనీకాంత్ తన రాజకీయరంగ ప్రవేశాన్ని ప్రకటించారు. జయలలిత మరణించి ఏడాది గడిచిన తరువాత రజనీకాంత్ రాజకీయప్రవేశంపై ప్రకటన వెలువడడం గమనార్హం. తమిళనాడులో రాజకీయ శూన్యత ఏర్పడిన నేపథ్యంలో రజనీ రంగప్రవేశం సరైన సమయంలోనే జరిగిందని చెప్పవచ్చుగానీ తన రాజకీయ జీవితమంతా ఆధ్యాత్మిక విధానాలతో కొనసాగనుందని ఆయనే స్వయంగా ప్రకటించారు. అయితే, తన పార్టీ పేరు, పార్టీ విధానాలు ఆయన ఇంకా ప్రకటించాల్సి ఉంది. దాదాపు రెండుదశాబ్దాల పాటు ఇదిగో అదిగో అంటూ వెలువడుతున్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ రజనీ చేసిన ఈ ప్రకటన సరైనసమయంలోనే వెలువడిందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. తాను ఆధ్యాత్మిక పంథాలో రాజకీయాలు నడుపుతానని, తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు తన పార్టీ పోటీచేస్తుందని ఆయన తెలిపారు. దీన్ని బట్టి ఆయన ద్రవిడ పార్టీలకు, వామపక్షాలకు దూరంగానే ఉంటారని భావించొచ్చు. రాజకీయాల్లో కులాలు, మతాల జోక్యానికి వ్యతిరేకంగా ఆయన వ్యాఖ్యలు చేసినందువల్ల కేంద్రంలోని బీజేపీకి కూడా దూరంగానే ఉంటారని స్పష్టమవుతోంది. 'రజనీకాంత్ నిరక్షరాస్యుడు, అవినీతిపరుడు, అవినీతిపై పోరాడటానికి ఆయనకు స్పష్టమైన అజెండా లే'దని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి వ్యాఖ్య రజనీ రాజకీయ అక్షరాస్యతకు అద్దం పడుతోందని పలువురి అభిప్రాయం. రజనీ రాజకీయ ప్రస్థానంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఒత్తిళ్లు చేస్తున్న నేపథ్యంలో రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకునే పరిస్థితులు తలెత్తాయని భావించి ప్రకటన సమయంలో ఆయన చాలా జాగ్రత్తగా పదాలను ఎంచుకుని ఆచితూచి మాట్లాడినట్టు అర్థమవుతోంది.

రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు రజనీకి అనుకూలంగానే ఉన్నాయని అనేకులు భావిస్తున్నారు. కరుణానిధి, జయలలిత రాజకీయాల్లో చురుగ్గా ఉన్నంతకాలం మరొకరు ప్రభావితులు కష్టమేననే పరిస్థితులు నిన్నటి వరకు తమిళనాడును పరిపాలించాయి. ప్రస్తుతం జయలలిత మరణం, కరుణానిధి అనారోగ్యం కారణంగా తమిళనాడులో రాజకీయశూన్యత ఏర్పడిందని ఇటీవల ఆర్‌కే నగర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో స్పష్టమైంది. రెండు డీఎంకేలను తప్ప మరొకరిని తమిళ ప్రజలు అంగీకరించరనడానికి ఉదాహరణగా ప్రముఖ నటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు విజయ్‌కాంత్ రాజకీయంగా చతికిలపడిన విషయం తెలిసిందే. 1983కు ముందు కాంగ్రెస్‌లో ముఠా కొట్లాటల కారణంగా ముఖ్యమంత్రులు స్థిరంగా కొనసాగకపోవడం, కేంద్రం ఆధిపత్యంతో ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ పాలన పూర్తిగా కుంటుపడడం, పర్యవసానంగా ఆర్థిక అస్తవ్యస్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వ్యాపార, వాణిజ్య వర్గాల్లో ఏర్పడిన కొత్త సంపన్న వర్గం అండదండలతో ఎన్టీఆర్ సారథ్యంలో తెలుగుదేశం పార్టీ ముందుకొచ్చి అధి కారాన్ని హస్తగతం చేసుకుంది. తమిళనాడు రాజకీయాలపై కేంద్ర పెత్తనం, ప్రతిపక్ష డీఎంకే పార్టీ ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేకపోవడం వంటి వాటి కారణంగా తమిళనాడులో రాజకీయ శూన్యత/సంక్షోభం తలెత్తింది. తమిళ అస్తిత్వాన్ని తిరిగి సంఘటితం చేయగల నాయకత్వం, పాలన కోసం తమిళ సమాజం ఎదురుచూస్తోంది. కొద్దికాలంగా తమిళనాడు సాధారణపాలనలో నెలకొన్న అస్తవ్యస్తత కారణంగా రాష్ట్ర వ్యాపార, వాణిజ్య వర్గాలకు, సాధారణ ప్రజల జీవనానికి తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు డీఎంకే విఫలమైన నేపథ్యంలో కోయంబత్తూరు, తిరుప్పూర్, తూత్‌కొడి తదితర పారిశ్రామిక జిల్లాలకు చెందిన పారిశ్రామికవేత్తలు తమిళనాడుకు కొత్తరాజకీయ ముఖచిత్రాన్ని అందించేందుకు రజనీకాంత్‌ను వెనకనుంచి ప్రోత్సహిస్తున్నట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తతరం వ్యాపార, వాణిజ్యవర్గాల ప్రాపకం కోసం తెలుగుదేశం పార్టీ ముందుకొచ్చినట్లుగా, అదే రాజకీయ సంక్షోభంలో ఉన్న తమిళనాడులో రజనీకాంత్ పార్టీ విజయవంతం కాగలదని కొందరు అంచనాలు వేస్తున్నారు.

తమిళుల గుర్తింపును కాపాడడంలో రెండు ద్రవిడపార్టీలు విఫలమయ్యాయని, ఆ లోటును రజనీకాంత్ భర్తీ చేయగలడని ఆయన అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు పరిపాలించిన రెండు ద్రవిడ పార్టీలు కూడా రెండు కుటుంబాల గుత్తాధిపత్యంలో ఉన్నాయి. ఈ రెండుపార్టీల ప్రభుత్వాల విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలతో పాలన అందించగలనని రజనీకాంత్ హామీ ఇస్తే ఫలితం ఉండే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఆధ్యాత్మిక రాజకీయాలంటే ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఆధ్యాత్మిక చింతన పేరుతో తరచూ హిమాలయాలను దర్శించుకుంటూ స్థిరత్వంలేని రజనీకాంత్ రాజకీయ ప్రవేశం పేరుతో ప్రజలకే విధంగా సేవలందించగలరనే ప్రశ్న తలెత్తుతోంది. 1980లో ఒక నటితో రజనీకాంత్‌కు వివాహేతర సంబంధాలు కొనసాగించారన్న విషయం రాజకీయంగా ఆయనకు ప్రతికూలం కాకపోవచ్చు. కానీ ఏ నిర్ణయాన్ని ఆయన తక్షణం తీసుకోలేరు. ఇలా వివాదాస్పదం, నిర్ణయాలను వెంటవెంటనే తీసుకోలేకపోవడం లక్షణాలు కలిగిన ఆయన ప్రజాసమస్యల పరిష్కారంలో తక్షణ నిర్ణయాలను ఆయన ఎలా తీసుకోగలరనేది అందరినీ వేధించే ప్రశ్న. తెలుగులో మెగాస్టార్ కూడా ఇలాగే పార్టీపెట్టి విఫలమైన అంశం చూస్తే, 'చరిత్ర పునావృతమవుతుంది గానీ, అది మొదటిసారి విషాదాంతంగానూ, రెండవ సారి ప్రహసనంగాను ఉంటుంది' అన్న నానుడి స్ఫురిస్తుంది. తమిళనాడు రాజకీయా రంగంలో రజనీ మరో ఎన్టీర్ అవుతారా? మెగాస్టార్ అవుతారా వేచిచూద్దాం!

పోకడ



రాత్రి పోతూ పోతూ
ఉదయాన్ని భూమికి ఇచ్చిపోయింది

సూర్యుడు అస్తమిస్తూ
కలను కండ్లకు దానం చేసిపోయాడు

నిద్ర రాగానే
చీకటి ఎచటకో వెళ్ళింది

మెలుకువ కాగానే
కాంతి శాంతిలేకుండా చేసింది


కదులుతున్న కాలయానంలో
మనిషి గడియారంలో

తాడుతో కట్టేయకుండానే
జీవిత ఖైదీ అయ్యాడు


ఇక మనసు
ఎప్పటికీ శిక్ష నుంచి
విముక్తి కాలేదు

కవిత

- జూకంటి జగన్నాథం




మంచిమాట



సుఖం, దుఃఖమనే కిరీటాల్ని ధరించి మానవుని వద్దకు వస్తుంది. సుఖానికి స్వాగతం చెప్పే వాడు, దుఃఖానికి కూడా స్వాగతం చెప్పే తీరవలసిందే.

- స్వామి వివేకానంద

పదవుల పంపిణీ.. అర్హులకే అందలం..!




అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవీయోగం కల్పించేందుకు రంగం సిద్ధమవుతోంది. సంక్రాంతి పండుగ తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీకి ముహూర్తం ఖరారు కావడంతో టీఆర్ఎస్ శ్రేణుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. పార్టీలో పనిచేస్తున్న 'ఆశావహులు' చాలామంది నామినేటెడ్ పదవులు దక్కించుకునేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 31 జిల్లాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు రాష్ట్ర, జిల్లాస్థాయి చైర్మన్, డైరెక్టర్ పదవులకు పోటీపడుతుండడంతో పదవుల పందెరం రక్తికట్టిస్తుంది. గత ఏడాది సీఎం కేసీఆర్ కొన్ని పోస్టులు భర్తీచేసినప్పటికీ అవి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ల చైర్మన్ పోస్టులకే పరిమితమయ్యాయి. చైర్మన్లను నియమించిన కార్పొరేషన్లలో డైరెక్టర్ పోస్టుల భర్తీని పెండింగ్‌లో పెట్టారు. వేలసంఖ్యలో ఉండే డైరెక్టర్ పదవులు బోర్డుమెంబర్ల పోస్టుల కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రంలో 'ఆపరేషన్ ఆకర్ష్' పేరిట ఎమ్మెల్యేల సంఖ్యను పెంచుకొన్న తెరాస ప్రభుత్వం మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టడంతో గులాబీ శిబిరంలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల వేడి మొదలు కావడంతో ఆశావహులంతా తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ నామినేటెడ్ పదవులను భర్తీచేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చూస్తున్నారు. 2019లో జరిగే సాధారణ ఎన్నికల వరకు ఇదే మంత్రివర్గం కొనసాగనుండడంతో.. ఇక నామినేటెడ్ పదవులన్నింటినీ పూర్తిచేస్తారనే భావన ఉద్యమకారులు, పార్టీ సీనియర్లలో ఉంది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడంతో పాటుగా, ఆ ఎన్నికల్లో అవకాశాలు రాని వారందరూ ఈ నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు.

ఏడాదిన్నర లోపు సార్వత్రిక ఎన్నికలు ఉండడం తమను నమ్ముకున్న ద్వితీయ, తృతీయస్థాయి నేతలు కేడర్‌కు పదవులు ఇప్పించుకోలేకపోవడంతో వారితో పనిచేయించుకోవడం కష్టంగా మారుతుందన్న అభిప్రాయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఉన్నారు. 2014 ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అవకాశాన్ని కోల్పోయిన చాలా మంది పదవుల పంపిణీలో ప్రాధాన్యం ఉంటుందని విశ్వసిస్తున్నారు. గతంలో టిక్కెట్లు ఆశించి భంగపడ్డ పలువురు నేతలు ఎలాగైనా నామినేటెడ్ పోస్టులను దక్కించుకోవాలని ఆరాట పడుతున్నారు. 2019 ఎన్నికల దృష్ట్యా చివరిసారిగా పదవుల భర్తీ ప్రక్రియ కార్యరూపం దాల్చే అవకాశం ఉండడంతో 119 నియోజక వర్గాలకు చెందిన పలువురు పదవుల కోసం కుస్తీ పడుతున్నారు. జిల్లాలతోపాటు, నియోజకవర్గాల వారీగా పేర్లను పరిశీలించే అవకాశం ఉండడంతో పార్టీ నాయకులంతా సీఎం ఆశీస్సుల కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను కూడా కొందరు ఇప్పటికే కేసీఆర్‌కు అందజేశారు.

గత ఎన్నికల్లో తెరాస అభ్యర్థుల విజయం కోసం ప్రథమ, ద్వితీయశ్రేణి నాయకత్వం కష్టించి పని



చేసింది. ఎమ్మెల్యేలు, మంత్రులు కాగానే తమను ఏ విషయంలోనూ పట్టించుకోవడంలేదనే బాధ చాలా మందిలో వ్యక్తమవుతున్నది. అయితే గత రెండు విడతల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, రికమండ్ చేసిన వారికే రాష్ట్ర, జిల్లాస్థాయి చెర్మన్ పదవులు లభించాయి. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గంలో పలువురు సీనియర్లకూ అవకాశం కల్పించారు. ఈ నియామకాలన్నింటిపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

అయితే ఇటీవల నియమించిన జిల్లా గ్రంథాలయ సంస్థల చెర్మన్ల విషయంలో కొన్ని విమర్శలొచ్చాయి. సీనియర్లను పక్కనబెట్టి జూనియర్లకు జంప్‌జిలానీలకు పదవులు కట్టపెట్టారనే ఫిర్యాదులొచ్చినప్పటికీ, సామాజిక సమతుల్యత, తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన వారిని గుర్తించి పదవులను కట్టబెట్టినట్లుగానే తెలంగాణ ప్రజానీకం భావిస్తోంది. టీఆర్ఎస్ పార్టీకి అండగా నిలుస్తూ... ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సత్తా ఉన్న వారికే నామినేటెడ్ పదవులను ఇవ్వాలనే డిమాండ్ పార్టీ కార్యకర్తల్లో బలంగా వ్యక్తం అవుతుంది. పార్టీలో ఉంటూ ఏమాత్రం పనిచేయని ఉత్సవ విగ్రహాలను, రౌడీషీటర్లు, భూకబ్జాదారులతో పాటు, అవకాశవాదులను పక్కన పెట్టాలి. అలాగే గడిచిన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన వారిలో కొందరు అర్హులను గుర్తించి వారికీ తగిన పోస్టులను కట్టబెట్టాలి. ఉద్యమ కేసులు మినహా, ఇతర కేసులున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ నామినేటెడ్ పదవులు ఇవ్వరాదు.

కొంతమంది స్వలాభం కోసం టీఆర్ఎస్ పార్టీలో చేరి నామినేటెడ్ పదవులపై కన్నేశారు. అలాంటి వారందరినీ సీఎం పక్కన బెట్టి పార్టీలో సీనియర్లను, ఉద్యమంలో త్యాగాలు చేసిన వారికే అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అవకాశవాదులకు, ఉద్యమ ద్రోహులకు,

> **ఉద్యమ నేపథ్యం, టీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలత ఈ నామినేటెడ్ పదవుల పంపకంలో పరమావధికావాలె. అనర్హులను పక్కనబెట్టి అర్హులకే పదవులను కట్టబెట్టాలె. ఇంటెలిజెన్స్ రిపోర్టులతో పాటు, ప్రభుత్వ సలహాదారులు, అంతరంగికులు ఇచ్చే సమాచారాన్ని పరిగణలోకి తీసుకొని పదవుల పంపిణీకి శ్రీకారం చుట్టాలె.**

రాజకీయాల్లో 'హైజంప్'లు చేసిన వారికి, స్వార్థపరులకు అవకాశాలు కల్పిస్తే, అసలైన తెలంగాణ వాదులకు అన్యాయం జరుగుతుంది. అనర్హులను ఏరివేసి...తెలంగాణ నవ నిర్మాణంలో మేము సైతం అనే వారినే ఎంపిక చేయాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మొదలుకొని స్పీకర్‌తో సహా డిప్యూటీ సీఎంల వరకు అందరూ 'సచ్ఛీలత' కలిగిన వారి పేర్లనే ముఖ్యమంత్రికి ప్రతిపాదించాలి. ఈ విషయంలో జాగరూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది.

ఉద్యమ కాలంలో పార్టీ నేతలపై, ఉద్యమకారులపై దాడులు చేసిన వారు కొందరు ప్రభుత్వంలో ఉన్నారు. ఎన్నికల వేళ టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన వారి వద్ద పార్టీలో సీనియర్లు పనిచేయాల్సిన దుస్థితి దాపురించింది. పార్టీ కార్యక్రమాల్లో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించని కొందరు నేతలు స్వార్థ రాజకీయాలు నడుపుతుండడంవల్లే అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంది. గతంలో కేసీఆర్ సంగతి చూద్దామని తొడగొట్టిన వారే ఇప్పుడు పార్టీ అధికారంలోకి రాగానే సీఎంకు సన్నిహిత నేతలుగా మారిపోయారు. ఈ పరిణామాలతో ఉద్యమంలో పనిచేసిన కార్యకర్తలు, సీనియర్లకు పార్టీలో సముచిత స్థానం దక్కదేమోనని ఆందోళన వ్యక్తమవుతున్నది.

తెలంగాణ కోసం త్యాగాలు, ఉద్యమాలు చేసిన వారికి కొందరి మూలంగా పలు జిల్లాల్లో ప్రాధాన్యం లేకుండా పోయిందనే విమర్శలూ ఉన్నాయి. వివిధ జిల్లాల్లో మంత్రులు కూడా అందరినీ కలుపుకుని పోవడం లేదు. పార్టీ ముఖ్యులను, ఉద్యమకారులను మరచిపోవడం ఆవేదనకు గురిచేస్తోంది. అలాగే బీసీ, ఎస్టీలకు తగిన ప్రాధాన్యం లభించలేదనే అసంతృప్తి ఉంది. కాబట్టి సామాజిక సమతుల్యతతోపాటు, పార్టీలో అన్ని వర్గాలను గుర్తించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది. విశ్వసనీయతను నిలుపుకోవడం ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ ముందున్న అతిపెద్ద సవాల్. ప్రవాహం ఉంటేనే నీరు శుద్ధవుతుంది. అదే రీతిలో నామినేటెడ్ పదవుల పంపకం విషయంలో సీఎం సచ్ఛీలురకే పెద్దపీట వేస్తే కొందరి నుంచి కొన్ని విమర్శలు రావచ్చు. అలాగే ముఖ్యమంత్రి తీసుకునే కొన్ని మంచి నిర్ణయాలు కొందరికి గిట్టకపోవచ్చు. అయితే పదవుల పంపకంలో పారదర్శకత పాటిస్తే ప్రభుత్వాధినేతగా ఆయనపై చాలా మందికి విశ్వసనీయత పెరుగుతుందనే వాస్తవాన్ని కేసీఆర్ గ్రహించాలి. ఉద్యమ నేపథ్యం, టీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలత ఈ నామినేటెడ్ పదవుల పంపకంలో పరమావధికావాలి. అనర్హులను పక్కనబెట్టి అర్హులకే పదవులను కట్టబెట్టాలి. ఇంటెలిజెన్స్ రిపోర్టులతో పాటు, ప్రభుత్వ సలహాదారులు, అంతరంగికులు ఇచ్చే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని పదవుల పంపిణీకి శ్రీకారం చుట్టాలె. ఎలాగు సీఎం కేసీఆర్‌కు అధిష్టానమంటూ ఏది లేదు, కాబట్టి మంచి చెడులు ఆలోచించి రిజర్వేషన్లు పాటిస్తూ పారదర్శకంగా నియామకాలను పూర్తిచేయాలె. ఈ పదవుల పంపకంలో ఉద్యమకారులను, పార్టీ సీనియర్ కార్యకర్తలను ఏమాత్రం విస్మరించరాదు.

◆ గడ్డం కేశవమూర్తి
సీనియర్ జర్నలిస్ట్
ప్రెసిడెంట్, వరంగల్ ప్రెస్ క్లబ్
8008794162

మన లేఖలు

మహిళల రిజర్వేషన్ ఒట్టిదేనా?

'ఆర్టీసీ బస్సులలో స్త్రీలకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం' అనే ప్రకటనలు అలంకారానికే పరిమితం అయ్యాయి. బాగా రద్దీగా ఉండే సమయంలో బస్సు రాగానే బలమున్న వానిదే రాజ్యమన్నట్లుగా ఎందరో మగవాళ్ళు ఆడవాళ్ళను వెనక్కి నెట్టి, ముందుగా బస్సులోకెక్కి అన్ని సీట్లనూ ఆక్రమిస్తున్నారు. దీంతో మహిళల సీట్లలో పురుషులు కూర్చోగా మహిళలు నిల్చుంటున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, చంటిపిల్లల తల్లులు, గర్భిణుల బాధలు వర్ణనాతీతం. కండక్టర్లు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఖాళీ బస్సుల్లోనూ ఇదే పరిస్థితి. వెనుక సీట్లు చాలా ఖాళీగా ఉన్నా, కావాలని మహిళల సీట్లను మగవాళ్ళు ఆక్రమిస్తున్నారు. దీంతో మహిళలు వెనుకసీట్లలో కూర్చొని అవస్థలు పడుతున్నారు. మరి ఆర్టీసీ బస్సుల్లో 33 శాతం స్త్రీల రిజర్వేషన్ ఒట్టిదేనా? ఈమాత్రం దానికి ప్రకటనలు ఎందుకు? తరచూ తనిఖీలు చేసేవారు, మహిళలు నిల్చొని ఉన్నా, లేదా వెనుక సీట్లలో కూర్చొని ఉన్నా, వారి సీట్లను ఆక్రమించిన పురుషులకు 500 రూపాయల జరిమానా విధించి వెనక్కి పంపాలి. ఆర్టీసీ బస్సుల్లో 33 శాతం మహిళలకు సీట్లలో రిజర్వేషన్ ఖచ్చితంగా అమలు అయ్యేలా చూడాలి.

- సరికొండ శ్రీనివాసరాజు,
వనస్థలిపురం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణలో దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపు నకు నోచుకోక అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడిన వెనుకబడిన సామాజిక కులాలు అభివృద్ధి చెందని కులాలు ఇప్పటికీ ఆందోళనకరమైన జీవితాలను గడు పుతున్నారు. నేడు సీఎం కేసీఆర్ దళిత, గిరిజన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనే అనేక సంక్షేమ పథకాలను తీసుకు వచ్చారు. అంతే కాకుండా గిరిజన తండాలను పంచాయతీలుగా చేయడం యావత్తు గిరిజన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రిజర్వే షన్ చైర్మన్లుగా, రాజకీయ పార్టీలో కూడా రిజర్వేషన్లు కల్పించి క్రియశీలక పాత్ర లను కట్టబెట్టాడు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి తెలంగాణలో అభివృద్ధి చెంద డం కోసం అనునిత్యం కృషి చేసే వారికి అవకాశం కల్పించాలి.

- గుండమల్ల సతీష్‌కుమార్,
సంస్థాన్ నారాయణపురం

నియోజక వర్గానికో అగ్ని మాపక కేంద్రం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అగ్నిమాపక కేంద్రాలు కేవలం సబ్ డివిజన్ కేంద్రాలలో ఉండడం మూలంగా వివిధ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో అగ్నిమాపక వాహనం దూరంగా ఉన్న ప్రదేశాలకు చేరుకునే సరికే ప్రమాదం జరిగిన ప్రదేశం అగ్నికి ఆహుతి అవుతుంది. ప్రతీ కేంద్రంలో ఒకటే వాహనం ఉండడం, సిబ్బంది కొరత, ముఖ్యంగా వాహనం నడిపే డ్రైవర్లు తక్కువగా ఉండడం మూలంగా పూర్తిస్థాయిలో ప్రమాదాల బారినుంచి కాపాడలేక పోతున్నారు. వరంగల్ జిల్లాలో ములుగులో గల అగ్నిమాపక కేంద్ర కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ములుగు డివిజన్ కేంద్రం నుంచి మంగపేట, ఏటూర్ నాగారం లాంటి ఏజెన్సీ మండలాలు వంద కిలోమీటర్లపైన దూరంగా వుంటాయి. ఆయా మండలాలలో అగ్నిప్ర మాదం జరిగినప్పుడు గంటల కొద్ది సమయం పడుతుండడంతో ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో, నియోజకవర్గానికి దూరంగా వున్న మండల కేంద్రాలలో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థకు చేరిన అగ్నిమాపక కేంద్రాలలో నూతన భవనాలు నిర్మించాలని, సిబ్బందికి క్వార్టర్ల సదుపాయం కల్పించాలని మనవి.

- కామిడి సతీష్‌రెడ్డి
పరకాల, వరంగల్ జిల్లా

విప్లవ వైతాళిక సావిత్రి పూలే

చరిత్రను వెనక్కి నడిపించే ప్రతిఘాతక శక్తుల విషకౌగిలి నుంచి చరిత్రను ముందుకు నడిపించాల్సిన ప్రగతిశీల జననేతలు, ప్రతిభామూర్తులు, వైతాళికశక్తులు విధిగా ఉదయించి తీరాల్సిన కాలమది. ఆనాడు పీష్వాలు పాలిస్తున్న మరాఠా ర్యాము స్వార్థపరతకు, అసూయా ద్వేషాలకు, కులతత్వానికి నెలవుగా ఉండేది. దేశ చరిత్రలో నిమ్నవర్గాలపై, రైతులపై స్త్రీలపై, కనివిని ఎరుగని వివక్షను హింసను ప్రయోగిస్తున్న కాలమది. రెండవ బాజీరావు పరిపాలన కాలంలో ఇది మరింతగా విషమించి సంస్కృతి విషపరిణామంతో, మత కాఠిన్యంతో ప్రజలంతా నిస్సహాయంగా బాధల ననుభవించి సమాజ క్షీణావస్థకు పతనానికి దారితీస్తున్న చీకటి కాలమది. చారిత్రక వైతాళికులను ప్రసవించాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని చరిత్ర మాత చేపట్టి పురిటి నొప్పులు భరించి కనిపెంచిన విప్లవ వైతాళికురాలు సావిత్రి పూలే. బహుజన సమాజంతో పాటు, అన్నివర్గాల స్త్రీలు 'ఓనమాలు' కూడ దిద్దలేని అజ్ఞానం, మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్న అంధకార యుగంలో వేగుచుక్కగా సావిత్రిపూలే 1831లో జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గల నయ గావ్ గ్రామంలో జన్మించారు. బాల్యం నుంచే సహజాతంగా అబ్బిన పట్టుదల, కరుణ, సమత, జిజ్ఞాస వంటి గుణాలు భర్త జోతిరావ్ సహచర్యంలో మరింతగా వికాసం చెంది జీవితాంతం శ్రేయో మార్గంలో శ్రమించిన భారతమాత ప్రియపుత్రిక సావిత్రిభాయి పూలే.

మరాఠ ప్రాంతంలో పీష్వాల పాలన అంతమై, ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చినా కూడా గ్రామాలలో ఆధిపత్య వర్గాల స్వభావం, పాలనా స్వరూపం మారలేదు. 1813 చార్టర్ చట్టం, 1835 మెనకాలే విద్యా విధా నంతో బ్రిటిష్ ఇండియా ప్రభు త్వం ఐరోపా విజ్ఞానాన్ని, శాస్త్రీయ విద్య వ్యాప్తికి కృషిచేయడం ప్రారంభించింది. ఫలితంగా కింది జాతుల ప్రజ లకు విద్యావకాశాలకు కొంత ప్రోత్స హం లభించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న జ్యోతి రావు తన విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ, స్కాటిష్ బడు లలో మరాఠలో, ఆంగ్లంలో విద్యను నేర్చు కున్నాడు.



ఈ జంట భారతదేశ సాంఘిక విద్య విప్లవానికి తమ శక్తినంతా ధారపోసి నిజమైన జీవితానందం, నైతిక సౌందర్యం, మానవ విమోచన ఉద్యమాలలో ఉన్నదని గుర్తించి, దారిదీపాలుగా వెలిగి, ఆ వెలుగును తర్వాత తరాలకు అందించి, అంబేద్కర్‌కు స్ఫూర్తిని కల్గించి, తమ త్యాగ ఫలితాలను అనుభవిస్తున్న కోట్లాది హృదయాలలో దేదీప్యమానంగా వెలుగుతూ పూలే దంపతులు తమ జన్మను సార్థకం చేసుకున్నారు.

జోతిరావుపూలే అహమ్మద్ నగర్ వెళ్ళినప్పుడు అక్కడ అమెరికన్ మిషనరీ ఆడపిల్లల కోసం నడుపుతున్న బడిని చూసి ఆకర్షితుడై సమా జ ఆంక్షలను ధిక్కరిస్తూ తనకు వచ్చిన విద్యను సావిత్రిభాయికి నేర్పించాడు. అన తికాలంలోనే మరాఠీ, ఆంగ్లంలో చదవడం, రాయడం నేర్చుకుంది. ఇది ఆమె జీవితానికి గొప్ప మలుపు నిచ్చింది. వెంటనే పూలె దంపతులు పూనేలోని బుధ వారపేటలో బాలికా పాఠశాలను 1848 జనవరి 1న ప్రారంభించారు. బాలికల పాఠశాల కావడంతో పనిచేసేందుకు మగవారెవరూ ముందుకు రాలేని స్థితిలో తానే తొలి ఉపాధ్యా యురాలిగా, ముఖ్య ఉపాధ్యాయినిగా పాఠశాలను ధైర్యంగా నిర్వ హించింది. 'విద్య లేక వివేకం తగ్గింది, వివేకం లేక నీతి తగ్గింది. నీతి లేక పురోగతి తగ్గింది, పురోగతి లేక సంపద తగ్గింది, సంపద లేక శూద్రులు, స్త్రీలు వెనుకబడిపోయారు. ఇంత అనర్థం అవిద్య వల్ల జరిగిం'దని ప్రజలను చైతన్యపరుస్తూ, రండి చదువుకోండి, మేము మీకు చేయూతనిస్తాం, మమ్ములని అనుసరించండి, చదువు మీకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని ఇస్తుంది అని ప్రచారం చేస్తూ బాలికలను బడికి తీసుకొని వచ్చేవారు. బాలికలకు ఆటపాటలు నేర్పించి వారి అభిమానాన్ని ప్రేమను సంపాదించి వారిని చదువు వైపు మరలించేది. పిల్లలకు తన హృదయాన్ని అంకితం చేసి వారు నిరంతరం ప్రేమ, సంతోషాలలో ఉండేటట్లు చేసి పాఠశాలను సంతోష చంద్రశాలగా మార్చి వారి మానసిక వికాసానికి శక్తియుక్తులను ఉపయోగించేది. సంప్ర దాయవాదుల అవహేళనల, చీత్కారాల, అవమానాల, దాడుల మధ్య ఏమాత్రం చలించక 'ప్రాణం పోయినా లక్ష సాధనలో వెనక్కి వెళ్ళను' అంటూ కర్తవ్య దీక్షలో ముందుకుసాగారు. విద్యావ్యాప్తికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా విక్టోరియా రాణిని కోరారు. సావిత్రి పూలే జీవితం ఉపాధ్యాయులకు సంఘసంస్కర్తలకు సామాజిక కార్యకర్తలకు నిరంతర చోదకశక్తిగా ప్రవహించే ఉత్తేజంలా పనిచేస్తుంది. విముక్తికి విద్య సాధనమని, పీడనకు గురవుతున్న వారిలో మార్పును, చైతన్యాన్ని సంతరిపజేస్తుందని తన కార్యాచరణతో నిరూపించి, అలాగే ప్రజల దీర్ఘకాలపు బాగు కోసం ఇవాళ త్యాగం చేద్దామనే రాజకీయ సామాజిక గుణానికి నిలువెత్తు ప్రతీకైన సావిత్రి మార్గాన్ని అనుసరించి అభివృద్ధి ఫలాలు అందరికీ అందే సమగ్ర సామాజిక విప్లవసాధనకు కృషిచేసి మానావాభివృద్ధి సూచికలో అగ్రస్థానం సాధించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి.

◆ అస్నాల శ్రీనివాస్
ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం
9652275560

(రేపు సావిత్రి పూలే జయంతి)

మనం
కుటుంబం
మంగళవారం, 2 జనవరి 2018
www.manamnews.com

హ్యాపీగా 2018 న్యూ ఇయర్

అహ్మదాబాద్‌లో చర్చి వెలుపల న్యూ ఇయర్ సందడి





వాటికన్ సిటీలో పోప్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపిన ప్రజలు




ప్యారిస్ నగరంలో కొత్త సంవత్సర వెలుగుల జిలుగులు

సిమ్లాలో నూతన సంవత్సర వేడుకల కోలాహలం



ఫ్లోరిడాలోని కీ వెస్ట్ ఐల్యాండ్ వేడుకల్లో అలరించిన నటి గేరీ మారియన్





2017 డిసెంబరు 31వ తేదీ చివరి సూర్యాస్తమయంలో చెన్నై మరీనా బీచ్‌లో తండ్రీ కొడుకుల 'పిక్చర్ పర్‌ఫెక్ట్' దృశ్యం

అమృత్‌సర్ స్వర్ణదేవాలయం సందర్శనలో యాత్రికులు





మధురలో 2018 తొలి ఉషోదయాన్ని యోగాతో ప్రారంభించిన మహిళలు



వారణాసిలో గంగా ఘాట్లపై చిన్నారుల నూతన సంవత్సర సందడి




కౌలాలంపూర్‌లోని పెట్రోనాస్ టవర్స్‌వద్ద న్యూ ఇయర్ ఫైర్ వర్క్స్ సందడి



ఎడిన్‌బర్గ్‌లో ప్రపంచ అతిపెద్ద న్యూ ఇయర్ స్ట్రీట్ పార్టీలో 75,000 మందికి పైగా చిందులు




ముంబైలో కొత్త సంవత్సరం తొలి సూర్యోదయం ఇలా



కొత్త సంవత్సరం తొలి రోజు తాజ్‌మహల్ సందర్శనలో టూరిస్టులు

బబుల్ ర్యాప్ ముగ్గులు



ప్రతి సంక్రాంతికి ఒకే రకం ముగ్గులు వేసి విసుగ్గా ఉందా? అయితే వెరైటీగా ఈసారి ముగ్గును కొత్త విధానంలో వేసే ప్రయత్నం చేస్తానంటే, బబుల్ ర్యాప్ రంగోలి ట్రై చేయండి. మీకు ఎంత పెద్దగా కావాలంటే అంత పెద్దదైన డిజైన్‌లో ఈ రంగోలిని ఈజీగా వేయవచ్చు. మీకు నచ్చిన రంగులను ఒకే సైజు కవర్లలో కట్టి, ముందుగా వేసుకున్న ఔట్ లైన్ డిజైన్‌పై క్రమపద్ధతిలో పేర్చుకుంటూ పోతే వచ్చే రంగోలినే బబుల్ ర్యాప్ రంగోలి అంటారు. ముగ్గుపై రంగులు లేదా పూల రెక్కలు వేస్తే కాసేపటి తర్వాత చెదిరిపోతాయి, కానీ బబుల్ ర్యాప్ అయితే ఏమాత్రం చెక్కు చెదరకుండా అలాగే ఉంటుంది. మళ్లీ ఈ కవర్లను తీసి చక్కగా దాచుకోవచ్చుకూడా. ఎటువంటి వేస్టేజీ లేకపోవడంతోపాటు డస్ట్ అలర్జీ ఉన్నవారికి బబుల్ ర్యాప్‌తో మంచి డిజైన్లు వేసే ఛాన్స్ దొరుకుతుంది.



24 గంటల కరెంట్ మా ఘనతే

(మొదటి పేజీ తరువాయి)

యూనిట్ కూడా అదనంగా ఉత్పత్తి కాలేదని పేర్కొన్నారు. అయినా.. నిరంతర్ విద్యుత్ తమ ఘనతేనని టీఆర్ఎస్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో హుజూర్‌నగర్-కోదాడ నియోజకవర్గాల ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 2019లో కాంగ్రెస్‌దే అధికారమని పేర్కొన్నారు. బీసీలకు చట్ట సభలలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గిరిజనులకు, ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్న హమీ నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వరి, జొన్న, మొక్కజొన్నకు రూ.2వేలు, పత్తికి రూ.5వేలు, మిర్చికి రూ.10వేలు తగ్గకుండా మద్దతు ధర అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఉద్యోగాలు రానివారికి ఉద్యోగ బృతి క్రింద నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. కాంట్రాక్టర్ల కమీషన్ల కోసమే ప్రాజెక్టు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో రెండు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కోదాడ-హుజూర్‌నగర్ వర్గ ప్రజలే తమ పిల్లలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా ఈ ప్రాంత ప్రజలు చూపిస్తున్న ఆదరాబిమానాలను ఎప్పటికి మరువన్నారు. దేశ రక్షణ కోసం సైన్యంలో పనిచేశానని ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానన్నారు. కోదాడ-హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి మరెక్కడ జరగలేదన్నారు. కోదాడలో 30 పడకల ఆస్పత్రి, రోడ్ల విస్తరణ, హుజూర్‌నగర్‌లో 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మట్టపల్లి కృష్ణానదిపై వారధి, విశాలమైన రహదారులు, ఎత్తిపోతల పథకాలు,విద్యుత్ సబ్‌సేష్టన్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. ప్రముఖ జానపద కళాకారులు ఏపూరి సోమన్న బృందంచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ధూందాం కార్యక్రమం ఆహూతులను ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్, నిజామొద్దీన్, యరగాని నాగన్న, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, చక్కెర వీరారెడ్డి, చిట్యాల అమరనాథ్‌రెడ్డి, మన్సూరుఅలీ, ఎస్.కె సైదా, సుతారి వేణు, గంగసాని యల్లారెడ్డి, జక్కుల మల్లయ్య, గొట్టె రామయ్య, ముశం సత్యనారాయణ, గంజి చంద్రమౌళి, కుక్కడం మహేష్, మర్ల శ్రీనివాస్, సుంకరి శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలుస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. తెలంగాణ ప్రజానీకమంతా విద్యుత్ శాఖ పనితీరు పట్ల తృప్తిగా, ఆనందంగా ఉన్నారని సీఎం చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న నేపథ్యంలో సోమవారం ప్రగతి భవన్ లో జెన్ కో- ట్రాన్స్ కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ప్రభాకర్‌రావును ఆత్మీయంగా ఆలిగంనం చేసుకున్న సీఎం కేసీర్ ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించారు. విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, సీనియర్ ఉద్యోగులను పేరు పేరునా పలకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు రాష్ట్రంలోని రైతులతోపాటు అన్ని వర్గాల నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేశారని, అందుకోసం విద్యుత్ ఉద్యోగులకు నూతన సంవత్సర కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు విద్యుత్ అధికారుల హర్షధ్వానాల మధ్య సీఎం ప్రకటించారు. ''వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ అందిస్తున్న రాష్ట్రంగా చరిత్రలో నిలిచిపోతుంది. దశాబ్దాల పాటు రైతులు అనుభవించిన కరెటు కష్టాలకు శాశ్వత విముక్తి కలిగించాలనే లక్ష్యంతో వ్యయ, ప్రయాసలకోడ్చి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించాలని నిర్ణయించాం. టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వలేదు. మేనిఫెస్టోలో చెప్పకపోయినా రైతులకు అత్యంత అవసరమని భావించి వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వాలని నిర్ణయించాం. 2018 ఫిబ్రవరి లేదా మార్చి నుంచి 24 గంటల సరఫరా చేయాలని మొదట భావించాం. కానీ అంతకన్నా ముందుగానే జనవరి 1 నుంచే యాసంగి పంటలు చేసుకునే విధంగా 24 గంటల సరఫరా ప్రారంభించడం సంతోషకరం. దేశంలో కొన్ని రాష్ట్రాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నప్పటికీ, పరిమిత గంటల్లో మాత్రమే ఇస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో 24 గంటలు వ్యవసాయానికి ఇస్తున్నప్పటికీ చార్జీలు వసూలు చేస్తున్నారు. 24 గంటల పాటు ఉచితంగా వ్యవసాయానికి కరెంటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరేదీ లేదు. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం మాత్రమే కాదు. తెలంగాణ రైతులకు అత్యంత ఆవశ్యకమైన విషయం. నాకు ఉదయం చాలా రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. రైతుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అభినందనలు తెలుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. పక్కా ప్రణాళికతో, పకడ్బందీ కార్యాచరణతో ముందుకుపోవడం వల్లే ఈ విజయం సాధ్యమైంది'' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీఎస్ఈఆర్సీ చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, ఎస్పీడీఎసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, జెన్‌కో డైరెక్టర్లు అశోక్ కుమార్, వెంకటరాజం, లలిత్ కుమార్, టీఎస్ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ కమాలుద్దీన్ అలీఖాన్, ట్రాన్స్ కో డైరెక్టర్ జి.నర్సింగ్ రావు, పీజీసీఐఎల్ ఈడీ వి.శేఖర్, జీఎం ఎస్.రవి తదితరులున్నారు.

ముఖ్యమంత్రికి సీఎండీ కృతజ్ఞతలు

విద్యుత్ శాఖ ఉద్యోగులందరికీ ఒక ప్రత్యేక ఇంక్రిమెంటు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు జెన్ కో- ట్రాన్స్ కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం విద్యుత్ శాఖ ఉద్యోగుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నిలుపుతుందని, వారంతా రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని ప్రభాకర్ రావు చెప్పారు. ముఖ్యమంత్రి దార్శనికత, మార్గదర్శకంలో విద్యుత్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిని మెరుగుపరచగలిగాయని ఆయన అన్నారు.

చలిలో చన్నీటి స్నానం

(మొదటి పేజీ తరువాయి)

అందులోనూ చలి ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఉదయం మేల్కోవాలంటే పెద్దలే ఇబ్బంది పడ్తున్నారు. కానీ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని చిన్నారులు తెల్లవారుజామునే లేచి.. గజగజ వణికించే చలిలో చన్నీటితోనే స్నానం చేయాల్సిన పరిస్థితులు నెలకొ న్నాయి. బీసీ, ఎస్సీ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కలగా మిగిలిన వేడినీటి సౌకర్యం..

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు వేడినీటి సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వాలు మారిన ప్పుడల్లా పాలకులు చెప్తున్నారు. అయితే, పాలకులు మారుతున్నారు తప్ప వేడి నీటి సౌకర్యం మాత్రం తమకు అందుబాటులోకి రావడంలేదని వాపోతున్నారు. బంగారు తెలంగాణలోనైనా వేడినీటి సౌకర్యం కలుగుతుందని విద్యార్థులు ఆశించారు. ఇదీ ఆశగానే మిగిలింది. రాష్ట్రంలో భద్రాచలం, ఏటూరునాగారం, ఉట్నూరు, మన్ననూర్ ఐటీడీఏల పరిధిలో సుమారు 500కు పైగా ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతిగృహాలు నడుస్తున్నాయి. దాదాపు 50 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

అనారోగ్యాల ముప్పు..

చలిలో చన్నీటి స్నానం చేయటంతో విద్యార్థులు జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధుల బారిన పడ్తున్నారు. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులతో వారి అవస్థలు వర్ణనాతీతం. దీంతో విద్యార్థులు స్నానం చేయాలంటే భయపడ్తున్నారు. కొందరైతే స్నానం చేయకుండానే బడులకు వెళ్తుండడంతో చర్మ సంబంధమైన వ్యాధులు సోకే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతంలో వేడి నీటి సౌకర్యం కల్పించే క్రమంలో ప్రభుత్వం ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని పలు ఆశ్రమ పాఠశాలలకు సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేసింది. ఒక్కొక్కటి సుమారు రూ.3.50 లక్షలు వెచ్చించి 42 ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ హీటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో 24 పనిచేయటం లేదు. పర్యవేక్షణ లేకపోవటంతో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సోలార్ హీటర్లు మూలకు పడినా పట్టించుకునే వారే కరవయ్యారు. ఇక ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా మినహా రాష్ట్రంలో మరెక్కడా వేడి నీటి సౌకర్యం కల్పించిన దాఖలాలు లేవు.

మన్యం ప్రాంతాల్లో చలి పులి..

మన్యం ప్రాంతాల్లోనే అధికంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలున్నాయి. అటవీ ప్రాంతం కావటంతో సహజంగానే చలి మరింత అధికంగా ఉంటుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సొంత జిల్లా అయిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ చన్నీటి కష్టాలు విద్యార్థులకు తప్పటం లేదు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాల్సిన ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులకు వేడినీటి సౌకర్యం కల్పించటం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూనెం శ్రీను ఆరోపించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల అవస్థలను ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తగిన పరిష్కారం లభించే మార్గం చూడాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

అణు బటన్ నా దగ్గరే!

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని అమెరికా తెలుసుకోవాలని కూడా అన్నారు. 2017 సంవత్సరం మొత్తం ఉత్తరకొరియా భారీ ఎత్తున క్షిపణి పరీక్షలు చేస్తూనే ఉంది. ఖండాంతర బాలిస్టిక్ మిసైళ్లు కూడా తయారుచేసి, వాటిని జపాన్ తీరంలోను, జపాన్ దేశం తలమీదుగా కూడా ప్రయోగించిన కొరియా.. చివరకు అమెరికా ప్రధాన భూభాగంలో ఎక్కడికైనా కూడా తాము క్షిపణులతో అణ్వస్త్రాలు, రసాయన ఆయుధాలు పంపగలమని మరోక్షంగా పలుమార్లు చెప్పింది. అంతర్జాతీయంగా ఎన్ని ఆంక్షలు ఎదుర్కొంటున్నా.. వాటన్నింటినీ తోసిరాజని, అమెరికా నుంచి వచ్చిన ఒత్తిడిని సైతం అధిగమించి తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పెంచుకుంది. ఆ విషయాన్ని కిమ్ జోంగ్ ఉన్ సోమవారం మరోసారి ప్రకటించారు. భారీ స్థాయిలో అణ్వస్త్ర వార్‌హెడ్లను తయారు చేసుకోవాలని, బాలిస్టిక్ మిసైళ్లను కూడా సిద్ధం చేయాలని, వాటిని త్వరితగతిన వ్యూహాత్మక ప్రదేశాల్లో మోహరించాలని జాతినుద్దేశించి చేసే వార్షిక ప్రసంగంలో తెలిపారు.

అమెరికా రెచ్చగొట్టడం వల్లే..

ఉత్తర కొరియా ఎప్పుడు క్షిపణి పరీక్ష చేసినా.. దాదాపు ప్రతి దానికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగానే స్పందించారు. ఆ దేశాన్ని సర్వనాశనం చేస్తానని చెప్పేవారు. బహుశా అంతలా రెచ్చగొట్టడం వల్లే కొరియా అంత ఎక్కువస్థాయిలో క్షిపణులు సిద్ధం చేసుకుని, అణ్వస్త్రాలను రెడీగా ఉంచుకున్నట్లు ఉందని రక్షణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా సంయుక్త దళాల మాజీ చైర్మన్ మైక్ ముల్లెన్ అమెరికా ఇప్పుడు ఉత్తరకొరియాతో అణుయుద్ధానికి మరింత దగ్గరగా వచ్చేసిందని, ఈ సంక్షోభానికి ఇక దౌత్యపరమైన పరిష్కారం దాదాపు లేనట్లేనని అన్నారు. కాగా, అమెరికా అణ్వస్త్ర శక్తి నుంచి తమను తాము కాపాడుకోవాలంటే తప్పనిసరిగా తమకు అణ్వాయుధాలు ఉండి తీరాలని కొరియా నొక్కి చెబుతోంది. దక్షిణ కొరియాతో కలిసి ఆ దేశం చేస్తున్న సంయుక్త సైనిక విన్యాసాల లాంటివి ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టడమే అవుతుందని కొరియా నాయకులు అంటున్నారు.

2,499 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు


- నగరంలో న్యూ ఇయర్ జోష్
- వేడుకలలో యువత హంగామా
- పబ్‌లు, క్లబ్బుల్లో పొంగిపొర్లిన మద్యం
- మధ్యాహ్నం నుంచే షాపుల ముందు క్యూ
- మందుబాబులకు పోలీసుల బ్రేకులు
- తెల్లవారుజాముదాకా విస్తృత తనిఖీలు
- జూబ్లిహిల్స్‌లో పట్టుబడ్డ ప్రముఖులు
- పట్టుబడినన టీవీ యాంకర్ ప్రదీప్
- రీడింగ్‌లో ఏకంగా 170 పాయింట్లు
- జైలు శిక్ష తప్పక పోవచ్చు.. పోలీసులు





హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):

కొత్త సంవత్సరానికి స్వాగతించే క్రమంలో వేడుకలకు యువత భారీగా వెచ్చించింది.. డిసెంబరు 31 ఒక్క రోజే ఏకంగా రూ.500 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు నిపుణుల అంచనా! ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం సుమారు 300 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాది నోట్ల రద్దు ప్రభావంతో ఇబ్బంది పడ్డా.. ఈ ఏడాది ఆ సమస్యలేవీ లేకపోవడంతో నగరంలోని పబ్‌లు, క్లబ్‌లు, రిసార్టులు, బార్లు, వైన్ షాపులు కిటకిటలాడాయి. సాధారణ రోజుల్లో మామూలుగా ఉండే మద్యం అమ్మకాలు కొత్త సంవత్సరం సందర్భంగా ఏకంగా నాలుగు రెట్లు పెరిగాయయని వ్యాపారులు తెలిపారు. ఇక ఆదివారం రాత్రి రోడ్లపైన న్యూ ఇయర్ జోష్ కనిపించింది. కొత్త సంవత్సరానికి స్వాగతించేందుకు వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లతో కస్టమర్లకు ఆహ్వానం పలికారు. పలు వైన్ షాపుల ముందు మధ్యాహ్నం నుంచే క్యూలైన్‌లు కనిపించాయి. కేకుల కోసం వచ్చే కస్టమర్లతో బేకరీలు కిటకిటలాడాయి. మరోవైపు డిసెంబరు 31 రాత్రి మందుబాబుల అత్యుత్సాహానికి బ్రేకులు వేసేందుకు పోలీసు, ట్రాఫిక్ శాఖల సిబ్బంది ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు, రహదారులపైనా వాహనదారులను నిలిపి పరీక్షించారు. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు పలుచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.



పట్టుబడ్డ కార్లు

జూబ్లిహిల్స్‌లో చేపట్టిన తనిఖీలలో బుల్లితెర ఫేమస్ యాంకర్ ప్రదీప్ పోలీసులకు చిక్కా డు. మోతాదుకు మించి మద్యం సేవించి కారు నడుపుతుండడంతో పోలీసులు కారును సీజ్ చేశారు. తనిఖీలో రీడింగ్ భారీగా ఉండడంతో ప్రదీప్‌కు జైలు శిక్ష తప్పదని పోలీసు వర్గాలు చెబుతు న్నాయి. నగరవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీలలో మొత్తం 2,499 కేసులు నమోదయ్యాయని సమాచారం. ఇక కొత్త సంవత్సరం వేడుకలలో వివిద ప్రమాదాల బారిన పడి 238 మంది గాయా లపాలయ్యారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలో రాత్రి పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 2,499 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,683 కేసులు, సైబరాబాద్ పరిధిలో 582, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 234 కేసులు నమోదు అయ్యాయి. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 122 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయినట్లు పోలీసులు వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వేల సంఖ్యలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల కంటే ముందు 745 మంది, ఆ తర్వాత 1007 మంది చిక్కారని, వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా 1,752 కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ జోష్‌లో తొంభై శాతం యువత నిబంధనలు ఉల్లంఘించారు. బెంగళూరులో 1300 మంది ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారని అక్కడి పోలీసులు తెలిపారు. వారందరిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

పట్టుబడ్డ యాంకర్ ప్రదీప్

కొత్త సంవత్సరం సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో సోమవారం తెల్లవారుజామున పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో బుల్లితెర యాంకర్ ప్రదీప్ పట్టు బడ్డాడు. మోతాదుకు మించి ఆయన మద్యం సేవించి వాహనం నడిపినట్లు గుర్తించిన పోలీసులు ఆయన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా 35 పాయింట్లు దాటితేనే వాహనాన్ని సీజ్ చేసి శిక్ష అమలు చేస్తారు. అయితే.. ప్రదీప్‌కు బ్రీత్ అనలైజ్ టెస్ట్ చేయగా 170కి పైగా పాయింట్లు నమోదయినట్లు సమాచారం. ప్రదీప్‌కు మంగళవారం తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో ప్రవేశ పెట్టనున్నారు.

చిందేసిన మందుబాబులు..

గ్రేటర్‌పరిధిలో 520కి పైగా మద్యం షాపులు, 495కి పైగా బార్లు, 35కి మించి పబ్‌లు, క్లబ్‌లు, రిసార్టులు, ఉండగా అధికశాతం బీర్లు విస్కీ అమ్మకాలు ఉండగా, పబ్స్‌లో కాక్‌టేల్స్, క్లబ్, రిసార్టుల్లో వైన్, బీరు ఎక్కువగా అమ్ముడు అయినట్లు సమాచారం. కొన్నిచోట్ల తెల్లవారు జామువరకు డీజే హోరులో యువత జోరుగా చిందేసినట్లు తెలిపారు. రాత్రిపూట పోలీసుల తనిఖీల నేపథ్యంలో చాలామంది అక్కడే గడిపి ఉదయాన్నే ఇంటికెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు.


ప్రమాదాల్లో 238మందికి గాయాలు..

మితిమీరిన వేగంతో వాహనాలు నడిపిన కారణంగా పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఎల్‌బి నగర్‌లో అతివేగం కారణంగా ఓ క్యాబ్ మెట్రో పిల్లర్ కోసం తీసిన గుంతలో పడింది. స్థానికులు డ్రైవర్‌ను బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. నగర వ్యాప్తంగా ఈ తరహా కేసులతో 238మంది గాయాలతో ఉస్మానియా, గాంధీ, సరోజినీదేవీ ఆస్పత్రులలో చేరారు. వీరిలో నాంపల్లికి చెందిన ఆనంద్(40) సాలేహ(22), మహ్మద్ మస్తాపా(25), మలక్ పేటకు చెందిన అభిలాష్ (23), కదీర్ (26), షిజాన్ (25), అబిడ్స్‌కు చెందిన రవిందర్(45), గూలిగూడాకు చెందిన సుమిత్ (22), బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన వసంత (26)లకు తీవ్రగాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. అయితే వీరిలో ఎవరికీ ప్రాణహాని లేదని స్పష్టం చేశారు.

మత్తులో యువకుడి వీరంగం..

కాచిగూడ ప్రాంతంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన రామార్జున్ (25) పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు.

సుమారు రెండు గంటలపాటు విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన నేరానికి కాచిగూడా పోలీసులు రామార్జున్‌ని చంచల్‌గూడ జైల్‌కు రిమాండ్ చేశారు.



నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సందర్శకులు



రాష్ట్రపతితో ప్రధాని నరేంద్రమోదీ కొత్త ఏడాది ముచ్చట



ఉత్తరకాశీలో ఐటీబీపీ ఉద్యోగులతో నూతన సంవత్సర వేడుకల్లో కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంబరం

పాక్‌తో ద్వైపాక్షిక క్రికెట్ అసాధ్యం

- **ఆ దేశం ఉగ్రవాదాన్ని ఆపేస్తేనే వీలు: సుష్మా**



న్యూఢిల్లీ, జనవరి 1: సీమాంతర ఉగ్రవాదం, సరిహద్దుల్లో కాల్పులు నిలిపివేస్తే తప్ప పాకిస్థాన్‌తో తటస్థ వేదికల్లో కూడా ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ అసాధ్యమని విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు. 'ఇరుగుపొరుగుతో సంబంధాల'పై సోమవారం తమ శాఖ పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో సభ్యుల ప్రశ్నలపై ఆమె ఈ మేరకు వివరించారు. అలాగే 70 ఏళ్లు పైబడినవారు, మహిళలు, మానసిక వైకల్యంగల ఖైదీలను మానవతా దృక్పథంతో విడుదల చేయడంపై దేశంలోని పాక్ దౌత్యవేత్తలతో ఇటీవలి భేటీ సందర్భంగా తాను ప్రతిపాదించినట్లు తెలిపారు. మాల్దీవ్స్-చైనా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఆ రెండు దేశాలూ చేరువవుతున్న పరిణామాలను తెలుసుకునేందుకు సభ్యులు ఆసక్తి చూపారు. అయితే, మాల్దీవ్స్‌తో ఎప్పటిలాగానే సౌహార్ద సంబంధాలు కొనసాగడంతోపాటు రక్షణ రంగంలో భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నదని తెలిపారు.

మోదీ మీసం.. రాహుల్ తోక

- **ప్రధానితో కాంగ్రెస్ అధినేతకు తోమర్ పరోక్ష పోలిక**
- **మీ నేతలను అదుపుచేయండి.. కాంగ్రెస్ ఆగ్రహం**

శివపురి, జనవరి 1: కాంగ్రెస్ అధినేత (రాహుల్‌గాంధీ) ప్రధాని మోదీ స్థాయికి ఎదగాలంటే చాలాకాలం పడుతుందని కేంద్ర మంత్రి నరేంద్ర తోమర్ అన్నారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని శివపురిలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రారంభమైన కాంగ్రెస్ పతనం ప్రస్తుతం తారస్థాయికి చేరిందని, ఇక కోలుకోవడం చాలా కష్టమని పేర్కొన్నారు. అసలు నరేంద్ర మోదీతో కాంగ్రెస్ అధినేతకు పోలికే లేదని, వారిద్దరి మధ్య మీసంమీది వెంట్రుకలకు, తోకమీది వెంట్రుకలకూ ఉన్నంత తేడా ఉందని అభివర్ణించారు. దీనిపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తోమర్ తొలుత క్షమాపణ చెప్పాలని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత రిపున్ బోరా డిమాండ్ చేశారు. అనుభవజ్ఞులైన బీజేపీ నేతలు ఇలాంటి మాటలు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. పార్లమెంటుకు, ప్రధాని పదవికిగల గౌరవాన్ని దెబ్బతీసే ఇటువంటి భాషను వాడకుండా నేతలను మోదీ నియంత్రించాలని సూచించారు.

పుల్వామా దుండగులలో 16 ఏళ్ల బాలుడు!

పదో తరగతి చదువుతున్న ఖాండే.. మూడు నెలల క్రితం ఉగ్రవాద సంస్థలో చేరిక

- **ఎన్‌కౌంటర్‌లో మృతి.. దాడికి ముందు వీడియో**
- **కొన్ని నెలల క్రితమే దాడికి వ్యూహం**
- **వీడియో చూసేసరికి చనిపోయి ఉంటాను.. భవిష్యవాణి**
- **ఓ కానిస్టేబుల్ కుమారుడుగా గుర్తింపు**



పుల్వామా, జనవరి 1:దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ శిక్షణా కేంద్రంపై ఆదివారం ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాదులు భద్రతా బలగాలపై గ్రనేడ్లతో దాడి చేసి విచక్షణా రహితంగా కాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో నలుగురు జవాన్లు అమరులయ్యారు. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. చనిపోయిన ఉగ్రవాదుల్లో పదో తరగతి బాలుడు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కశ్మీర్ పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గులాం మహ్మద్ ఖాండే కుమారుడైన ఫర్దీన్ అహ్మద్ ఖాండేగా అతనిని గుర్తించారు. పైగా ఉగ్రవాదులు బలగాలపై కాల్పులు జరుపుతున్నప్పుడు ఆ బాలుడు వీడియో రికార్డు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో విషయమేంటంటే.. ఆ బాలుడి తండ్రి పోలీసు అధికారి కుమారుడు. కొన్ని నెలల క్రితమే ఉగ్ర సంస్థలో చేరాడట. కాల్పులు జరుగుతున్న సమయంలో బాలుడు వీడియోలో మాట్లాడుతూ.. ''కొన్ని నెలల క్రితమే ఈ శిబిరంపై దాడి చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ సందేశం మీకు అందేసరికి నేను ఆ దేవుడి వద్దకు చేరిపోయి ఉంటాను. మీరు కూడా జైషే-మహ్మద్‌లో చేరండి'' అని పేర్కొన్నాడు. దాడి జరుగుతున్నప్పుడు ఓ ఉగ్రవాది ఇలా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ వీడియో తీయడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. కాగా, మూడు నెలల క్రితం ఉగ్రవాదిగా మారాడని కశ్మీర్ పోలీసులు తెలిపారు. కాగా, పారిపోయిన మూడవ మిలిటెంట్ కోసం ఆ ప్రాంతంలో బలగాలు తీవ్రంగా గాలిస్తున్నాయి.

భారత్-పాక్ ఎన్ఎస్ఏల రహస్య భేటీ!

థాయ్‌లాండ్‌లో సమావేశమయ్యారు: పాక్ అధికారి

ఇస్లామాబాద్, జనవరి 1: భారత్-పాక్ జాతీయ భద్రత సలహాదారులు థాయ్‌లాండ్‌లో రహస్యంగా సమావేశమయ్యారని పాకిస్థాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు అజిత్ డోవల్ (భారత్), విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ నాజర్‌ఖాన్ జంజువా డిసెంబరు 27న భేటీ అయినట్లు సదరు అధికారిని ఉటంకిస్తూ 'ది డాన్' పత్రిక తెలిపింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య సౌహార్దపూర్వక సంభాషణ నడిచిందని, రెండు దేశాల మధ్య చర్చల పునఃప్రారంభానికి ఇది తోడ్పడగలదని ఆ కథనంలో పేర్కొంది. మరణశిక్ష పడిన భారత నావికాదళ మాజీ అధికారి కులభూషణ్ జాదవ్‌తో డిసెంబరు 25న ఆయన కుటుంబసభ్యులు భేటీ అయిన తర్వాత ఎన్ఎస్ఏల సమావేశం జరిగిందని వెల్లడించింది.

మూల విలువలకు కట్టుబడాలి: రావత్

సైనికులకు ఆర్మీచీఫ్ కొత్త ఏడాది సందేశం

న్యూఢిల్లీ, జనవరి 1: భారత జాతీయ శక్తికి ప్రతీక అయిన సైనికదళాలు ఎప్పటిలాగానే మూల విలువల పరిరక్షణ, రాజకీయాతీత కర్తవ్య నిర్వహణకు కట్టుబడి ఉండాలని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో తమ విధి నిర్వహణకు కొత్త ఉత్సాహం జోడించాలని సోమవారం వారికి పంపిన శుభాకాంక్షల సందేశంలో సూచించారు. గడచిన ఏడాది ఎదురైన అంతర్గత-బహిర్గత సవాళ్లను దీటుగా అధిగమించడంపై అభినందనలు తెలిపారు. ''దేనికైనా వెనుదీయని మన విశ్వసనీయత, దేశంపట్ల చిత్తశుద్ధి, రాజకీయాతీత వైఖరివంటి సైన్యానికే సొంతమైన విశిష్టతను భవిష్యత్తులోనూ పరిరక్షించుకోవాలి'' అని పిలుపునిచ్చారు.



ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

- **నిలిచిన విమానాలు.. ప్రయాణికుల ఇక్కట్లు**

న్యూఢిల్లీ, జనవరి 1: దేశ రాజధాని న్యూఢిల్లీని మంచుపొగ కమ్మేసింది. దట్టంగా మంచుపొగ అలుముకోవడం, వెలుతురు మందగించడంతో సోమవారం ఉదయం విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. వెలుతురు మందగించడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వైమానిక సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో 5దేశీ విమానాలు, ఏడు అంతర్జాతీయ విమానాలకు అంతరాయం ఏర్పడింది. ఒక విమాన సర్వీస్‌ను రద్దుచేశారు. హస్తినలో వెలుతురు మందగించి.. మంచుపొగ దట్టంగా అలముకోవడంతో ఉదయమైనా చిమ్మచీకటి అలుముకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో వాయుకాలుష్యం కూడా ప్రమాదకర స్థాయికి చేరడం గమనార్హం.

ఇకపై ఐఐఎంల్లో గ్రాడ్యుయేట్ కోర్సులు

- **కొత్త చట్టంతో స్వయంప్రతిపత్తి**

న్యూఢిల్లీ, జనవరి 1: ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. కొత్తగా అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కళాశాలల స్వయంప్రతిపత్తి పెరగడంతో పాటు కళాశాలల నిర్వహణలో ప్రభుత్వ పాత్రను పరిమితం చేస్తోంది. ఇన్నాళ్లు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా కోర్సులు అందిస్తున్న ఐఐఎంలు ఇకపై గ్రాడ్యుయేట్ కోర్సులు అందిస్తాయి. డైరెక్టర్లు, అధ్యాపకుల నియామకాల్లో యాజమాన్యాలకు కొత్త చట్టం స్వేచ్ఛ కల్పిస్తోంది. 19 మంది సభ్యులతో కూడిన కార్యవర్గం కళాశాల నిర్వహణ తదితర అంశాలపై నిర్ణయం తీసుకోంటుంది. ఈ కార్యవర్గం నుంచి ఎంపిక కాబడిన వ్యక్తి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కార్యవర్గంలో కేంద్రం ప్రతిపాదించిన ఒక వ్యక్తితో పాటు స్థానిక ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యక్తి ఒకరు ఉంటారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బిల్లు 2017 జూలైలో లోక్‌సభలో పాసవ్వగా, డిసెంబరు 19వ తేదీన రాజ్యసభ ఆమోదం పొందింది.

ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకం
కాల్పుల్లో 12 మంది మృతి

దిగజారిన ఆర్థిక పరిస్థితులపై పౌరుల నిరసన

- **నాలుగు రోజుల క్రితం మొదలు.. దేశమంతా విస్తరణ**

టెహ్రాన్, జనవరి 1: దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇరాన్‌లో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనలు సోమవారం హింసాత్మకంగా మారాయి. వివిధ ప్రాంతాలలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో 12 మంది దుర్మరణం పాలయ్యారు. ఆదివారం రాత్రి ఆయుధాలు చేతపట్టిన పలువురు ఆందోళనకారులు పలు పోలీస్‌స్టేషన్లను ఆక్రమించేందుకు యత్నించడంతో భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు తెలిసింది. అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇరాన్ అధికార టీవీ చానల్ సోమవారం వెల్లడించింది. అయితే ఏ ప్రాంతంలో అల్లర్లు జరిగాయో వివరాలు మాత్రం తెలపలేదు. కాగా, ఇజేహ్ పట్టణంలో జరిగిన ఆందోళనల్లో మరో ఇద్దరు ఆందోళనకారులు చనిపోయినట్లు తెలిసింది. దేశంలో ఆర్థిక పరిస్థితి అంతకంతకూ దిగజారుతుండటంతో కొద్దిరోజుల క్రితం ఇరాన్‌లో ఆందోళనలు మొదలయ్యాయి. క్రమంగా అవి ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. అధ్యక్షుడు రౌహానీ అసమర్థపాలనవల్లే ఆర్థికంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఇరానీయులు ఆగ్రహంతో ఉన్నారు. అయితే.. దేశంలో ఆర్థిక వ్యవస్థ భేషుగ్గా ఉందని, ఆందోళనల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉందని రౌహాని పేర్కొంటున్నారు. మరోవైపు, ఆందోళనకారులకు ఇజ్రాయెల్ మంత్రి ఒకరు మద్దతు పలకడం గమనార్హం.


బీజేపీలో చేరిన ఇష్రాత్ జహాన్



- **ట్రిపుల్ తలాక్ పిటిషన్‌దారుల్లో ఆమె కీలకం**

హౌరా, జనవరి 1: ట్రిపుల్ తలాక్ కేసులో ఒక పిటిషనర్ అయిన ఇషత్ర్ జహాన్ తాజాగా బీజేపీలో చేరారు. పశ్చిమబెంగాల్‌లోని హౌరాలోని బీజేపీ కార్యాలయంలో ఆమె లాంఛనంగా పార్టీలో చేరారని బీజేపీ బెంగాల్ జనరల్ సెక్రటరీ సాయంతన్ బసు మీడియాకు తెలిపారు. ట్రిపుల్ తలాక్ వ్యతిరేకంగా పోరాడిన ఐదుగురు పిటిషనర్లలో ఇషత్ర్ ఒకరు. 2014లో దుబాయ్ నుంచి ఆమె భర్త ఫోన్‌లో మూడుసార్లు 'తలాక్' అని చెప్పడం ద్వారా విడాకులు ఇచ్చాడు. దీనికి వ్యతిరేకంగా ఆమె న్యాయపోరాటం చేశారు. గత ఏడాది ఆగస్టు 22న సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమంటూ తేల్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా బిల్లు తీసుకొచ్చింది.

వచ్చే ఎన్నికల్లో 'రజనీ'తో పొత్తు



- **తమిళనాడు బీజేపీ ప్రకటన**

చెన్నై, జనవరి 1: సూపర్‌స్టార్ రజనీకాంత్ పొలిటికల్ ఎంట్రీని ఆయా పార్టీల నేతలు స్వాగతిస్తున్న నేపథ్యంలో తమిళనాడు బీజేపీ మరో అడుగుముందుకేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రజనీకాంత్ కొత్తపార్టీ ఎన్డీయేలో భాగస్వామిగా ఉంటుందని తమిళనాడు బీజేపీ చీఫ్ టి.సౌందరరాజన్ ప్రకటించారు. రజనీకాంత్, బీజేపీల పొత్తుపై తమిళనాట వాద ప్రతివాదాలు నడుస్తున్న నేపథ్యంలో... తాజాగా బీజేపీ చీఫ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.''సమయం వచ్చినప్పుడు'' లోక్‌సభ ఎన్నికల్లో తాను కూడా భాగస్వామ్యం కానున్నానంటూ ఇప్పటికే రజనీ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజకీయ రంగప్రవేశంపై రజనీ స్పష్టమైన ప్రకటన చేయడంతో.. బీజేపీ చీఫ్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. ''అవినీతిని అంతమొందించడం, సుపరిపాలనే లక్ష్యంగా రాజకీయాల్లోకి వస్తున్న నటుడు రజనీకాంత్‌కు స్వాగతం... బీజేపీ కూడా అదే లక్ష్యాలతో పనిచేస్తోంది..'' అని సౌందరరాజన్ వ్యాఖ్యానించారు.

రజనీ స్పీడు

అభిమానులను ఒక్కటి చేసేందుకు వెబ్‌సైట్ ప్రారంభం

అభిమానుల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రాజకీయ ప్రవేశం నిర్ణయాన్ని ప్రకటించిన సూపర్‌స్టార్ రజనీకాంత్ స్పీడు పెంచారు. రాజకీయాల్లోకి వస్తున్నా అని ప్రకటించిన తర్వాత రోజే అభిమానులందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు rajinimandram.org అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఓ వీడియో సందేశాన్ని తన ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేసిన రజనీ వెబ్‌సైట్ వివరాలను అభిమానులకు వివరించారు. ముందుగా తన నిర్ణయానికి అంగీకారం తెలిపిన అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుర్తింపు పొందిన అభిమాన సంఘాలు, గుర్తింపులేని అభిమాన సంఘాలతో తమిళనాడు రాజకీయాల్లో మార్పు కోరుకుంటున్న ప్రతిఒక్కరూ ఈ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పేరు, ఓటరు కార్డు నంబరు సాయంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. కాగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 234 నియోజకవర్గాల్లో పోటీ చేస్తోందని రజనీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

దమ్ముంటే రాజ్యాంగాన్ని మార్చండి

- **బీజేపీకి గుజరాత్ దళిత నేత జిగ్నేశ్ సవాల్**



పుణె, జనవరి 1: రాజ్యాంగాన్ని మార్చేందుకే తాము అధికారంలోకి వచ్చామని కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలపై గుజరాత్ దళిత నేత, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే బీజేపీ ఆ పని చేయాలని సవాలు విసిరారు. రాజ్యాంగాన్ని గౌరవించని నేతలకు చట్టసభల్లో కొనసాగే అర్హత లేదని పేర్కొన్నారు. '' రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య పద్ధతిని మారుస్తామని కొందరు ప్రకటనలు చేస్తున్నారు. దమ్ముంటే ఆ చేయండి. మా శక్తిని ఉపయోగించి దానిని ఎలా అడ్డుకోవాలో మాకు బాగా తెలుసు. ప్రజల అభీష్టం, వారి రక్షణ కోసం చట్టాల రూపకల్పన జరగాలి. అంతేకానీ, పార్టీలు, నేతలు తమ ఇష్టానుసారం మారుస్తామంటే కుదరదు '' అని జిగ్నేశ్ పేర్కొన్నారు. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అహంకారాన్ని దళితులు, మైనారిటీలు, రైతులు, అణగారిన వర్గాలు దెబ్బతీశాయని మెవాని అన్నారు. భావసారూప్యతగల వ్యక్తులు, సంస్థలు తమ మధ్య ఉండే భేదాభిప్రాయాలను పక్కనబెట్టి 2019 ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా నిలవాలన్నారు. పుణెలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో రోహిత్ వేముల తల్లి రాధిక, భీమ్ ఆర్మీ ప్రెసిడెంట్ వినయ్ రతన్ సింగ్, బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్(మాజీ ఎంపీ), జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్ తదితరులు హజరుకాగా, పలు విద్యాలయాల నుంచి విద్యార్థులు, ప్రముఖ దళిత నేతలు హాజరయ్యారు.

రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యం కాదు



- **మార్చాలని ప్రయత్నించిన వారినే మార్చేస్తాం: అథవాలె**

పుణె, జనవరి 1: రాజ్యాంగాన్ని మారుస్తామని కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలపై మరో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఘాటుగా స్పందించారు. రాజ్యాంగాన్ని మార్చడం ఎవరి వల్లా సాధ్యం కాదని, తాను అలా జరగనివ్వబోనని అన్నారు. పుణెలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో బీజేపీ దళిత నేత జిగ్నేశ్ మేవాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అథవాలె మాట్లాడుతూ.. '' ఎవరైనా రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే.. మేం వారిని మారుస్తాం'' అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పవిత్రపుస్తకమని ప్రధాని మోదీ అభివర్ణించిన విషయాన్ని ఈ సందర్భంగా అథవాలె గుర్తు చేస్తూ హెగ్డేపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.


• బాలకృష్ణ, నయనతార


నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 102వ చిత్రం 'జై సింహా'. సంక్రాంతి సందర్భంగా సినిమా జనవరి 12న విడుదలవుతుంది. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. నయనతార, నటాషా దోషి, హరిప్రియ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

బన్ని యాక్షన్ ఇంపాక్ట్

కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై వక్కంతం వంశీని దర్శకుడుగా పరిచయం చేస్తూ లగడపాటి శిరీషా శ్రీధర్, బన్ని వాస్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య(నా ఇల్లు నా ఇండియా). ఏప్రిల్‌లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్‌ను నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం విడుదల చేశారు. 'హు ఆర్ యూ?' అని అడిగిన ప్రశ్నకు 'ఐ యామ్ ఎ సోల్జర్' అంటూ అల్లు అర్జున్ సమాధానం చెప్పడంతో 'నాపేరు సూర్య' ఫస్ట్ ఇంపాక్ట్ ప్రారంభమవుతుంది. ఈ వీడియో చూసిన తర్వాత సినిమా పూర్తి మిలటరీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందనే విషయం అర్థమవుతుంది. 'నీకు సూర్య అంటే సోల్జర్. కానీ, ప్రపంచానికి సూర్య అంటే యాంగర్' అంటూ హీరో క్యారెక్టరైజేషన్ గురించి చెప్పే డైలాగ్ మంచి ఇంపాక్ట్‌నిస్తుంది. తర్వాతి షాట్స్‌ని బట్టి సినిమాలో లవ్, ఎమోషన్, యాక్షన్..ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయని అర్థమవుతుంది. దెబ్బలు తిన్న అల్లు అర్జున్‌ని చూసి 'ఇలాగే కొన్ని రోజులైతే చచ్చిపోతావురా' అని రావు రమేష్ అన్నప్పుడు 'చచ్చిపోతాను గాడ్‌ఫాదర్. కానీ, ఇక్కడ కాదు బోర్డర్‌కెళ్ళి చచ్చిపోతాను' అని అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ సినిమాలో దేశభక్తి మెండుగా వుందనే విషయాన్ని తెలియజేస్తుంది. మొత్తానికి 'నాపేరు సూర్య' ఫస్ట్ ఇంపాక్ట్ సినిమాపై క్యూరియాసిటీని, ఎక్స్‌పెక్టేషన్స్‌ని పెంచుతుందని చెప్పడంలో సందేహం లేదు.


• అల్లు అర్జున్

స్పెషల్ ఫిట్‌నెస్ కోసం..


• ఎన్టీఆర్

'జై లవకుశ' తర్వాత ఎన్టీఆర్ తన తదుపరి చిత్రాన్ని త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన లుక్ విషయంలో చాలా కేర్ తీసుకుంటున్నారు. అందులో భాగంగా బాలీవుడ్ తారలైన హృతిక్, రణవీర్ సింగ్‌లకు ఫిట్‌నెస్ ట్రెయినర్ అయిన లాయిడ్ స్టీవెన్స్ దగ్గర ఫిజికల్ ట్రైనింగ్ తీసుకోనున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ మిలటరీ ఆఫీసర్‌గా కనిపిస్తాడని రకరకాల వార్తలు వచ్చాయి. ఇలాంటి సందర్భంలో ఎన్టీఆర్ స్టీవెన్స్ దగ్గర ఫిట్‌నెస్ శిక్షణ పొందుతుండటం చూస్తుంటే ఎన్టీఆర్ తన తదుపరి సినిమా కోసం ఎంత సీరియస్‌గా ఉన్నారో అర్థమవుతుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమయ్యే ఈ సినిమా ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది.




సూర్య కొత్త చిత్రం ప్రారంభం



సూర్య, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్న కొత్త చిత్రం సోమవారం ప్రారంభమైంది. ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రారంభోత్సవానికి సీనియర్ హీరో శివకుమార్, సూర్య, కార్తీ హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ ''నా గత 35 చిత్రాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. సెల్వ రాఘవన్ చెప్పిన సబ్జెక్ట్ చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. సాయిపల్లవి క్యారెక్టర్‌కి కూడా మంచి ఇంపార్టెన్స్ ఉంటుంది'' అన్నారు. దర్శకుడు సెల్వ రాఘవన్ మాట్లాడుతూ ''సూర్యలాంటి వెర్సటైల్ హీరోతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథకు సూర్య ఒక్కరే యాప్ట్ అని సినిమా చూశాక మీకే తెలుస్తుంది'' అన్నారు. నిర్మాతలు ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు మాట్లాడుతూ ''సూర్య, సాయిపల్లవి, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో వస్తున్న మంచి సినిమా ఇది. రీసెంట్‌గా మా బేనర్‌లో రూపొందిన 'ఖాకి' మంచి హిట్ అయింది. సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్ సినిమా అయ్యేలా డైరెక్టర్ సెల్వరాఘవన్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జనవరి 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి దీపావళికి చిత్రాన్ని రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. సూర్య, సాయిపల్లవి జంటగా నటించే ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివకుమార్ విజయన్, ఎడిటింగ్: జి.కె.ప్రసన్న, ఆర్ట్: ఆర్.కె.విజయ్ మురుగన్, నిర్మాతలు: ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, దర్శకత్వం: సెల్వ రాఘవన్.

బన్‌దేవ్‌గా రానా



విలక్షణమైన పాత్రలు చేయడానికి ఆసక్తి చూపే వారిలో రానా దగ్గుబాటి ముందున్నారు. గతేడాది 'బాహుబలి ది కన్‌క్లూజన్', 'ఘాజీ', 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాల్లో నటించారు. ఈ ఏడాది మలయాళంలో 'రాజా మార్తాండ వర్మ' సినిమాతో పాటు '1948' చిత్రంలో కూడా నటిస్తున్నారు రానా. ఇవి కాకుండా 'హాథీ మేరే సాథీ'లో కూడా నటిస్తున్నారు. ఈ సినిమాలో రానా లుక్ విడుదలైంది. ఇందులో రానా బన్‌దేవ్ పాత్రలో కనిపిస్తారు. ప్రభు సాల్మన్ డైరెక్షన్‌లో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమా రూపొందుతోంది. ఇందులో రానా సరసన నటించబోయే హీరోయిన్ ఎవరనేది త్వరలోనే తెలుస్తుంది. 1971లో విడుదలైన 'హాథీ మేరే సాథీ' చిత్రానికి ఇది రీమేక్.


• రానా

పోస్ట్ ప్రొడక్షన్‌లో భాగమతి


• అనుష్క

అనుష్క టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'భాగమతి'. యు.వి.క్రియేషన్స్ దర్శకత్వంలో అశోక్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటుంది. ఈ సినిమాకు సంబంధించిన కొత్త లుక్ విడుదలైంది. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తుంటే, మది సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ సినిమాను జనవరి 26న విడుదల చేస్తున్నారు.

తల్లి పాత్రలో..


• కాజల్ అగర్వాల్

'లక్ష్మీ కల్యాణం' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన పంజాబీ చందమామ కాజల్ అగర్వాల్. ఈ అమ్మడు కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా పెర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రల్లోనూ ఆకట్టుకుంది. దక్షిణాదిన స్టార్ హీరోయిన్‌గా రాణించిన కాజల్.. హిందీలోనూ సినిమాలు చేసి మెప్పించింది. గతేడాది ఖైదీ నంబర్ 150, నేనే రాజు నేనే మంత్రి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. ఇందులో కాజల్‌ను తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడు తేజ ..ఆమెను 'నేనే రాజు నేనే మంత్రి'లో కొత్త పాత్రలో చూపించారు. ఇప్పుడు ఈయన దర్శకత్వంలో కాజల్ బిడ్డల తల్లిగా కనిపించే అవకాశముందని టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. వివరాల్లోకి వెళితే.. వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. త్వరలో రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ సినిమాలో వెంకీ.. మిడిల్ ఏజ్డ్ ప్రొఫెసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇద్దరు బిడ్డల తండ్రిగా కనిపించనున్న ఆయన పాత్రకి జోడీగా కాజల్ నటించే అవకాశముందని గత కొంత కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. 'ఆటా నాదే వేటా నాదే' పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం కాజల్ కోటి రూపాయిల పారితోషికం డిమాండ్ చేస్తోందని సమాచారం. త్వరలోనే కాజల్ ఎంపికపై క్లారిటీ వస్తుంది.



'ఛలో' రెండో పాట విడుదల

శంకర్ ప్రసాద్ మాల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై నాగశౌర్య, రష్మిక మండన్న హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఛలో'. వెంకీ కుడుముల దర్శకుడు. ఉషా మాల్పూరి నిర్మాత. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతుంది. కొత్త సంవత్సరం సందర్భంగా యూనిట్ సినిమాలోని సెకండ్ సాంగ్‌ను విడుదల చేశారు. సీనియర్ పాత్రికేయులు పసుపులేటి రామారావు, బి.ఎ.రాజు సాంగ్‌ను విడుదల చేశారు. పసుపులేటి రామారావు మాట్లాడుతూ ''సాంగ్ చాలా బావుంది. సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. బి.ఎ.రాజు మాట్లాడుతూ ''ఆల్‌రెడీ విడుదలైన ఫస్ట్ సాంగ్ పెద్ద హిట్ సాధించింది. రెండో సాంగ్ కూడా ఎంతో బావుం నాగశౌర్య, వెంకీ కుడుములకు ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ సాధించి మంచి పేరు తెస్తుంది'' అన్నారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ''ఫస్ట్ సాంగ్‌కు మేం ఊహించిన దాని కంటే చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా సూపర్‌హిట్ అవుతుంది'' అన్నారు. హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''సినిమా చాలా బాగా వచ్చింది. డెఫనెట్‌గా సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం. నిర్మాతలు మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. సాగర్ మహతి చాలా అద్భుతమైన సంగీతాన్ని అందించారు. అలాగే సాయిశ్రీరాంగారిచ్చిన ధైర్యంతోనే మేం ప్రొడక్షన్ హౌస్‌ను స్టార్ట్ చేశాను. వెంకీ సినిమాను చక్కగా డైరెక్ట్ చేశాడు. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'నయనం'


• ఎస్తేర్

ఎస్తేర్, నోయెల్, శ్రీమంగం, అర్జున్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నయనం'. లావోస్ మోషన్ పిక్చర్‌పై రామ్ కేతు, కృష్ణ మోహన్, శ్రీరామ్ కందుకూరి, నరేష్ లేబాకు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. క్రాంతి కుమార్ వడ్లమూడి దర్శకుడు. ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే సినిమాలో స్క్రీన్‌ప్లే కీలకంగా ఉంటుంది. గీత పూనిక సంగీతం, చేతన్ మధురాంతకం సినిమాటోగ్రఫీ మెయిన్ హైలైట్స్‌గా నిలుస్తాయన్నారు దర్శకుడు క్రాంతి కుమార్ వడ్లమూడి.

మాస్, యాక్షనే కాదు.. ఎమోషనల్ కూడా


• మంచు విష్ణు, శ్రియ

డా. మోహన్ బాబు ప్రధానపాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఈ చిత్రంలో విష్ణు మంచు ఓ కీలకమైన పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు జతగా శ్రియా శరన్ నటిస్తుంది. కొత్త సంవత్సరం సందర్భంగా విష్ణు, శ్రియలు కలిసున్న ఓ పోస్టర్‌ను విడుదల చేశారు చిత్ర బందం. ఇప్పటికే ఇందులో మోహన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను బట్టి 'గాయత్రి' చిత్రంలో మాస్ యాక్షన్‌తోపాటు మంచి కుటుంబ కథ కూడా ఉంటుందని అర్థమవుతుంది. మదన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్.ఎస్.తమన్ సంగీతం సమకూర్చారు. అనసూయ భరద్వాజ్, నిఖిల విమల్ మరియు బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని డా.మోహన్‌బాబు తన నిర్మాణ సంస్థ శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 9న సినిమా విడుదలవుతుంది.



'మనం' నంబర్ 1గా ఎదగాలి

- కొద్దికాలంలోనే ప్రజలకు చేరువ: కేఈ
- క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి
- 'మనం' అందరి పత్రిక: కేఈ ప్రభాకర్

కర్నూలు, జనవరి 1 (మనం న్యూస్ బ్యూరో): కొద్ది కాలంలో ప్రజలకు చేరువైన 'మనం' దినపత్రిక.. భవిష్యత్‌లో జిల్లాలో నంబర్ వన్‌గా ఎదగాలని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. సోమవారం కర్నూలులో కేఈ స్వగృహంలో 'మనం' దినపత్రిక క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దినపత్రికలు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అని అన్నారు. నిజాలను నిర్భయంగా ప్రచురించినప్పుడే పత్రికలు మనుగడ సాగిస్తాయన్నారు. అవినీతి, అక్రమాలపై కదం తొక్కాలని ఆకాంక్షించారు. విశ్లేషణాత్మక, పరిశీలనాత్మక, మానవీయ కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మంచిని మంచిగానే చూపించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ వక్రీకరణకు తావు ఇవ్వకూడదని కేఈ కృష్ణమూర్తి సూచించారు.

పాఠకులను ఆకట్టుకుంది: కేఈ ప్రభాకర్

క్యాలెండర్ అవిష్కరణ సందర్భంగా ఏపీఐడీసీ చైర్మన్, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. 'మనం' దినపత్రిక అందరి పత్రికని, పాఠకులను అకట్టుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత ముందుకు సాగుతూ.. జిల్లాలో నంబర్ వన్‌గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్ క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మనం బ్యూరో ఇన్‌చార్జి నాగరాజు, స్టాఫ్ రిపోర్టర్లు బి. చిన్న రామాంజనేయులు, మధు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి రంగా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



భూదందాలో బడా బాబులు!

- విశాఖ కుంభకోణంపై సిట్ నివేదిక సిద్ధం
- ఓ మంత్రి, ఎమ్మెల్యే, ఐఏఎస్‌ల హస్తం
- బినామీల పేరుతో వేల కోట్ల భూములు
- త్వరలో సీఎం చంద్రబాబు వద్దకు నివేదిక

విశాఖపట్నం, జనవరి 1 (మనం న్యూస్ బ్యూరో): విశాఖ భూ కుంభకోణంపై దర్యాప్తు చేపట్టిన సిట్ నివేదిక కొందరు బడా బాబుల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. సీనియర్ రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో దడ పుట్టిస్తోంది. భూరికార్డుల ట్యాంపరింగ్, దస్త్రాల గల్లంతు, నిబంధనలకు విరుద్ధంగా నిరభ్యంతర ధ్రువపత్రాల జారీలో వారి హస్తం ఉందన్న తేలింది. అలాగే బినామీల పేరుతో వేల కోట్ల భూములు సొంతం చేసుకున్నారని సిట్ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో సిట్ నివేదిక త్వరలో సీఎం చంద్రబాబు చేతికి అందనుండడంతో ఎటువంటి చర్యలు ఉండబోతున్నాయోనని ఉత్కంఠ నెలకొంది. విశాఖ రూరల్ మండలంతోపాటు ముదపాక, కొమ్మాది, పరదేశీపాలెంలోని వేల కోట్ల విలువైన భూములతో పాటు మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన స్థలాల రికార్డులకు సంబంధించి గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తండంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజాల్ నేత్రత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. అక్రమాలకు పాల్పడిన వారిలో జిల్లా కలెక్టర్ స్థాయి ఐఏఎస్ అధికారులు ఇద్దరు, జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారి ఒకరు ఉన్నారని నిర్ధారించడం ఆయా వర్గాల్లో అలజడికి కారణమవుతోంది. సిట్ నుంచి అందిన ప్రాథమిక సమాచారం మేరకు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అలాగే భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు సహకరించినట్లు సిట్ పేర్కొంది. క్షేత్రస్థాయిలో వీఆర్‌వో దగ్గర నుంచి జిల్లా స్థాయిలో ఆర్‌డీవో, డీఆర్‌వో, జేసీ, కలెక్టర్‌ల వరకూ ఆయా దస్త్రాలపై సంతకాలు చేయడంతో ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయన్న దానిపై సిట్ సమగ్రంగా నివేదిక రూపొందించింది. 200 పేజీలకుపైగా సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ముఖ్యంగా కొమ్మాది, పరదేశీపాలెం భూముల వ్యవహారంలో కొందరు ఐఏఎస్‌లతో పాటు ఐపీఎస్ అధికారులు ప్రమేయం పైనా సిట్‌కు సమాచారం అందింది. కొందరు అధికారులు, ఒక మంత్రి, ఒక మాజీ, ఓ ప్రస్తుత ఎమ్మెల్యేలు.. బినామీల ద్వారా కోట్ల రూపాయల భూములను సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. వేల కోట్ల రూపాయల విలువ చేసే వేయి ఎకరాలకు పైగా భూములు అక్రమార్కుల పాలైనట్లు సిట్ అంచనా వేసింది.

ఒకరికి చేయాల్సిన వైద్యం.. మరొకరికి

- కేస్ షీట్ తారుమారు.. రోగి మృతి
- కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యం

కర్నూలు, జనవరి 1: ఒకరికి చేయాల్సిన వైద్యం మరొకరికి చేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి రోగి మృతి చెందాడు. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కేస్ షీట్ తారుమారు అయింది. ఈ విషయాన్ని గమనించని వైద్యులు ఒకరికి చేయాల్సిన వైద్యం మరొకరికి చేశారు. దీంతో వైద్యం వికటించి భీమన్న అనే రోగి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే భీమన్న మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. భీమన్న మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

విచారణకు కామినేని ఆదేశం

ఈ ఘటనపై మంత్రి కామినేని శ్రీనివాస్ విచారణకు ఆదేశించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని డీఎంఈని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

వేడుకల్లో విషాదం

- పిల్లలపైకి దూసుకెళ్లిన కారు.. నలుగురి మృతి

కడప, జనవరి 1: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా కడప జిల్లా పెండ్లిమర్రి మండలం ఇందిరానగర్‌లో విషాదం చోటు చేసుకుంది. వేడుకల అనంతరం రోడ్డు పక్కన చలికాస్తుండగా నలుగురు పిల్లలపై కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కారు బోల్తాపడటంతో డ్రైవర్ కూడా చనిపోయాడు. వేంపల్లి నుంచి కడపకు కారు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

నిరుడు భేష్.. ఈసారి అద్భుతం

ఎన్నో సత్ఫలితాలు సాధించాం

- అదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు
- సంతోషంగా, ఒత్తిడి లేకుండా పనిచేద్దాం
- ఉజ్వలంగా రాష్ట్ర భవిష్యత్: చంద్రబాబు
- నీరు-ప్రగతి, వ్యవసాయంపై సమీక్ష


అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నిరుడు నిర్వహించిన పలు సంస్కరణలతో ఎన్నో సత్ఫలితాలను సాధించామని, అదే స్ఫూర్తితో పనిచేస్తే ఈ ఏడాది కూడా మరిన్ని విజయాలు కైవసం చేసుకోవడం ఖాయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా నీరు-ప్రగతి, వ్యవసాయంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ''2017 అద్భుతంగా సాగింది, 2018 మరింత అద్భుతంగా ఉంటుందనడంలో సందేహం లేదు. రోజురోజుకూ రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. ఈ అద్భుత కార్యక్రమాలు చేపట్టడం నిజంగా అదృష్టం'' అని చంద్రబాబు అన్నారు. ఈ స్ఫూర్తిదాయక కాలంలో రాష్ట్రంలో పనిచేయడం గొప్ప సంతృప్తి ఇస్తుందని, అందరం కలిసి మెలసి ఆరోగ్యంగా, ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేద్దామని, అనుకున్న లక్ష్యాలను సాధిద్దామని పిలుపునిచ్చారు. నిరుడు మీ సహకారం ఆమోఘంగా ఉందని, ఈ ఏడాది అంతకు రెట్టింపు సహకారం అందిస్తారని ఆశిస్తున్నాని చెప్పారు. పని సంస్కృతి పెంచుకోవాలని, పనిని ఆస్వాదించాలని, పనిలో ఉల్లాసం పొందాలని సూచించారు. నిరుడు జాతీయ స్థాయిలో 40% అవార్డులు మనకు వచ్చాచని, ఈ ఏడాది 60% అవార్డులు మన రాష్ట్రానికే దక్కాలని చంద్రబాబు ఆకాంక్షించారు. నీరు, విద్యుత్ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని, ఊహించని ఫలితాలు సాధించామని తెలిపారు. తాగునీరు, తినే తిండి, పీల్చేగాలితోపాటు మన ఆలోచనల్లోనూ పూర్తి స్వచ్ఛత ఉండాలన్నారు.

విద్యుత్, నీరు, గాలి సహకరిస్తే అద్భుతాలు

విద్యుత్, నీరు, గాలి సహకరిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టించ వచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమలో 2016 డిసెంబరుతో పోలిస్తే 3.7 మీటర్లు, 2016 మార్చి కన్నా 10 మీటర్ల భూగర్భ జలాలు పెరగడం 'నీరు-చెట్టు, నీరు-ప్రగతి' కార్యక్రమం విజయం సాధించిందనడానికి నిదర్శనమని వెల్లడించారు. 2016లో 30%, నిరుడు 12.6 శాతం వర్షపాతం తక్కువ నమోదు అయినా పంటల దిగుబడులు తక్కువగా కాకుండా చూశామన్నారు. సమర్థ నీటి నిర్వహణతో రూ.400 కోట్లు విలువైన విద్యుత్ వినియోగం తగ్గించామని ముఖ్యమంత్రి తెలిపారు.

నాణ్యమైన పంట దిగుబడులపై దృష్టి

రబీలో 111% నాట్లు వేశారని, నాణ్యమైన దిగుబడులు రావాలని చంద్రబాబు అన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో రబీ పంట రుణాల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిరుడు 2 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు తక్కువగా వాడారని, 1.01 లక్షల టన్నుల క్రిమిసంహార మందులు తక్కువగా వినియోగించారని, మైక్రో న్యూట్రియంట్స్ ఉచితంగా అందించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్లే ఇది సాధ్యమైందని సీఎం స్పష్టం చేశారు. మన రాష్ట్రంలో నాణ్యమైన, పౌష్టిక పంటల దిగుబడులు సాధించడం ద్వారా ప్రపంచ



దృష్టిని ఆకర్షించాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. రెయిన్ గన్స్ ఎలా ఉపయోగించాలి? ఎంత వరకూ ఫలితాలు సాధించారు? అనే విషయంలో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి రాబోయే ఖరీఫ్‌లో కూడా రెయిన్‌గన్స్ వినియోగించి పంటలను కాపాడాలని సూచించారు. ఇప్పటి వరకూ 25వేల సోలార్ పంప్‌సెట్లు రైతులకు అందజేశామని, మరో 15 వేలు అందజేయనున్నామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం వల్ల కాలుష్య సమస్యను అధిగమిస్తామన్నారు.

పాడి పరిశ్రమతో మరింత ఆదాయం

ఆక్వాలో కాలుష్యం నియంత్రించాలని, ప్రజలు ఆంధ్రా ఆక్వాపైనే మొగ్గు చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. రాయలసీమలో నీరు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయం పురోగతి సాధించిందన్నారు. దీంతో పాటు పాల దిగుబడి మరింత పెరిగిందని, ఇది ఎంతో సంతోషకరమైన విషయమని చంద్రబాబు అన్నారు. రోజువారీ పాల విక్రయాలు 50 లక్షల లీటర్ల నుంచి 55 లక్షల లీటర్లకు పెరగడం పాడి పరిశ్రమకు మరింత ఊతం లభించినట్లు అయ్యిందన్నారు. ఏరువాక, జలసిరికి హారతి, వనం-మనం కార్యక్రమాల స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు.

సాంకేతికతతో మనమే ముందుండాలి

ఫైబర్ గ్రిడ్ ప్రారంభానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ట్వీట్ల ద్వారా రాష్ట్ర పురోగతిని ప్రశంసించడాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రపంచానికే మన టెక్నాలజీ నమూనాగా మారాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు, గాలి నాణ్యత, రోడ్డు ప్రమాదాలు అన్నింటినీ రియల్ టైమ్‌లో పర్యవేక్షించాలని సూచించారు. విపత్తు నిర్వహణ సంస్థ మరింత క్రియాశీలం కావాలని అధికారులకు సూచించారు.

సమాజాన్ని సంతోషంగా ఉంచాలి

రాష్ట్రంలో నరేగా నిధులను గరిష్టంగా వినియోగించుకోవాలని, గ్రామాలలో మౌలిక వసతులను మరింత పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం నుంచి జరిగే 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని పూర్తిగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులను, వార్డు ప్రజలను భాగస్వాములను చేయాలని, అభివృద్ధి, సంక్షేమంపై చర్చించాలని, మనం సంతోషంగా ఉంటే.. సమాజాన్ని సంతోషంగా ఉంచడానికి దోహదపడుతుందన్నారు. కలిసికట్టుగా పనిచేసి, లక్ష్యాలను చేరుకుందామని అధికార యంత్రాగానికి ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలు, విద్యుత్, జలవనరులు, గ్రామీణాభివృద్ధి, రియల్ టైమ్ గవర్నెన్స్, అటవీశాఖలకు చెందిన ఉన్నతాధికారులు హరి జవహర్‌లాల్, చిరంజీవి చౌదరి, రాంశంకర్ నాయక్, మురళి, అజయ్ జైన్, వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, అహ్మద్‌బాబు, ఇస్రో రాజశేఖర్, మల్లిఖార్జున రావు, ఇతర అధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.




సీఎంకు శుభాకాంక్షల వెల్లువ

- బాబును కలిసిన సీఎస్, డీజీపీ, దివ్యాంగ బాలలు
- టీటీడీ, దుర్గగుడి అర్చకుల ఆశీర్వాదం

అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): కొత్త సంవత్సరాది నాడు సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. సోమవారం ఉదయం ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లి సీఎస్ దినేశ్‌కుమార్, డీజీపీ మాలకొండయ్య పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు లబ్ధిదారులకు చేరేందుకు వీలుగా అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేస్తామని ఈ సందర్భంగా సీఎస్ చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటామని డీజీపీ మాలకొండయ్య చెప్పారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు డీజీపీకి పలు సూచనలు చేశారు. బాల వికాస కేంద్రానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. అంతకుముందు సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీకనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

దుర్గమ్మ సన్నిధిలో నటి తమన్నా

విజయవాడ, జనవరి 1: ప్రముఖ సినీ నటి తమన్నా విజయవాడ కనకదుర్గమ్మను సందర్శించారు. తల్లి రజనీ భా టియాతో కలసి సోమవారం ఆ మె దర్శనానికి వచ్చారు. ఆలయ సిబ్బంది వారికి అమ్మవారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు. తమన్నాను చూసేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.





తిరుమల కొండపై న్యూ ఇయర్ వేడుకలు

- ఆలయం సమీపంలోనే జరిగిన వైనం

తిరుమల, జనవరి 1 (మనం న్యూస్): తిరుమల కొండపై ఆంగ్ల సంవత్సరాది వేడుకలు జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు శ్రీవారి ఆలయానికి సమీపంలోనే కొందరు భక్తులు కేక్ కట్ చేసి.. నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని హిందూ దేవాలయాలలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు నిర్వహించొద్దని దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో టీటీడీ విజిలెన్స్ అధికారులు కొండపై షాపులు నిర్వహించే వారు, అక్కడ నివసించే వారికి స్పష్టమైన సూచనలు చేశారు. కొండపై ఎవరూ కేకులు కోసి వేడుకలు చేసుకోవద్దని హెచ్చరించారు. కానీ శ్రీవారి దర్శనానికి వచ్చిన కొందరు భక్తులు కేకు తెచ్చి వేడుకలు చేసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. కొండపై ఉన్నవారిని నిలువరించినప్పటికీ... బయట నుంచి వచ్చే వారు కేకులు వంటివి పైకి తీసుకురాకుండా అలిపిరి వద్దనే అడ్డుకోలేకపోవడం విజిలెన్స్ వైఫల్యమేనని కొందరు ఆరోపిస్తున్నారు.



గ్రామ సచివాలయం

- 10 మంది యువకులకు ఉద్యోగాలు
- 72 గంటల్లో సమస్యల పరిష్కారం
- అర్హులకు సంక్షేమ పథకాలు అమలు
- చిత్తూరు పాదయాత్రలో జగన్ హామీ

చిత్తూరు, జనవరి 1: తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు వేగవంతంగా పరిష్కారం కావటానికి గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తామని వైసీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. ఆయా గ్రామాల్లో చదువుకున్న 10 మంది యువకులకు గ్రామ సచివాలయంలో ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. గ్రామ సచివాలయం ద్వారా 72 గంటల్లో పింఛను, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పార్టీలకతీతంగా అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 49వ రోజు సోమవారం చిత్తూరు జిల్లా చిన తిప్పసముద్రం వద్ద చేనేతలతో జగన్ ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా చేనేతలు తమ సమస్యలు విన్నవించారు. అందరి సమస్యలను విన్న జగన్.. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విశ్వసనీయత అన్న పదానికి చంద్రబాబు నాయుడు పాతర వేశారని విమర్శించారు. ప్రజలు కొడతారేమో అనే భయంతో ఎన్నికల మేనిఫెస్టోను టీడీపీ తన వెబ్‌సైట్ నుంచి తీసేసిందని అన్నారు. విశ్వసనీయత అనే పదాన్ని రాజకీయ నేతలు మర్చిపోయారని, మాట తప్పితే రాజీనామా చేసి ఇంటికి పోయే రోజు రావాలని అన్నారు. ''నాలుగేళ్ల చంద్రబాబు పాలన చూసిన తర్వాత సంతోషంగా ఎవరైనా ఉన్నారా? రైతులు, చేనేతలు, అక్కాచెల్లెమ్మలు, విద్యార్థులు, అవ్వాతాతలు ఎవరూ సంతోషంగా లేరు. చేనేతలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా చంద్రబాబు నెరవేర్చలేదు. ప్రతి కులాన్ని ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రకాలుగా ఆయన మోసం చేశారు'' అని జగన్ అన్నారు. 49వ రోజు పాదయాత్ర ముదివేడు నుంచి ప్రారంభమైంది. టీటీడీ అర్చకుల సమక్షంలో వేంకటేశ్వరస్వామికి జగన్ ప్రత్యేక పూజలు చేశారు. కడప క్రాస్ రోడ్డు, నడింపల్లి, ఆర్సీ కురవపల్లి, గడ్డెత్తుపల్లి, నల్లగుట్టపల్లి, కాయలపల్లి, అడ్డగింతవారిపల్లి, చిలకవారిపల్లి, రేగంటివారిపల్లి, సీటీఎం క్రాస్ రోడ్స్ మీదుగా సీటీఎం వరకు పాదయాత్ర చేశారు.

ప్రజారంజకంగా 2018-19 బడ్జెట్

- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం: యనమల రామకృష్ణుడు



కాకినాడ, జనవరి 1 (మనం బ్యూరో): మార్చిలో ప్రవేశపెట్టనున్న 2018-19 రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజారంజకంగా రూపొందిస్తామని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులు కేటాయిస్తామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. సోమవారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే బడ్జెట్‌లో పెండింగ్ ఇరిగేషన్ ప్రోజెక్టులను పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఆర్థిక నిపుణులు, వివిధ శాఖల మంత్రులు, సీనియర్ అధికారులతో ఈ నెలలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బడ్జెట్ రూపకల్పనపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల ఎదుర్కొంటున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఏ విధమైన ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం రంగంలో దేశంలోనే ఏపీ ముందంజలో ఉందని మంత్రి అన్నారు. 2018లో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానన్నారు.

పండుగ ఎలా అవుతుంది?


- జన్మభూమిలో 1 శాతం అర్జీలనూ పరిష్కరించలేదు: రఘువీరా

విజయవాడ, జనవరి 1: టీడీపీ ప్రభుత్వం వచ్చాక గత నాలుగు జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఒక్క శాతం కూడ పరిష్కరించకుండా.. ఇప్పుడు చేపడుతున్న 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం పండుగ ఎలా అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఏపీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం నుంచి ఈ నెల 11 వరకూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలోనైనా ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఏపీసీసీ కార్యాలయం సోమవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలలో తాను పర్యటించినప్పుడు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను.. ఐదో విడత జన్మభూమి కార్యక్రమం సందర్భంగా చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లుతున్నట్లు రఘువీరా వెల్లడించారు.



సెన్సెక్స్ జనవరి 1 2018


33,812.75



పెరిగినవి	%	తగ్గినవి	%
కోల్ ఇండియా	1.44	టీ.సీ.ఎస్	-1.69
విప్రో	1.39	ఇండస్ ఇండ్	-1.45
సన్ ఫార్మా	0.49	హెచ్.యు.ఎల్	-1.40
యాక్సిస్ బ్యాంక్	0.44	హెచ్‌డీఎఫ్‌సీ	-1.35
లార్సన్ టూబ్రో	0.39	టాటా మోటార్స్	-1.35

నిఫ్టీ జనవరి 1 2018

10435.55



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా పవర్	3.90	ఐడియా సెల్యూలర్	-3.28
కోల్ ఇండియా	1.41	భారతీ ఇన్‌ఫ్రా	-2.32
విప్రో	0.73	టీ.సీ.ఎస్	-2.06
సన్ ఫార్మా	0.51	బోష్	-1.85
సిప్లా	0.49	బజాజ్ ఫినాన్స్	-1.77


టాప్ లూజర్స్ 1 జనవరి

33,812.75


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
2654.65	టీ.సీ.ఎస్	-1.69%
1626.25	ఇండస్ ఇండ్ బ్యాంక్	-1.45%
1349.00	హెచ్.యు.ఎల్	-1.40%
1687.35	హెచ్‌డీఎఫ్‌సీ	-1.35%
425.40	టాటా మోటార్స్	-1.35%
723.70	టాటా స్టీల్	-1.19%
192.40	ఓ.ఎన్.జీ.సీ	-1.16%
3285.25	బజాజ్ ఆటో	-1.14%
400.10	ఆదాని పోర్ట్స్	-1.12%
310.55	ఐసీఐసీఐ బ్యాంక్	-1.10%

-244.08

బులియన్ | గత 7 రోజులు




రూపాయి వర్సెస్ డాలర్



'కొత్త వెలుగుల' సంవత్సరం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం సంపాదించుకున్న 70 ఏళ్ళకి, వేలాది గ్రామాలకు విద్యుదీకరణ కల్పించడంలో భారత్ వేగాన్ని కనబరుస్తోంది. వృద్ధిని వేగవంతం చేసి, దాని ఫలాలు అందరికీ అందేట్లు చూడాలని భారత్ భావిస్తోంది. విద్యుత్ సదుపాయం ఇప్పటికీ లేని పాతిక కోట్ల మందికి పైగా జనాభాకు విద్యుత్ సదుపాయం కల్పించే బృహత్ లక్ష్యాన్ని సాధించేందుకు కొత్త సంవత్సరంలో ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేయనుంది. విద్యుత్ రంగానికి సంబంధించినంత వరకు 2017 ముఖ్యమైనదిగా గడిచింది. ప్రభుత్వం 2017 సెప్టెంబరులో రూ. 16,320 కోట్లతో ప్రధాన్ మంత్రి సహజ్ బిజ్లీ హర్ ఘర్ యోజన (సౌభాగ్య)ను ఆవిష్కరించింది. 2019 మార్చి నాటికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దాదాపు 4 కోట్ల మందికి విద్యుత్ సదుపాయం కల్పించడం ఈ పథకం లక్ష్యం. అయితే, సౌభాగ్య పథకం కింద 2018 డిసెంబర్ నాటికే అఖిల విద్యుదీకరణ లక్ష్యాన్ని సాధించాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ కంకణం కట్టుకుంది.

దేశంలో 2017 నవంబరు 30 నాటికి, 1,24,219 గ్రామాల్లో విద్యుదీకరణను, 4,68,827 గ్రామాల్లో తీవ్ర విద్యుదీకరణను పూర్తి చేశారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న 277.20 లక్షల బి.పి.ఎల్. కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. రాష్ట్రాలు 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 5,97,644 గ్రామాలలోని దాదాపు 18,452 గ్రామాల్లో విద్యుత్ సదుపాయం లేదని 2015 ఏప్రిల్ 1న ప్రకటించాయి.



ప్రి-పెయిడ్ మీటర్లు

విద్యుత్ కనెక్షన్ కల్పించడం పేద ప్రజానీకానికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని వారికి పెద్దగా సహాయపడకపోవచ్చు. వారికి రుసుము చెల్లించే స్తోమత తక్కువ. ఆదాయాలు క్రమబద్ధమైనవి కావు. సౌభాగ్య పథకం కింద విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రి-పెయిడ్ మీటర్లను మరింత ఎక్కువగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పథకం వేసింది. మానవ సిబ్బంది సహాయం లేకుండా ఆన్‌లైన్ జనరేషన్, సర్వీసు, ఎలక్ట్రిసిటీ బిల్లుల చెల్లింపు జరిపేందుకు ప్రి-పెయిడ్, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు గురించి విద్యుత్ మంత్రి ఆర్.కె. సింగ్ అనేక సందర్భాలలో చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని అన్ని గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, విద్యుత్ సదుపాయం లేకుండా ఏ ఒక్కరూ మిగలకపోవడం సౌభాగ్య పథకం ఆశయం. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లోని ఆర్థికమైన పేదలకు, ఒక్కమాటలో చెప్పాలంటే, సామాజిక, ఆర్థిక, కుల ఆర్థిక (ఎస్.ఇ.సి.సి) డాటాలో కనీసం ఒక అంశమైన కొరవడిన, విద్యుత్ సదుపాయం కొరవడిన అన్ని కుటుంబాలకు ఈ పథకం కింద ఉచితంగా విద్యుత్ కనెక్షన్ కల్పిస్తారు. ఇతర కుటుంబాల నుంచి రూ. 500 పది సమాన వాయిదాలలో వసూలు చేస్తారు. దానితోపాటు మారుమూల, రవాణా సదుపాయాలు ఏమాత్రం లేని ప్రాంతాల్లోని వారికి సౌర ఫోటోవోలాటిక్ (ఎస్.పి.వి) ఆధారిత సిస్టంలను ఎల్.ఇ.డి లైట్లతో ఇస్తారు. ఫ్యాన్, పవర్ ప్లగ్ వంటివి కూడా దానితో ఉపయోగించుకోవచ్చు. ఎస్.ఇ.సి.సి 2011 డాటా ఉపయోగించి, సామాజిక-ఆర్థిక పరిస్థితుల ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తారు.

ఉదయ్ పథకం

ఉదయ్ పథకాన్ని సమర్థంగా అమలుపరచడమంటే అప్పులలో కూరుకుపోయిన డిస్కంలను పునరుద్ధరించడమే. ఇది కూడా 2018లో పరిస్థితిలో మార్పు తేవచ్చు. ''గృహాల విద్యుదీకరణ నుంచి ఫ్రాంచైజీ బిడ్ల వరకు పంపిణీ రంగం ఎక్కువ దృష్టిని ఆకర్షించనుంది. మనం కొత్త సంస్థల ప్రవేశాన్ని చూడవచ్చు. వైర్ల అన్‌బండ్లింగ్, సరఫరా వ్యాపార నమూనాలలో నవకల్పనలకు పురికొల్పవచ్చు'' అని ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్‌లో ఎనర్జీ, యుటిలిటీస్ విభాగ భాగస్వామి కామేశ్వర రావు చెప్పారు. ''ప్రభుత్వం, యుటిలిటీస్ బిడ్‌లకు సంబంధించి సరైన మార్గాన్ని నిర్వహిస్తాయని అంచనాలు చాలా ఉన్నాయి. అది కొరవడితే, కొత్త మూలధనం, స్థానిక సరఫరా గొలుసు అదృశ్యం కావచ్చు'' అని ఆయన అన్నారు. పోటీ ప్రభావాన్ని, కమర్షియల్ లోడ్ నష్టాన్ని ఎదుర్కొంటున్న యుటిలిటీలు టెక్నాలజీ, యువ సిబ్బందిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా తమ కార్యకలాపాలను సమన్వయపరచుకోగల అవకాశం ఉందని ఆయన అన్నారు. డిస్కంల ఫైనాన్షియల్, నిర్వహణాపరమైన దశను మార్చే ఉజ్వల్ డిస్కం ఎస్యూరెన్స్ యోజన (ఉదయ్)ని 2015 నవంబరులో ప్రారంభించారు. సుమారు రూ. 4.3 లక్షల కోట్ల మేరకు ఉన్న అప్పుల వారసత్వ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని కల్పించే, భవిష్యత్తులో నష్టాల సమస్య తలెత్తకుండా చూసే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. ఉత్పాదన, ట్రాన్స్‌మిషన్, పంపిణీ, బొగ్గు, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి అన్ని రంగాల్లోనూ ఈ పథకం సంస్కరణ చర్యలను తీసుకువచ్చింది. ఈ పథకం గడువు 2017 మార్చి 31తో ముగిసింది.

లాభాల స్వీకరణతో తగ్గిన సూచీలు

ముంబయి: స్టాక్ మార్కెట్లకు గీటురాయిగా భావించే బొంబాయి స్టాక్ ఎక్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి కొత్త ఏడాది (2018)లో మొదటిరోజున 244 పాయింట్లు తగ్గింది. గత నెల రోజుల్లో ఒకే రోజులో సెన్సెక్స్‌కు వాటిల్లిన పెద్ద నష్టంగా దీన్ని చెప్పవచ్చు. ఆటో, బ్యాంకింగ్, ఐ.టి కంపెనీల షేర్లను ట్రేడింగ్ చివరలో అమ్మడంతో సెన్సెక్స్ 34,000 పాయింట్లకన్నా దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 33,766.15 పాయింట్లకు తగ్గింది. తర్వాత కొంత పుంజుకొని 33,812.75 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ డిసెంబరు 1న 316.41 పాయింట్లు కోల్పోయింది. తిరిగి ఒకే రోజులో అంతపెద్ద యెత్తున పాయింట్లు నష్టపోవడం ఇదే మొదటిసారి. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా సోమవారం ఒక దశలో 10,423.10 పాయింట్లకు పడినా కొద్దిగా కోలుకుని 10,435.55 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లు నూతన సంవత్సరం సెలవు సందర్భంగా మూసి ఉన్నాయి. వాటి నుంచి సంకేతాలు ఏవీ లేకపోవడంతో రికార్డు స్థాయిలకు పెరిగిన మార్కెట్ల నుంచి లాభాలు మూటగట్టుకోవాలని బ్రోకర్లు, ఇన్వెస్టర్లు నిర్ణయించడంతో రెండు సూచీల స్థాయిలు తగ్గాయి. బి.ఎస్.ఇలోని రంగాలవారీ సూచీలలో ఆటో రంగ సూచి ఎక్కువగా 0.78 శాతం నష్టపోయింది. తర్వాత బ్యాంకింగ్ (0.75), ఐ.టి (0.55 శాతం) నష్టపోయాయి. విద్యుత్ రంగ సూచి (0.79 శాతం), క్యాపిటల్ గూడ్స్ (0.4 శాతం), రియల్టీ (0.36 శాతం), వినియోగ వస్తువుల రంగ సూచి (0.18 శాతం) పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఇన్వెస్టర్లను 2017లో మరింత సంపన్నులను చేశాయి.



నిబద్ధతతో వ్యాపార వృద్ధి

జంషెడ్‌పూర్: భారతదేశంలో వ్యాపారాన్ని మరింత వృద్ధి చెందించడానికి టాటా స్టీల్ నిబద్ధతతో ఉందని, ప్రభుత్వంతో మరింత సన్నిహితంగా పనిచేయాలని ఆశిస్తోందని కంపెనీ అధికారి ఒకరు చెప్పారు. వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి)ని ప్రభుత్వం విజయవంతంగా అమలులోకి తెచ్చిందని, భారతదేశంలో కంపెనీ వాల్యూ చైన్‌లో దాని సానుకూల పర్యవసానాలున్నాయని టాటా స్టీల్ సి.ఇ.ఓ, మేనేజింగ్ డైరెక్టర్ టి.వి. నరేంద్రన్ చెప్పారు. కంపెనీ ఉద్యోగులకు 2017 ఏడాది చివరి రోజున ఇచ్చిన సందేశంలో ఆయన ఈ విషయాలు తెలిపారు. ''ప్రపంచ వ్యాప్తంగా ఉక్కు డిమాండ్, ధరలు, వర్తకం 2017లో రికవరీని చూశాయి. దాంతో భారతీయ ఉక్కు రంగం ఊహించిన దానికన్నా మెరుగైన పనితీరు కనబరచింది. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా అవతరించడాన్ని 2017 వీక్షించడమే కాదు, పెరుగుతున్న దిగుమతుల ధోరణిని విజయవంతంగా రివర్సు చేసి, నికర ఎగుమతిదారుగా పరిణమించగలిగింది'' అని నరేంద్రన్ చెప్పారు. కేంద్రం రూపొందించిన జాతీయ ఉక్కు విధానం 2017, భారతదేశంలో ఉక్కు దార్శనికతకు ఒక దీర్ఘకాలిక రోడ్ మ్యాప్‌ను రూపొందించిందని ఆయన చెప్పారు. ''టాటా స్టీల్‌లో మేం భారతదేశంలో మా వ్యాపారాన్ని మరింత వృద్ధి చెందించడానికి, భారతదేశపు ఆర్థిక వృద్ధికి సానుకూలంగా కృషి చేయడానికి కంకణబద్ధులమై ఉన్నాం. ప్రభుత్వంతో సన్నిహితంగా కలసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాం'' అని నరేంద్రన్ అన్నారు. కళింగనగర్ కర్మాగారం ఉత్పాదక సామర్థ్యాన్ని 30 లక్షల టన్నుల నుంచి విజయవంతంగా పెంచాం. రూ. 23,500 కోట్ల అదనపు ప్రణాళికా పెట్టుబడితో, ఉత్పాదక సామర్థ్యాన్ని ఇంకా ఎక్కువగా 80 లక్షల టన్నులకు పెంచడానికి కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఆ మొత్తాన్ని కంపెనీ ఈక్విటీ, రుణాల మిశ్రమం ద్వారా సేకరించనుంది. ఆటోమోటివ్, జనరల్ ఇంజనీరింగ్, ఇతర వాల్యూ-యాడెడ్ విభాగాలలో భారతదేశంలో డిమాండ్ పెరుగుతోంది. దాన్ని తీర్చడంలో కంపెనీకి ఈ ఉత్పాదక సామర్థ్య పెంపుదల సాయపడనుంది. టిసెన్‌క్రప్ ఏజీతో సమాన సంయుక్త రంగ సంస్థ పథకం కార్యరూపం ధరిస్తే, ఐరోపాలో రెండవ అతిపెద్ద ఉక్కు ఉత్పాదక సంస్థగా అది రూపొందగలదని టాటా స్టీల్ ఆశాభావంతో ఉన్నట్లు నరేంద్రన్ చెప్పారు.



పెరిగిన అమ్మకాలు

తగ్గిన ఎగుమతులు



న్యూఢిల్లీ: దేశంలో కార్ల తయారీలో పెద్ద సంస్థ మారుతి సుజుకి ఇండియా (ఎం.ఎస్.ఐ) 2017 డిసెంబరులో మొత్తం అమ్మకాలలో 10.3 సాథం పెరుగుదలను కనబరుస్తూ 1,30,066 యూనిట్లు విక్రయించింది. కంపెనీ 2016 డిసెంబరులో 1,17,908 యూనిట్లను మాత్రమే అమ్మగలిగింది. దేశంలో అమ్మకాలు 2016 డిసెంబరులో ఉన్న 1,06,414 యూనిట్ల నుంచి 12.1 శాతం పెరిగి 1,19,286 యూనిట్లుగా నమోదైనట్లు ఎం.ఎస్.ఐ. ఒక ప్రకటనలో తెలిపింది. ఆల్టో, వ్యాగన్ ఆర్‌తో సహా మినీ సెగ్మెంట్‌లోని కార్ల అమ్మకాలు 2016 డిసెంబరులో ఉన్న 31,527 నుంచి 2017 డిసెంబరులో 32,146 యూనిట్లకు పెరిగాయి. స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలినోతో కూడిన కాంపాక్ట్ సెగ్మెంట్‌లో 2016 డిసెంబరులో 43,295 యూనిట్ల మేరకు ఉన్న అమ్మకాలు 23.2 శాతం పెరుగుదలతో 2017 డిసెంబరులో 53,336 యూనిట్లకు చేరుకున్నాయని ఈ ఆటో రంగ దిగ్గజ సంస్థ తెలిపింది. మధ్య శ్రేణి సెడాన్ సియాజ్ అమ్మకాలు మాత్రం 2017 డిసెంబరులో 2,382 యూనిట్లకు తగ్గాయి. జిప్సీ, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎస్-క్రాస్, కాంపాక్ట్ ఎస్.యు.వి. విటారా బ్రెజాతో సహా యుటిలిటీ వాహనాల అమ్మకాలు 2016 డిసెంబరులో 16,072 యూనిట్లుగా ఉన్నవి 2017 డిసెంబరులో 19,276 యూనిట్లకు పెరిగాయి. వ్యాన్ల అమ్మకాలు అదే కాలంలో 9,224 యూనిట్ల నుంచి 11,420 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ ఎగుమతులు మాత్రం 2016 డిసెంబరులో ఉన్న 11,494 యూనిట్ల నుంచి 2017 డిసెంబరులో 10,780 యూనిట్లకు తగ్గాయి.



బంధన్ బ్యాంక్ పబ్లిక్ ఇష్యూ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కేంద్రంగా ఉన్న బంధన్ బ్యాంక్ రూ. 2,500 కోట్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐ.పి.ఓ)కు వెళ్ళాలనుకుంటోంది. అనుమతిని కోరుతూ అది పెట్టుకున్న దరఖాస్తులు భారతీయ సెక్యూరిటీలు, ఎక్ఛేంజ్ బోర్డు (సెబి) పరిశీలనలో ఉన్నాయి. ''రూ. 10 ముఖ విలువ కలిగిన 11,92,80,494 ఈక్విటీ షేర్ల ప్రతిపాదిత పబ్లిక్ ఆఫరింగ్‌కు సంబంధించి బంధన్ బ్యాంక్ జారీ చేసిన నష్ట ప్రమాదాల వివరణ ముసాయిదా పత్రం (డి.ఆర్.హెచ్.పి) 'సెబి' పరిశీలనలో ఉంది'' అని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఐ.పి.ఓ కింద కొత్తగా 9,76,63.910 ఈక్విటీ షేర్లను జారీ చేయాలనుకుంటోంది. అందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐ.ఎఫ్.సి) 1,40,50,780 షేర్ల వరకు, ఐ.ఎఫ్.సి ఎఫ్.ఐ.జి ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ 75,65,804 షేర్లను అమ్మకానికి పెడుతున్నాయి. ఈ ఇష్యూను బ్యాంకింగ్ రంగానికి చెందిన అతిపెద్ద ఐ.పి.ఓగా చెబుతున్నారు. ఈక్విటీ షేర్లను బి.ఎస్.ఇ, ఎన్.ఎస్.ఇ.లలో లిస్ట్ చేయనున్నట్లు తెలిపింది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్, గోల్డ్‌మ్యాన్ శాక్స్ (ఇండియా) సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, జె.ఎం. ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషనల్ సెక్యూరిటీస్, జె.పి. మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఇష్యూకి లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

తగ్గిన ట్రాక్టర్ల ఎగుమతులు

న్యూఢిల్లీ: వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్స్ అగ్రి మెషినరీ 13.1 శాతం పెరుగుదలను కనబరుస్తూ 2017 డిసెంబరులో 3,606 ట్రాక్టర్ల అమ్మకాలు సాధించినట్లు ప్రకటించింది. ఎస్కార్ట్స్ కంపెనీ 2016 డిసెంబరులో 3,187 యూనిట్లను మాత్రమే అమ్మగలిగింది. దేశంలో 2016 డిసెంబరులో 3,043 ట్రాక్టర్లను విక్రయిస్తే, గత నెలలో 3,476 యూనిట్లను విక్రయించగలిగినట్లు బి.ఎస్.ఇకి తెలిపింది. ఎగుమతులు మాత్రం 2016 డిసెంబరులో 144 యూనిట్లుగా ఉన్నవి గత నెలలో 130 యూనిట్లకు తగ్గాయి.

అదనపు పెట్టుబడి రాక

న్యూఢిల్లీ: వివిమెడ్ ల్యాబ్స్ (మస్కరెని)లో ఆరోగ్య రక్షణ రంగ పెట్టుబడుల సంస్థ ఆర్బిమెడ్ ఏషియా అదనంగా 7.5 మిలియన్ అమెరికన్ డాలర్ల (రూ. 47 కోట్లకు పైగా) పెట్టుబడి పెట్టినట్లు ఔషధాల తయారీ సంస్థ వివిమెడ్ ల్యాబ్స్ సోమవారం ప్రకటించింది. ఆర్బిమెడ్ ఏషియా నుంచి కంపెనీ ఇంతకు ముందు 2017 సెప్టెంబరులో 42.5 మిలియన్ డాలర్ల పెట్టుబడిని అందుకున్నట్లు బి.ఎస్.ఇకి వివిమెడ్ ల్యాబ్స్ తెలిపింది. ఆ విదేశీ అనుబంధ సంస్థ కంపెనీకి చెందిన యాక్టీవ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్ (ఏ.పి.ఐ) వ్యాపారానికి హోల్డింగ్ సంస్థగా ఉన్నట్లు తెలిపింది. ఆర్బిమెడ్ ఏషియా నుంచి వచ్చిన ఈ అదనపు పెట్టుబడి ఆరోగ్య రక్షణ పరిశ్రమలో వివిమెడ్ అనుసరిస్తున్న వ్యాపార నమూనాపై ఆ ఇన్వెస్టర్‌కు ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని వివిమెడ్ ల్యాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ వరల్వార్ చెప్పారు. వివిమెడ్ ల్యాబ్స్ షేర్ ధర బి.ఎస్.ఇలో రూ. 106.45 వద్ద కోట్ అవుతోంది.

కమర్షియల్ వాహనాల

కొనుగోళ్ళలో జోరు

Mahindra
Rise.

న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) మొత్తం అమ్మకాల్లో 8 శాతం పెరుగుదలను కనబరుస్తూ డిసెంబరులో మొత్తం అమ్మకాలుగా 39,200 యూనిట్లను నమోదు చేయగలిగినట్లు ప్రకటించింది. 2016 డిసెంబరులో 36,464 యూనిట్లను మాత్రమే విక్రయించగలిగినట్లు తెలిపింది. దేశంలో అమ్మకాలు 2016 డిసెంబరునాటి 34,411 యూనిట్ల నుంచి గత నెలలో 36,979 యూనిట్లకు పెరిగినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎగుమతులు కూడా 2016 డిసెంబరులో ఉన్న 2053 యూనిట్ల నుంచి 2,221 యూనిట్లకు వృద్ధి చెందాయి. స్కార్పియో, ఎక్స్.యు.వి.500, జైలో, బొలీరో, వెరిటోతో సహా పాసింజర్ వాహనాల అమ్మకాలు 2016 డిసెంబరులో ఉన్న 16.799 యూనిట్ల నుంచి 15,543 యూనిట్లకు తగ్గాయి. కమర్షియల్ వాహనాల అమ్మకాలు అదే కాలానికి 14,154 యూనిట్ల నుంచి 17,542 యూనిట్లకు పెరిగాయి. ''మా కమర్షియల్ వాహనాల అమ్మకాల్లో వృద్ధి డిసెంబరు నెలలో 24 శాతంగా ప్రోత్సాహకరంగా ఉంది. ఎం.హెచ్.సి.వి. విభాగంలో మేం కనబరుస్తున్న పటిష్టమైన పనితీరు ఆర్థిక వ్యవస్థలోని ఉత్తేజాన్ని సూచిస్తోంది'' అని ఎం అండ్ ఎం (ఆటోమోటివ్ రంగ) అధ్యక్షుడు రాజన్ వద్రా చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలు, వ్యయాన్ని నలుగురు కలిసి పంచుకుని ప్రయాణించే పద్ధతి 2018లో ఈ రంగం గతికి ముఖ్య సూచికలు కాబోతున్నాయని, మహీంద్రా సంస్థ కీలకమైన, నవకల్పనల సంస్థగా కొనసాగుతుందని ఆయన చెప్పారు.

HYUNDAI

హ్యుందాయ్ అమ్మకాల్లో జంప్

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్.ఎం.ఐ.ఎల్) 2017 డిసెంబరులో మొత్తం 62,899 యూనిట్ల అమ్మకాలు సాధించగలిగినట్లు తెలిపింది. అది 2016 డిసెంబరులో అమ్మిన 57,164 యూనిట్లతో పోలిస్తే, 10 శాతం పెరుగుదల సాధించినట్లు లెక్క. దేశంలో అమ్మకాలు మాత్రం 2016 డిసెంబరులో ఉన్న 40,057 యూనిట్ల నుంచి 2017 డిసెంబరులో 40,158 యూనిట్లకు స్వల్పంగా పెరిగాయి. హ్యుందాయ్ కార్ల ఎగుమతులు 2016 డిసెంబరులో ఉన్న 17,107 యూనిట్ల నుంచి 2017 డిసెంబరులో 22,741 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ 2016లో 5,00,539 యూనిట్లు అమ్మింది. అది 5.4 శాతం పెరుగుదల కనబరుస్తూ 2017 క్యాలెండర్ సంవత్సరంలో 5,27,320 యూనిట్ల దేశీయ అమ్మకాలు సాధించింది.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 2 జనవరి 2018

నిత్యజీవం

నీ దైవమైన ప్రభువును శోధించవద్దు. కేవలం విశ్వసించు. ఆయన నీకు రక్షణ ప్రసాదిస్తాడు. దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను. ఈ జీవము ఆయన కుమారుని యందున్నది అని యోహాను వాక్యము. ఏసుక్రీస్తు మన పాపముల కోసమే శిలువపై మరణించాడు. ఎందరు తనను అంగీకరించారో వారికందరికి, క్రీస్తు తన నామముపై విశ్వాసముంచిన అందరికీ దేవుని పిల్లలగుటకు అధికారము అనుగ్రహించాడు.



దేవుడు లోకాన్ని ఎంతగానో ప్రేమించాడు. అందువల్లనే ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన క్రీస్తుపై విశ్వాసముంచే ప్రతివారు నిత్యజీవము పొందేలా అనుగ్రహించాడు. క్రీస్తుయందు విశ్వాసమే మానవుని రక్షించగలదు. ఆయనను శోధించి సాతాను సైతం ఓడిపోయాడు. ఇందుకు బైబిల్ గాథ సాక్ష్యమిస్తోంది. బాప్టిజం స్వీకరించిన తరువాత యేసు ప్రభువు ఒంటరిగా నలభై దినాలు అడవుల్లో ఉపవాసమున్నాడు. సాతాను ప్రభువును శోధించడానికి వచ్చాడు. వాడు యేసుతో నీవు రాళ్ల రొట్టెలుగా చేసి తినవచ్చుగదా! దేవుని కుమారుడవు గదా! అని పలికాడు. మానవుని బ్రతికించేది రొట్టెకాదు, దేవుని దివ్య వాక్కు అని ప్రభువు వాడి ముఖంపై కొట్టినట్లు పలికాడు. సాతాను యేసును గుడి శిఖరానికి తీసుకొని పోయి ఇక్కడ నుండి క్రిందికి దూకు. దైవదూతలు నీ పాదాలకు రాయి తగులకుండా కాపాడుతారు గదా! అని పలికాడు. యేసు నీ దేవుడైన ప్రభువును శోధింప వద్దని లేఖనాలలో ఉన్నదని పలికాడు. మరల సాతాను యేసును కొండ శిఖరానికి తీసికొని పోయి నా కొక్కమారు నమస్కరిస్తే ఈ భూమండలమంతా నీకిస్తానని పలికాడు. ప్రభువు కోపించి వానిని అచ్చట నుండి తరిమాడు. సాతాను ఆయనను వశపరుచుకోలేకపోయాడు. ప్రథమ శిష్యులు మాత్రం ఆయనను విశ్వసించి వచ్చారు.


అంద్రెయ, యోహాను, పేతురు, యాకోబులు ప్రభువు రమ్మనగానే ప్రథమ శిష్యులుగా వచ్చి ప్రభువు పాదాల నాశ్రయించారు. యేసు ప్రభువు, నేను మిమ్మును మనుష్యులను పట్టే జాలరులుగా చేస్తాను రమ్మని పలికాడు. ఆ మాటలు వినగానే వారు తమ భార్యా పిల్లలను, ఆస్తిపాస్తులను విడిచి క్రీస్తు శిష్యత్వాన్ని పొందారు. నీవు క్రీస్తును నీ రక్షకునిగా విశ్వసించి ఆయనను పొందాలనుకుంటే ఒక చిన్న ప్రార్థన చాలు.



పునర్వసు నక్షత్రం సందర్భంగా భద్రాద్రిలో సీతారామచంద్ర ప్రభువుకు విశ్వరూపసేవ జరుగుతుంది. రామనారాయణుడు గరుత్మంత వాహనంపై భక్తులను అనుగ్రహిస్తాడు. ముక్కోటి దేవతలతో కలిసి సీతాలక్ష్మణ హనుమత్ సమేతంగా రామయ్య దర్శనమిస్తాడు.

జగదానంద కారకా!

యస్తు భద్రనగే పుణ్యే జపం కుర్యాత్తు భక్తితః
సహస్ర గుణితం పుణ్యం తస్యభూయాద్ధరాతలే



భద్రాచల క్షేత్రంలో భక్తితో శ్రీరామమంత్రాన్ని జపిస్తే వెయ్యిరెట్లు ఫలం లభిస్తుందని పరాశర సంహిత చెబుతోంది. సీతారామచంద్రస్వామి స్వయంభువుగా వెలిసిన పద్నాలుగు దివ్యక్షేత్రాలలో భద్రాచలం అతి ముఖ్యమైనది. అటువంటి భద్రాద్రి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా పదకొండురోజుల ముందునుంచే అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయి. పదిరోజులపాటు శ్రీమహావిష్ణువుగా దశావతారాల్లో భక్తులను అనుగ్రహిస్తాడు. ముక్కోటికి ముందురోజు తెప్పోత్సవం జరుగుతుంది. మరునాడు స్వామి ఉత్తరద్వారదర్శనం అనుగ్రహిస్తాడు. ఆ తరువాత రోజునుంచి రాపత్తు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. భద్రాచలంలోని వివిధ మంటపాలకు సీతారామచంద్రస్వామి వేంచేసి ప్రత్యేక పూజలందుకుంటాడు. ఆ తరువాత జరిగే విలాసోత్సవాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పుష్యమి నక్షత్రంరోజు వరకు సాగుతాయి. శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం రోజున స్వామి విశ్వరూపదర్శనం అనుగ్రహిస్తాడు. సాధారణంగా ఇతర దేవాలయాల్లో 'నిజరూప దర్శనం' అన్న పదం వింటాం. కానీ భద్రాచలంలో మాత్రం 'విశ్వరూప దర్శనం' ప్రత్యేకం.

నారాయణ స్వరూపుడైన శ్రీరామచంద్రుని గరుత్మంత వాహనంపై సీతాలక్ష్మణ సమేతంగా దర్శించడం పుణ్యప్రదం. విశ్వానికే ధర్మప్రబోధం చేయగల ధర్మమూర్తి శ్రీరాముడు. సహనానికి, స్త్రీత్వానికి నిలువుటద్దం సీతమ్మ తల్లి. సేవా ధర్మానికి, నిర్మల భక్తికి ప్రతీక లక్ష్మణుడు. దాస్యభక్తికి, రామశక్తికి మారుపేరు హనుమంతుడు. ఇదంతా ఓ యోగ బృందం, భోగంతో జీవించే వాళ్లకు యోగాన్ని అందించేవాడు శ్రీరాముడు. భద్రగిరిలోని అన్నిరకాల విగ్రహాలను ఒకచోట చేర్చి ఏకారాధన చేస్తారు. వేదమంత్రోచ్చరణల మధ్య విశ్వరూప సేవ ఆద్యంతం రామరసమయంగా సాగుతుంది. ఆస్థాన హరిదాసులు దర్బారుసేవ నిర్వహిస్తారు. బంగారు పుష్పాలతో స్వామిని పూజిస్తారు. దివిటీ సలామ్ చేసి నక్షత్ర హారతి ఇస్తారు. ముక్కోటి పర్వదినాన్ని చూడని భక్తులు భద్రాచలంలో పునర్వసు నక్షత్రం రోజున (జనవరి 3) ముక్కోటి దేవతలను ఒక్కచోట చేర్చిన విశ్వరూప సేవలో పాల్గొని తరించవచ్చు. దమ్మక్క మండపానికి పుష్యమి నక్షత్రవేళ సీతారాముడు రావడం ఈ ఉత్సవాలు పరిపూర్ణమవుతాయి.

భద్రాద్రి నిలయం రామం నీత్వా పాపైః ప్రముచ్యతే



ప్రేమభక్తిమార్గం

51 –55 సూత్రాలు

అనిర్వచనీయం ప్రేమస్వరూపమ్ । మూకాస్వాదనవత్ । ప్రకాశతే క్వాపి పాత్రే । గుణరహితం కామనారహితం ప్రతిక్షణ వర్ధమాన మవిచ్ఛిన్నం సూక్ష్మతరం అనుభవరూపమ్ । తత్ప్రాప్య తదేవాలోకయతి తదేవ శృణోతి తదేవ భాషయతి తదేవ చింతయతి ।



మూగవాడు మధుర పదార్థాన్ని తిన్న తరువాత రుచిని వర్ణించి చెప్పడం సాధ్యం కానట్లే ప్రేమభక్తిని అనుభవించే భక్తుడు ఆ ప్రేమస్వరూపాన్ని వర్ణించడం సాధ్యం కాదు. చాలా అరుదుగా కొందరు యోగ్యులు మాత్రమే భగవంతుని ప్రేమను వర్ణించి చెప్పగలుగుతారు. ప్రేమభక్తి గుణరహితమైనది. దానికి సత్వరజస్తమో గుణాదులు లేవు. కామనారహితమైనది. ప్రేమభక్తిలో భక్తుడు తనకు ఫలాన కావాలి అని భగవంతుని కోరడు. ఆ ప్రేమ క్షణక్షణమూ పెరుగుతూనే ఉంటుంది. సన్నగిల్లడం, అసలు లేకపోవడం ఉండవు. ప్రేమభక్తి సూక్ష్మాతి సూక్ష్మమైనది. దానిని వెనువెంటనే గ్రహించడం సాధ్యం కాదు. అనుభవంలోకి వస్తే గానీ దానిని గురించి తెలియదు. అనుభవించిన వాడు యోగ్యుడు కానిదే దాని స్వరూపాన్ని వర్ణించి చెప్పలేడు. ప్రేమభక్తిని పొందినవాడు కేవలం ప్రేమనే చూస్తాడు. ప్రపంచం అతనికి ప్రేమస్వరూపంగా దర్శనమిస్తుంది. ఏది విన్నా ప్రేమమయమైన శబ్దాలే వినవస్తాయి. అతని నోటివెంట ప్రేమమయ వాక్కులే వస్తాయి. మధురభక్తిలో మునిగిన వాని ఆలోచనల్లో సైతం ప్రేమ వెల్లివిరుస్తుంది. ఇది అహేతుకమైన నిర్గుణ భక్తి. ఇందులో భగవానుని ఆరాధించేందుకు కారణం అంటూ ఏమీ ఉండదు. ఆయన రూపంతోనూ పనిలేదు. తనకు తోచిన రూపాన్ని భక్తుడు మనసులో చిత్రించుకున్నా ఆయనను కోరదగినది ఏదీ ఉండదు. అన్నీ ఆయనే మనకు అనుగ్రహిస్తున్నాడు. ఆయనను ప్రేమించి, సేవించడమే మన కర్తవ్యం అనుకున్న భక్తుడు ధన్యుడవుతున్నాడు. ఆయననే వినడం, చూడడం, ఆలోచించడం, భగవత్సేవయే లోకంగా బతకడం అనే అవస్థలు మధురభక్తిలో కనిపిస్తాయి.

–ముకుందప్రియ

త్యాగరాజ దర్శనం




'ధీరుడౌ రామదాసుని బంధము దీర్చినది విన్నానురా రామా' అన్నారు త్యాగరాజస్వామి. భక్తరామదాసు పదిహేడో శతాబ్దిలో జీవించిన వాగ్గేయకారుడు అయితే త్యాగయ్య పద్దెనిమిదో శతాబ్దికి (1767 – 1848) చెందినవారు. కర్ణాటక సంగీతానికి ఒరవడి దిద్దిన త్యాగరాజస్వామి తన కృతుల్లో పూర్వకవులందరినీ స్మరించుకున్నారు. ముఖ్యంగా భద్రాచల రామదాసును గురించి ప్రహ్లాదవిజయంలో 'కలియుగమున వర భద్రాచలమున నెలకొన్న రామచంద్రుని పాదభక్తులకెల్ల వరుడనందగి వెలసిన శ్రీరామదాసు వినుతింతు మదిన్' అని చెప్పారు.

రామదాసు తరువాత భద్రగిరి రామయ్యను గేయపుష్పాలతో సమర్చించిన మహనీయుడు తూము నరసింహదాసు. రామనామమే జీవనము, భక్తావనము – పతితపావనమని భావించిన వాడాయన. నిధుల కంటే రాముని సన్నిధి చాల సుఖమనుకుంటూ త్యాగయ్య ఉన్న ఊరిని వదిలి తీర్థయాత్రలు చేసింది చాలా తక్కువ.

'అదిగో భద్రాద్రి... గౌతమి ఇదిగో చూడండి' అంటూ పరవశించి గానం చేసినవారు తూము నరసింహదాసు. ఆయన ఒకసారి త్యాగయ్యను దర్శించారు. అప్పుడాయన రామేశ్వర యాత్రలో ఉన్నారు.

త్యాగరాజు మాత్రమే కాకుండా సంగీత త్రిమూర్తులైన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ కూడా నివసించిన తిరువారూరు చేరుకున్నారు. త్యాగరాజస్వామి జన్మస్థలాన్ని దర్శించి పులకించారు. అక్కడి నుంచి తంజావూరు 62 కిలోమీటర్ల దూరంలో ఉంది. తంజావూరు నుంచి 13 కిలోమీటర్ల దూరంలోని గ్రామమైన తిరువయ్యార్ చేరుకున్నారు.

పంచనదీశ్వరుడు కొలువైన మహాక్షేత్రమది. ఆరువేల గజాలకు పైబడిన సువిశాల ప్రాంగణంలో సమున్నత శిఖరాలతో చోళశిల్పకళకు నిలయమైన మహానిర్మాణం ఆ ఆలయం. కరికాల చోళుని మొదలు, కృష్ణదేవరాయని వరకు ఆ పరమేశ్వరుని సేవలో తరించినవారే.



అటువంటి తిరువయ్యార్ గ్రామంలో నివసించే త్యాగరాజస్వామి రాజాశ్రయాన్ని కోరుకోలేదు. భక్తికి ప్రతిఫలంగా భుక్తి, ముక్తి కావాలని ఆశించలేదాయన. కేవలం ముక్తికోసమే పాకులాడాడు. కవనం, గానం రెండింటినీ సమాన ఫణితిలో నడిపి వాగ్గేయకారునిగా లబ్ధప్రతిష్ఠుడయ్యాడాయన. శాస్త్రీయసంగీతానికి ఒరవడిని దిద్ది ఎన్నో రాగాలకు సుమధుర కీర్తనలు సమకూర్చాడు. సంగీత ప్రపంచంలో, సాహిత్యవీధిలో ప్రసిద్ధులైన త్యాగరాజుకు శ్రీరామభక్తిలోనూ సాటి ఎవరూ లేరు.

దేశవ్యాప్తంగా ఎందరెందరో శిష్యులుండేవారు. అయినప్పటికీ నిరాడంబరంగా అతి చిన్న పూరిపాకలో నివసించే త్యాగరాజును దర్శించడానికి పంచనదీశ్వరుని కోవెల నుంచి బయలుదేరారు. తిరుమంజన వీధిలోని వారి గుమ్మంలో కాలుపెట్టారు. ఆయన వెళ్లేసరికి త్యాగయ్యగారు శ్రీరామునికి షోడశోపచారాలు పూర్తిచేసి ఏకపీఠవిగ్రహం ముందు కూర్చొని ఉన్నారు. శిష్యులు ఆయ చుట్టూ ఉన్నారు. తంబుర చేతపట్టుకుని తన్మయులై త్యాగరాజస్వామి రాముణ్ణి కీర్తిస్తున్నారు. ''నీ దయరాదా! రామ నా దయరాదా!'' అనే కీర్తన ఆనాడు త్యాగరాజస్వామి నోటినుంచి నరసింహ దాసు విన్నారు. కేవలానందాన్ని కలిగించే సంకీర్తనావళి విన్న నరసింహదాసు....

రామపద భక్తికీ త్యాగరాయ వరుని
సమముగా నేరరెవ్వరీక్ష్మా తలమున
బ్రేమనాఘనుడొకసారి పిలిచెనేని
రాముడో హోయటంచు మార్పలుకునంట

– అని కీర్తించారు. కొద్దిరోజులు త్యాగరాజస్వామికి అతిథిగా ఉన్నారు. భద్రాచల రామదాసు చరిత్రను గురించి, ఆయన జీవితాన్ని గురించి తూము నరసింహదాసు ఆయనకు వివరించారు. అప్పుడే త్యాగరాజస్వామి ఆలపించిన కీర్తన ఇది.

క్షీర సాగర శయన నన్ను
చింతల పెట్ట వలెనా రామ
వారణ రాజును బ్రోవను వేగమే
వచ్చినది విన్నానురా రామ
నారీ మణికి చీరలిచ్చినది నాడే నే విన్నానురా
ధీరుడౌ రామ దాసుని బంధము తీర్చినది
విన్నానురా
నీరజాక్షికై నీరధి దాటిన నీ కీర్తిని విన్నానురా
తారక నామ త్యాగరాజ నుత దయతోనేలుకోరా
రామ

గజేంద్రునిలా, ద్రౌపదిలా భగవంతుని ఆర్తితో పిలిచి ఆయన రక్షణ పొందినవారు రామదాసు అని త్యాగయ్య వర్ణించారు. సీతమ్మ కోసం వారధి నిర్మించినట్లు రామదాసు కోసం నిజాం నవాబుకు రామమాడలు చెల్లువేయడాన్ని ఈ కీర్తనలో ధ్వనింపచేశారు. ఆ తరువాత తూము నరసింహదాసు పాల్వంచ పరగణా పాలకుడై భద్రాచల క్షేత్రానికి విశిష్టసేవలందించారు. చాలాకాలానికి త్యాగరాజస్వామి 68 ఏళ్ల వయస్సులో తీర్థయాత్రలు చేపట్టారు. శ్రీరంగం, చెన్నై మీదుగా తెలుగునాట ఆయన నాగలాపురం వరకు ఆయన వచ్చినట్లు చరిత్రకారులు చెబుతారు. ఎనభై ఏళ్ల వయసులో సిద్ధిపొందడానికి అయిదురోజుల ముందు పుష్యబహుళ ఏకాదశినాడు ఆపత్ సన్యాసం స్వీకరించారు త్యాగరాజస్వామి. పుష్యబహుళ పంచమినాడు నాదబ్రహ్మాన్ని ఉపాసించి కపాలభేదన సిద్ధి పొందారు. తిరువయ్యార్ క్షేత్రంలో ప్రతి సంవత్సరం పుష్యమాసంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు. భారతదేశంతో పాటుగా అనేక పాశ్చాత్యదేశాల్లో సైతం త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతాయి.

1. జగదానందకారక – నట రాగం
2. దుడుకుగల నన్నే – గౌళ రాగం
3. సాధించనే ఓ మనసా – అరభి రాగం
4. కనకనరుచిరా – వరాళి రాగం
5. ఎందరోమహానుభావులు – శ్రీ రాగం

– అనే త్యాగరాజ విరచితమైన ఘనరాగ పంచరత్న కీర్తనలు ఆరాధనలో భాగంగా ఆలపించడం ఈ ఉత్సవాలకు ప్రత్యేకం.

– డాక్టర్ కె. పూర్ణప్రజ్ఞభారతి

ధర్మసందేహాలు

దీపారాధన గాలికి కొండెక్కితే అపశకునంగా భావిస్తారు. ఇది సరైన పనేనా?



దీపారాధనను ఆర్పకపోవడం మన సంప్రదాయం. ఇది అగ్నిఆరాధనలో భాగం. యజ్ఞయాగాది క్రతువులు చేసేటప్పుడు సమిధలతో ఆహుతులు సమర్పిస్తారు. అక్కడ జ్వాల పెరిగితే, పాలు కలిపిన నీళ్లు చిలకరించి నియంత్రిస్తారు. ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటినుంచి భూమి, భూమిపైన ఓషధుల సాయంతో అన్నరూపంగా ఈ పంచతత్వాలను స్వీకరించి మనిషి ఏర్పడ్డాడు. అగ్ని పెరగడానికి గాలి సాయపడుతుంది. అగ్ని చిన్నదిగా ఉంటే అదే గాలి ఆర్పివేస్తుంది. మనలోని జ్ఞానాగ్నికి దీపం ప్రతీక. అది నిరంతరం వెలుగుతూ ఉండాలి. అందుకే దీపం ఆరిపోతే అపశకునం అంటారు. గాలిలో దీపం పెట్టి దేముడా నీదే భారం అంటామా? రక్షించుకోవడం మన బాధ్యత.అప్పుడే కొండెక్కిన దీపాన్ని మరోసారి వెలిగించవచ్చు. నిన్నటిరోజు చేసిన దీపారాధనలో మాత్రం నూనె, వత్తి కొత్తవి వేయకుండా దీపారాధన చేయకూడదు.

భగవంతునికి మొక్కులు ముడుపులు చెల్లించడం అవసరమా? మన డబ్బు భగవంతుడు ఆశిస్తాడా?



సర్వేగుణాః కాంచనమాశ్రయంతి అన్నారు. అంటే లోకంలోని మంచిచెడు గుణాలన్నీ ధనాన్ని ఆశ్రయించుకుని ఉంటాయి. కలియుగ మానవులకు ఆశామోహాలు ఎక్కువ. అందుకే మనం ఎక్కువ సందర్భాల్లో స్వార్థంతోనే ధనం సంపాదిస్తాం. మనలోని స్వార్థగుణమే మన సంపదకు దోషాన్ని ఆపాదిస్తుంది. అటువంటి దోషాలన్నీ తీసేసి స్థిరమైన సంపదను అనుగ్రహించమని కోరుకుంటూ భక్తుడు హుండీలో డబ్బు వేస్తాడు. దేవుడి హుండీలో పడేదంతా పాపపు సొమ్ము అనకూడదు. ఆయనను చేరిన తర్వాత అదంతా పవిత్రత పొందుతుంది.

దోషగుణాన్ని తీసివేసి వైరాగ్య సంపదను మనకు అనుగ్రహించేందుకు ఈ సంప్రదాయం ఉంది. సిరిసంపదలు కూడబెట్టడం గొప్పవిషయం కాదు. వాటిని ఇష్టపూర్తిగా వదులుకోవడంలోనే నిజమైన మానసిక ఆనందం ఉంది. ఇతరులకు ఇవ్వడంలోనే తృప్తి ఉంది.ఈ కానుకలు, ముడుపులు ఆయనకు మనమే ఇస్తున్నామనుకుంటే తప్పే అవుతుంది. ధన, వస్తురూపమైన ఐశ్వర్యంపై వైరాగ్యభావనతో ఆయనకు సమర్పించాలి. ఈ వైరాగ్యభావన నుంచే ముముక్షుభావన పెరుగుతుంది.

సమాధానాలు : డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016


మారేడుదళం

ఆగమ సంప్రదాయం

భారతీయ శిల్పశాస్త్రానికి మూలం ఆగమవిద్య. దేవాలయ నిర్మాణంలో, నిర్వహణలో కూడా ఆగమాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. దేవాలయానికి స్థలం ఎంపిక నుంచి మూలమూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమం వరకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మనకు ఆగమాలే చెబుతాయి. ఆగమశాస్త్రాన్ని అధ్యయాన్ని చేస్తే శిల్పశాస్త్రంతో పాటు ఆలయ సంప్రదాయాలపై కూడా అవగాహన కలుగుతుంది. ఆలయాన్ని దర్శించవచ్చే భక్తులతో పాటు నూతనంగా ఆలయాన్ని నిర్మించదలుచుకున్న వారికి కూడా కరదీపికలా ఉపకరించే పుస్తకాన్ని ఆలయాలు – ఆగమాలు పేరుతో ఆగమవిద్వాన్ కందుకూరి వేంకటసత్య బ్రహ్మాచార్య వెలువరించారు. శైవాగమాలను విస్తృతంగా చర్చించిన ఈ పుస్తకం ఇతర ఆగమాలను గురించి కూడా పరిచయాత్మకంగా చెబుతుంది. ఆలయ దిక్ నిర్ణయం, అష్టాదశ క్రియలు, ఆరాధన అంశాలు, దేవాలయ దర్శనం వంటి ఎన్నో విషయాలు పది ప్రధాన శీర్షికల క్రింద, చక్కటి బొమ్మలతో సహా అందించిన విధానం పాఠకులలో ఆసక్తి పెంచుతుంది. ఈ గ్రంథం సరికొత్త ముద్రణ ప్రస్తుతం అందుబాటులో ఉంది.

ఆలయాలు – ఆగమాలు

రచన: కందుకూరి వేంకటసత్య బ్రహ్మాచార్య, పేజీలు: 224, వెల: రూ.250, ప్రతులకు: శ్రీకామాక్షీదేవి పూజాపీఠం, శిల్పకళాభారతి సమీపంలో, విద్యాధరపురం, విజయవాడ. ఫోన్ నెం. 9491411090



మనం స్పోర్ట్స్
మంగళవారం, 2 జనవరి, 2018
www.manamnews.com

కేప్‌టౌన్‌లో కోహ్లీ-అనుష్క షాపింగ్

కేప్‌టౌన్: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ-అనుష్క శర్మ దంపతులు దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో షాపింగ్ చేస్తూ సందడిగా గడిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం కోహ్లీ సేన ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి టీమిండియా క్రమం తప్పకుండా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటుంది. ఆదివారం శిక్షణ శిబిరం ముగించుకున్న కోహ్లీ తన సతీమణి అనుష్కతో కలిసి షాపింగ్‌కు వెళ్లాడు. అభిమానులు ఎవరో వీరి ఫొటో తీసి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. దీంతో ఇప్పుడు ఇది కాస్తా వైరల్‌గా మారింది. భారత్-దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు 5న ప్రారంభంకానుంది. నూతన సంవత్సర వేడుకల అనంతరం అనుష్క తిరిగి భారత్ వచ్చి యథావిధిగా తన సినీ షెడ్యూల్స్‌తో బిజీగా గడపనుంది.

డిసెంబరు 11న కోహ్లీ-అనుష్కల వివాహం ఇటలీలో అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం ఢిల్లీ, ముంబైలో ఈ జోడీ ప్రత్యేక విందు కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. డిసెంబరు 27న కోహ్లీ సేన దక్షిణాఫ్రికా పర్యటనకు బయలుదేరిన సంగతి తెలిసిందే.



బెన్ స్టోక్స్‌కు మళ్లీ నిరాశే

లండన్: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో విచారణ ఎదుర్కొంటున్న ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఆ దాడి కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన స్టోక్స్.. ఆస్ట్రేలియాతో త్వరలో ఆరంభమయ్యే వన్డే సిరీస్ నుంచి కూడా వైదొలగాల్సి వచ్చింది. తొలుత స్టోక్స్‌కు వన్డే జట్టులో చోటు కల్పించనప్పటికీ, అతనికి క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్(సీపీఎస్) నుంచి ఇంకా ఎటువంటి క్లియరెన్స్ లభించలేదు. దాంతో అతన్ని వన్డే జట్టు నుంచి తప్పిస్తున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) తెలిపింది.



'మంగళవారం యూకే నుంచి బయల్దేరే వన్డే బృందంతో కలిసి స్టోక్స్ పయనించడం లేదు. బ్రిస్టల్ ఘటనకు సంబంధించి సీపీఎస్ నిర్ణయం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఆ నేపథ్యంలో స్టోక్స్‌ను ప్రస్తుతానికి జట్టు నుంచి తప్పిస్తున్నాం. ఒకవేళ స్టోక్స్‌పై ఎటువంటి కేసు నమోదు కాకపోతే అతన్ని 48 గంటల్లో జట్టులో తిరిగి ఎంపిక చేస్తాం. ఇప్పటికైతే స్టోక్స్‌ను వన్డే జట్టు నుంచి తప్పిస్తున్నాం. అతని స్థానంలో డేవిడ్ మాలన్‌కు అవకాశం కల్పిస్తున్నాం' అని ఈసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది.

'డీజే వాలే బాబు' రవిశాస్త్రి

కేప్‌టౌన్: కొత్త ఏడాదికి కొద్ది గంటల ముందు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ రవిశాస్త్రి ట్విటర్ ద్వారా ఓ ఫొటో పోస్టు చేసి అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. డీజే అవతారంలో శాస్త్రి అభిమానుల్ని ఫిదా చేశాడు. ఇక అభిమానులు వూరుకుంటారా.. 'డీజే రవి వావ్' అంటూ తెగ కామెంట్లు పెట్టారు.



ప్రస్తుతం రవిశాస్త్రి కోహ్లీ సేనతో కలిసి దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. భారత్-దక్షిణాఫ్రికా మధ్య 3 టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20ల షెడ్యూల్ ఈ నెల 5 నుంచి ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో కోహ్లీ సేన ఇప్పటికే సఫారీ గడ్డపై అడుగుపెట్టి క్రమం తప్పకుండా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటుంది. తాజాగా భారత జట్టు కోచ్ రవిశాస్త్రి తన ట్విటర్ ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. అంతేకాదు ఓ ఫొటోను పంచుకున్నాడు. ఈ ఫొటోలో రవిశాస్త్రి డీజే అవతారంలో అలరించాడు. కేప్‌టౌన్‌లోని ఓ పబ్‌లో దిగిన ఫొటోగా తెలుస్తోంది.

ఈ ఫొటోకు అభిమానులు ఫిదా అయిపోయారు. గతంలో కామెంటేటర్‌గా అలరించిన శాస్త్రి ఇప్పుడు డీజేగా మారాడంటూ అభిమానులు పెద్ద సంఖ్యలో ట్వీట్లు పెడుతున్నారు. దీంతో ఇప్పుడు రవిశాస్త్రి ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'డీజే రవి వావ్', 'డీజే వాలే బాబూ' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు సఫారీ గడ్డపై భారత్ టెస్టు సిరీస్ గెలవలేదు. ఈ నేపథ్యంలో త్వరలో ప్రారంభమయ్యే సిరీస్‌పైనే ఇప్పుడు అందరి చూపులు.



రికార్డు.. చెరిపేస్తారా

సఫారీలతో సిరీస్ పెద్ద సవాలే

• గెలుపు కోసం కోహ్లీ సేన కసరత్తు • అందరి దృష్టీ టీమిండియాపైనే



షమీ

(క్రీడా విభాగం)

వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమిండియా ఈ సారి సఫారీ గడ్డపై ఉన్న పేవలమైన రికార్డును చెరిపేస్తుందా.. 2017 సంవత్సరంలో మరుపు రాని విజయాలతో మురిపించిన టీమిండియా 2018లో కూడా ఆ సంప్రదాయాన్ని కొన సాగిస్తుందా వేచి చూడాలి. ఈ కొత్త ఏడాది మాత్రం భారత్‌కు అంత సులువు కాదనే చెప్పాలి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది విదేశీ గడ్డపై ఎక్కువ టోర్నీలు ఆడాల్సి ఉంది. అవి కూడా బౌన్స్‌కు అనుకూలించే దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి పటిష్ట జట్లతో భారత్ ఈ ఏడాది సిరీస్‌లు ఆడునుంది. ఇందరులో విజయం సాధించడం టీమిండియాకు అంత సులుకు కాదని విష్లేశకులు చెపుతున్నారు. 2017లో మాత్రం భారత్ ఒక్క సిరీస్‌ను కూడా కోల్పోకుండా అజేయంగా సీజన్‌ను ముగించింది. అందులో శ్రీలంకలో మాత్రమే భారత్ టెస్టు సిరీస్‌లో పాల్గొంది. ఇక, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంకలతో స్వదేశంలోనే పోటీ పడింది. దీంతో భారత్ పెద్దగా కష్టపడకుండానే విజయాలు అందుకుంది. టెస్టు, వన్డేల్లో భారత్ నిలకడగా విజయాలు సాధించి ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలే సృష్టించింది. కానీ, 2018లో మాత్రం విరాట్ కోహ్లీ సేనకు అత్యంత కఠిన పరీక్షలు తప్పేలా లేవు. ఈ నెల (జనవరి)లో దక్షిణాఫ్రికాతో జరిగే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోహ్లీ సేన సత్తాకు పరీక్షగా విశ్లేషకులు అంచన వేస్తున్నారు. ఈ సిరీస్‌లో గెలిస్తే మాత్రం భారత్‌కు ఇక ఎదురే ఉండదు. గతంలో దక్షిణాఫ్రికా స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుస సిరీస్‌లలో విజయాలు సాధించి ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. అయితే భారత్ మాత్రం విదేశాల్లో ఎప్పుడూ కూడా అధిపత్యం చెలాయించలేదు. ఒక్క శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్ గడ్డపై మాత్రమే భారత్ హవా కొనసాగించింది. కానీ, విండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో జరిగిన టెస్టు సిరీస్‌లలో అవమానకర ఓటములను చవిచూసింది. మిగతా దేశాలతో పోల్చితే కివీస్‌లో మాత్రమే భారత్‌కు కాస్త మెరుగైన రికార్డు ఉంది. ఇక, దక్షిణాఫ్రికాలో ఇప్పటి వరకు ఒక్క సిరీస్‌లో కూడా విజయం సాధించలేక పోయింది. కేవలం రెండు టెస్టుల్లో మాత్రమే విజయం సాధించింది. అంతేగాక వన్డేల్లోనూ టీమిండియా రికార్డులు చాలా పేలవంగా ఉంది. ఇప్పటివరకు 28 వన్డేలు ఆడితే అందులో కేవలం ఐదింటిలో మాత్రమే గెలుపొందింది. దీన్ని బట్టి సఫారీ గడ్డపై టీమిండియా రికార్డు ఎంత పేలవంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే భారత్ దక్షిణాఫ్రికాలో పేలవంగా ఆడిన మాట వాస్తవమే అయినా ఇక్కడ ఒక్కసారి కూడా క్లీన్‌స్వీప్‌కు గురికాక పోవడం కాస్త ఊరట కలిగించే అంశమే. ఇది భారత్‌కు సానుకూలమైన అంశంగా చెప్పుకోవచ్చు. ఇది అంత గతం.. కానీ, ఇప్పుడు కోహ్లీ సేన క్రికెట్ చరిత్రలో పెను సంచలనలు సృష్టిస్తుంది.

జోరుమీదున్నారు..


వరుస విజయాలతో కోహ్లీ సేన జోరు మీదున్నారు. ఈ సారి టీమిండియా తప్పక గెలుస్తుందనే నమ్మకం చాలా మందిలో ఉంది. దీనికి ఇటీవలే కాలంలో కోహ్లీ సేన ప్రదర్శనే నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోను కోహ్లీ సేన చాలా బలంగా ఉంది. ఒంటి చెత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా ఉన్న ఆటగాళ్లకు కొదవలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫాస్ట్ బౌలింగ్ చాలా పటిష్టంగా ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లతో కూడిన బలమైన బౌలింగ్ లైనప్ టీమిండియాకు అందుబాటులో ఉంది. ఫాస్ట్ బౌలర్లకు సహకరించే దక్షిణాఫ్రికా పిచ్‌లపై భారత్ స్పీడస్టర్లు ప్రకంపనలు సృష్టించడానికి తహతహలాడుతున్నారు. మహ్మద్ షమీ, భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మలతో భారత బౌలింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక హార్దిక్ పాండ్యా, జస్‌ప్రిత్ బుమ్రాల రూపంలో మరో రెండు అస్త్రాలు ఉన్నాయి. ఇక, ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లుగా పేరు తెచ్చుకున్న రవిచంద్రన్ అశ్విన్,రవీంద్ర జడేజాలు కూడా ఉన్నారు. మరోవైపు ఇప్పుడు భారత స్పిన్‌లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న చాహల్, కుల్దీప్ యాదవ్‌లు కూడా భారత్‌కు కలిసి వచ్చే అస్త్రాలే. ఇక ఈ సిరీస్‌లో సఫారి బ్యాట్స్‌మెన్‌కు భారీ పరిక్షే పెట్టడం ఖాయంగా కనిపిస్తుంది.



పుజారా

పటిష్టమైన బ్యాటింగ్ లైనప్..

ఇక, భారత బ్యాటింగ్ లైనప్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ విభాగంలో భారత్ ఎప్పటినుంచో చాలా పటిష్టంగా ఉంది. గతేడాది టీమిండియా బ్యాట్స్‌మెన్ నిలకడైన ఆటతో ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టించారు. ఓపెనర్లు మురళీ విజయ్, శిఖర్ ధావన్, కెఎల్. రాహుల్‌లు అద్భుత బ్యాటింగ్‌తో భారత్‌కు శుభారంభాలు ఇస్తూ భారీ స్కోర్లకు పునాదులు వేశారు. ఈ సారి కూడా వీరిపై జట్టు భారీ ఆశలే పెట్టుకుంది. గాయం కారణంగా శిఖర్ ధావన్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. అయితే కెఎల్ రాహుల్ రూపంలో మరో అగ్రశ్రేణి ఓపెనర్ ఉండనే ఉన్నాడు. మురళీ విజయ్ శ్రీలంక సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. ఈ సారి కూడా రాణిస్తాడని జట్టు భావిస్తుంది. మరోవైపు నయా వాల్ చటేశ్వర్ పుజారా రూపంలో భారత్‌కు మరో గొప్ప అస్త్రం ఉండనే ఉంది. ఎటువంటి పరిస్తుల్లోనైనా తెలికగా బ్యాటింగ్ చేసే సత్తా పుజారాకు ఉంది. ఇటీవల కాలంలో పుజారా ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. గతేడాది టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌లలో రెండో స్థానంలో నిలిచాడు. ఇక, భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా కిందటి సీజన్‌లో అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ సారి కూడా జట్టు అతనిపై భారీ ఆశలు పెట్టుకుంది. ప్రస్తుతం టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్న కోహ్లీ ఈ బౌన్సీ పిచ్‌లపై కూడా తన సత్తాను చాటాలని అందరు అనుకుంటున్నారు. టీమిండియా విజయాల్లో కోహ్లీ పాత్ర కీలకమైంది. ఎలాంటి పరిస్థితులనుంచైన జట్టును తిరిగి మంచి స్థితికి తెచ్చే సత్తా ఇతనికి ఉంది. గతేడాది వరుస డబుల్ సెంచరీలతో క్రికెట్‌లో సంచలనాలు సృష్టించాడు. అయితే ఈ కొత్త సీజన్ ఆరంభంలోనే పటిష్ట సఫారిలతో సవాల్‌కు కోహ్లీ సేన సిద్ధమైంది. కోహ్లీ సత్తాకు ఇది అసలైన పరిక్ష, దీనికి కోహ్లీ కూడా తన ప్రత్యేక వ్యూహాలతో సిద్ధంగా ఉన్నాడు. కెప్టెన్‌గా ముందుండి జట్టును నడిపంచేందుకు తహతహలాడుతున్నాడు. కాగా, గతేడాది పెలవమైన ఆటతో నిరాశ పరిచిన అంజిక్య రహానే ఈ కొత్త సీజన్‌లో మాత్రం గాదిలో పడుతాడని అందరు భావిస్తున్నారు. ఇతను తిరిగి ఫాంలో వస్తే టీమిండియాకు కలిసోచ్చే అంశమే. మరోవైపు రోహిత్ శర్మ కూడా విధ్వంసకర బ్యాట్స్‌మనే, హార్దిక్ పాండ్యా, జడేజాల రూపంలో భారత్‌కు గొప్ప ఆల్ రౌండర్లు కూడా ఉన్నారు. చివర్లో భువనేశ్వర్, అశ్విన్, షమీ కూడా అవసరం వచ్చినప్పుడు బ్యాట్‌తో కూడా రాణించగల సత్తా వీరికి ఉంది. టీమిండియాలో అందరు కలిసి కట్టుగా రాణిస్తే సఫారి గడ్డపై చిరత్ర సృష్టించడం కష్టమేమి కాదు.



రాహుల్

మేము ఇలాంటి పిచ్‌ను కోరలేదు: కోహ్లీ

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో ప్రాక్టీస్ మ్యాచ్ వద్దనుకుంటే ఇప్పుడ వారు ప్రాక్టీస్ సెషన్ కోసం కేటాయించిన పిచ్ సైతం ఏమాత్రం బాగాలేదని, ఈలాంటి పిచ్‌ను మేము కోరుకోలేదని కోహ్లీ మండిపడ్డాడు. తాము పచ్చిక కూడిన పిచ్‌ను అడిగితే, ఏ మాత్రం జీవంలేని పిచ్‌ను తయారు చేశారని విమర్శించాడు. ఈ తరహా పిచ్‌లు టెస్టు మ్యాచ్ ప్రాక్టీస్‌కు సరైనవి కావన్నాడు. సఫారీలతో టెస్టు సిరీస్‌కు ముందు ఎటువంటి ప్రాక్టీస్ మ్యాచ్ లేకపోవడంతో దానికి బదులుగా ప్రాక్టీస్ సెషన్ కోసం కేప్‌టౌన్ నగరంలోని వెస్టర్న్ ప్రోవెన్స్ క్రికెట్ క్లబ్‌ను కేటాయించారు. ఆ క్రమంలోనే తమకు పచ్చికతో కూడిన పిచ్ కావాలని విరాట్ సేన డబ్ల్యూపీసీసీకు తెలిపింది. కాకపోతే పిచ్‌లో ఎటువంటి పచ్చిక లేకుండా తయారు చేయడంపై కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇక్కడ మాకు ఉన్న ఒకే ఒక్క ఆప్షన్ సాధ్యమైనంత ఎక్కువ నీటితో తడిపిన పిచ్‌తో పాటు గట్టిగా చదును చేసిన పిచ్ ఉంది. దక్షిణాఫ్రికా పరిస్థితులకు అనుగుణంగా పేస్ బౌలింగ్‌ను ప్రాక్టీస్ చేయడానికి పిచ్‌ను తయారు చేయమన్నాం. అయితే ప్రాక్టీస్ సెషన్ కోసం తయారు చేసిన పిచ్ ఎటువంటి జీవం లేకుడా ఉంది. ఈ తరహా పిచ్‌పై నాణ్యమైన ఆట జరుగుతుందా లేదా అనేది కచ్చితంగా చెప్పలేం. మరి అటువంటప్పుడు పిచ్‌ను ఇలా తయారు చేయడం ఎందుకు. రెండు రోజుల ఆట మాత్రమే ఉన్నప్పుడు ఇటువంటి పిచ్‌లు తయారు చేస్తారు. క్రీజ్‌లోకి కచ్చిన ఆటగాళ్ల తొందరగా యాభై పరుగులు చేయడం, ఆపై పెవిలియన్‌కు పరిమితం కావడానికే ఈ పిచ్‌లు రూపొందిస్తారు' అని కోహ్లీ విమర్శించాడు. ప్రాక్టీస్ సెషన్ పిచ్‌పై టీమిండియా జట్టు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని డబ్ల్యూపీసీసీ ధృవీకరించింది. వారు పూర్తి పచ్చికతో కూడిన పిచ్‌ను తయారు చేయమన్నది వాస్తవమేనని, కాకపోతే దాన్ని తయారు చేయడానికి శతవిధాలా ప్రయత్నించామన్నారు. బ్యాలెన్స్ చేస్తూ పిచ్‌ను రూపొందించడం వల్ల వారు కోరిన పిచ్‌ను ఇవ్వలేక పోయామని డబ్ల్యూపీసీసీ గ్రౌండ్స్‌మన్ తెలిపాడు.



తొలి టెస్టుది బౌన్సీ పిచ్ కాదా!

భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్ట్‌కు బౌన్సీ పిచ్ సందేహామే! అదనపు పేస్, బౌన్స్‌కు ఇబ్బంది పడతారా అని భావిస్తున్న కోహ్లీసేనను కేప్‌టౌన్ వికెట్ అంత ఇబ్బంది పెట్టకపోవచ్చని తెలుస్తోంది. జనవరి 5న తొలి మ్యాచ్ ప్రారంభం కాబోతోంది. ఆతిథ్య జట్టుకు అనుకూలంగా పిచ్‌ను రూపొందించే పరిస్థితి కనిపించడం లేదు. చాన్నాళ్లుగా ఆ ప్రాంతంలో తీవ్ర కరవు ఉంది. నీటి వినియోగం తక్కువగా ఉంది. అక్కడి ప్రజలు రోజుకు 87 లీటర్ల కన్నా ఎక్కువ నీటిని వినియోగించడానికి వీల్లేదని ఆదేశాలు ఉన్నాయి. మైదానాన్ని తడిపేందుకు బోరు నీటినే వినియోగిస్తున్నా పరిస్థితి భిన్నంగా ఉందని పిచ్ క్యూరేటర్ తెలిపారు.

'బోరు నీటితో ఎప్పటిలాగే ప్రతిరోజు పిచ్‌ను తడుపుతున్నాం. ఔట్‌ఫీల్డ్‌ను మాత్రం వారానికి రెండుసార్లే తడుపుతున్నాం. అందుకే మైదానం అంత పచ్చికతో అందంగా కనిపించకపోవచ్చు. పొడిగా ఉండచ్చు. పిచ్‌పై పచ్చికను పెంచడం కష్టమే! పేస్‌కు అనుకూలించే పట్టు దొరకని టర్న్ అవ్వని పిచ్‌ను రూపొందించాలని అనుకుంటున్నాం. ఐతే రోజూ ఉదయం వానపడి తర్వాత ఎండకాస్తేనే అది సాధ్యం! అలా ఎన్నిరోజులు జరుగుతుందో చెప్పలేం' అని కేప్‌టౌన్ పిచ్ క్యురేటర్ ఇవాన్ ఫ్లింట్ అన్నాడు.

వాండరర్స్, సెంచూరియన్ తరహాలో కేప్‌టౌన్ పిచ్ ముందు బౌలర్లకు అనుకూలించినా తర్వాత ఇబ్బందులు ఎదురుకావచ్చు అని ఫ్లింట్ అంటున్నాడు. పిచ్‌పై చక్కగా పచ్చిక ఉంటేనే బంతి స్వింగ్ అవుతుంది. అదనపు బౌన్స్ లభిస్తుంది. నెర్రలు వాసి పొడిగా ఉంటే మాత్రం స్పిన్‌కు అనుకూలిస్తుంది.

'సఫారీల బౌలింగ్‌ను ఎదుర్కోవడం కష్టమే'

కేప్‌టౌన్: సొంతగడ్డపై దక్షిణాఫ్రికా అత్యంత ప్రమాదకరమైన జట్టు అనడంలో ఎటువంటి సందేహం లేదని టీమిండియా ఆటగాడు రోహిత్ శర్మ పేర్కొన్నాడు. ప్రపంచంలో అత్యుత్తమ బౌలింగ్ కల్గిన సఫారీలను ఓడించడం అంత తేలిక కాదన్నాడు. ప్రధానంగా బౌన్సీ వికెట్‌పై దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కోవడం కష్టమని రోహిత్ అభిప్రాయపడ్డాడు. జనవరి 5 వ తేదీ నుంచి కేప్‌టౌన్‌లో తొలి టెస్టు ఆరంభం కానున్న నేపథ్యంలో రోహిత్ మీడియాతో మాట్లాడాడు.



'మెరుగైన జట్లలో సఫారీ ఒకటి. ప్రపంచ అత్యుత్తమ బౌలింగ్ దక్షిణాఫ్రికా సొంతం. సఫారీ గడ్డ మీద స్టెయిన్ అండ్ కో పేస్ బృందాన్ని ఎదుర్కోవడం కచ్చితంగా సవాల్‌తో కూడుకున్నది. సఫారీలపై పైచేయి సాధించాలంటే శ్రమించాల్సి ఉంది. అందుకు టీమిండియా సిద్ధంగా ఉంది' అని రోహిత్ పేర్కొన్నాడు.

చరిత్ర సృష్టించిన విదర్భ

• తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

• ఫైనల్లో 9 వికెట్లతో ఢిల్లీపై గెలుపు

ఇండోర్: రంజీ ట్రోఫీ చరిత్రలో విదర్భ జట్టు చరిత్ర సృష్టించింది. ఇండోర్‌లోని హోల్కర్ మైదానంలో జరిగిన రంజీ ట్రోఫీ 2017-18 సీజన్ ఫైనల్‌లో ఢిల్లీ జట్టును మట్టికరిపించింది. తద్వారా 83 ఏళ్ల రంజీ చరిత్రలో తొలిసారి ట్రోఫీని కైవసం చేసుకుంది.

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 295 పరుగులు సాధించగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన విదర్భ జట్టు అక్షయ్ వినోద్ వాడ్కర్ అజేయ శతకంతో 547 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇక సెకండ్ ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 280 పరుగులు సాధించింది.

ఆపై స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన విదరే ఒక వికెట్ కోల్పోయి అలవోక విజయాన్ని, తొలిసారి రంజీ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇంక ఒక రోజు ఆట మిగిలి ఉండగానే ఢిల్లీను చిత్తు చేసి భారీ విజయం నమోదు చేసుకోవడంతో విదర్భ అభిమానులు పండుగా చేసుకున్నారు. టోర్నీ ప్రారంభం నుంచే సమిష్టి కృషితో విదర్భ జట్టు తన దూకుడును ప్రదర్శిస్తూ వస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోను విదర్భ ఆటగాళ్ల అద్భుత ఆటను కనబర్చారు. ముఖ్యంగా బౌలింగ్‌లో రజ్‌నీష్ గుర్బానీ మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీయాగా, వఖారే రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లతో చెలరేగడంతో ఢిల్లీ రెండు ఇన్నింగ్స్‌లలో కూడా 300 పరుగులను కూడా దాటలేక పోయింది.. మరోవైపు బ్యాటింగ్‌లో అక్షయ్ వాడ్కర్ (133) అజేయ సెంచరీతో పాటు, వసీమ్ జాఫర్ (78), సర్వాతే (79), సిద్దేశ్ నెరల్ (74), ఫజల్ (67)లు రాణించారు. దీంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 547 పరుగుల బారీ స్కోరును సాధించింది. 528/7 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగిన విదర్భ 547 పరుగులకు ఆలౌటై పోయింది. దీంతో విదర్భకు 252 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఢిల్లీ 280 పరుగులకే కుప్పకూలి విదర్భ ముందు 29 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. ఈ లక్ష్యాన్ని విదర్భ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి చేధించింది.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.